fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం


Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 29 | విజయవాడ, మంగళవారం 30 జనవరి 2018 | 12+12 పేజీలు వెల : 4.00













కార్పొరేట్ విరాళాల్లో బిజెపికి 89 శాతం

ఎడిఆర్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ : కార్పొరేట్ సంస్థల నుండి విరాళాలు పొందడంలో బిజెపి అగ్రభాగాన నిలిచింది. 2016-17 సంవత్సరంలో మొత్తం 325.27 కోట్ల విరాళాలు ఆయా సంస్థల నుండి అందగా వాటిల్లో 290.22 కోట్లు ఒక్క బిజెపికే వెళ్లాయని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అనే సంస్థ వెల్లడించింది. ఎన్నికల నిధుల సేకరణకు సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్(సిబిడిటి) వద్ద 21 ట్రస్టులు నమోదు చేసుకోగా వాటిల్లో రెండిటికి ఎక్కువ భాగం నిధులు వచ్చాయి. అవన్నీ బిజెపికి వెళ్లాయి. వీటిల్లో సత్య-ప్రుడెంట్‌కు ఎక్కువ నిధులు వచ్చాయి. దీనికి నిధులిచ్చిన వారిలో డిఎల్ఎఫ్ గ్రూపు, యుపిఎల్, జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ, అండ్ పిరమల్ ఎంటర్ ప్రైజెస్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్సార్ అండ్ గ్రాసిమ్ సిమెంట్స్ వంటి సంస్థలున్నాయి. అలాగే జనతా నిర్వాచక్ ట్రస్ట్ కూడా నిధులు సేకరించింది. దీనిలో జనతా నిర్వాచక్ ట్రస్ట్‌కు వచ్చిన నిధులను 100 శాతం బిజెపికి మళ్లించింది. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ కార్పొరేట్ సంస్థల నుండి రూ.283.73 కోట్లు సేకరించింది. వీటిని తొమ్మిది రాజకీయ పార్టీలకు మళ్లించింది. దీనిలో కాంగ్రెస్‌కు రూ.16.5 కోట్లు, శిరోమణి అకాళీదళ్‌కు రూ.9 కోట్లు, సమాజ్‌వాదీ పార్టీకి రూ.6.5 కోట్లు, అమ్‌ఆద్మీ, శివసేన, తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్‌దళ్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్‌కు కోటి రూపాయల చొప్పున ఇచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి నిధుల సేకరణలో ముందుంది. 2013-14లో రాజకీయ పార్టీలు కార్పొరేట్ సంస్థల నుండి విరాళాల కింద రూ.85.37 కోట్లు పొందాయి. 2014-15లో మిగతా 9లో


ఆర్థిక నిర్వహణ సవాల్

ఆర్థిక సర్వే వెల్లడి

- చమురు ధరలపై తీవ్ర ఆందోళన
- వృద్ధి రేటుపై సానుకూల అంచనాలు
- జిఎస్టీతో పారిశ్రామిక మందగమనం
- విదేశీ పెట్టుబడులపైనే ఆశలు
- కార్పొరేట్ వ్యవసాయానికి పరుగులు
- కార్మిక హక్కులు హరించే చట్టాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రానున్న సంవత్సరంలో ఆర్థిక నిర్వహణ సవాల్‌గా మారనుందని ఆర్థిక సర్వే పేర్కొంది. హద్దు అదుపూ లేకుండా పెరుగుతున్న పెట్రో ధరలు దేశ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపనున్నాయని హెచ్చరించింది. 'చమురు ధరల పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే రానున్న సంవత్సరంలో ఆర్థిక నిర్వహణ సవాల్‌గా మారనుంది' అని సర్వే పేర్కొంది. వృద్ధి రేటుపై సానుకూల అంచనాలు ఇస్తూనే, పెట్రో ధరలను అదుపు చేయలేకపోతే, దాని ప్రభావం వృద్ధిరేటుపై కూడా పడే అవకాశం ఉందని తెలిపింది. జిఎస్టీ అమలుతో పన్ను మదుపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెబుతూనే, అదే సమయంలో పారిశ్రామిక వృద్ధి ఆశించినంతగా మిగతా 3లో



కీలకాంశాలు

- 2017-18 ఆర్థిక సంవత్సరంలో 6.75 శాతం వృద్ధి
- 2019 ఆర్థిక సంవత్సరాంతానికి 7-7.5 శాతం వృద్ధి
- జిఎస్‌టి అమలుతో 50 శాతం పన్ను చెల్లింపుదారుల పెరుగుదల
- ద్రవ్యోల్బణం 3.3 శాతం వద్ద కట్టడి. గత ఆరు ఆర్థిక సంవత్సరాల్లో ఇదే అత్యల్పం
- నోట్ల రద్దుతో పొదుపు చర్యలకు ప్రోత్సాహం
- సేవా రంగంలో 15 శాతం పెరిగిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
- వ్యవసాయ రుణమాఫీ కోసం ఈ ఏడాదిలో రూ.20,339 కోట్ల ఖర్చు
- లింగ సమస్యలపై ప్రత్యేక దృష్టి. పింక్ సర్వే విడుదల

రానున్న సంవత్సరానికి ఇదీ అజెండా

- వ్యవసాయానికి సహకారం
- ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ
- బ్యాంకులకు తిరిగి పెట్టుబడులు సమకూర్చడం



జమిలి ఎన్నికలపై చర్చ జరగాలి

- నవ భారతం ప్రజల కల
- ఆర్థిక ప్రజాస్వామ్యం అంతిమ లక్ష్యం
- వ్యవసాయంలో ఘనమైన ప్రగతి సాధించాం
- ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటుకు, రాష్ట్ర శాసన సభలకు జమిలి ఎన్నికలు నిర్వహించే అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం వుందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. ప్రస్తుత విధానంలో .దేశంలో ఏదో ఒక చోట నిరంతరం ఎన్నికలు జరుగుతూ వుంటున్నాయని, దీనికి స్వస్తిపలకాల్సి వుందని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా తొలిరోజు(సోమవారం) రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. దేశంలోని 130 కోట్ల ప్రజల కల "నవ భారతం" అని, కలిసికట్టుగా దేశాన్ని నూతనంగా రూపొందించుకుందామని పిలుపునిచ్చారు. బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లుగా ఆర్థిక ప్రజాస్వామ్యం, సామాజిక ప్రజాస్వామ్యం సాధించలేకపోతే రాజకీయ ప్రజాస్వామ్యం అంతిమ లక్ష్యం పూర్తి కాదని అన్నారు. పేదరికాన్ని నిర్మూలించి, ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోందని, అవకాశాలను అందిపుచ్చుకుంటూ అంతర్జాతీయ యవనికపైనా సత్తా చాటుతున్నదని అన్నారు. 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తవుతాయని, అప్పటికి అన్ని రంగాల్లో అభివద్ధిని సాధించి "నూతన భారతం"గా రూపాంతరం చెందుతుందని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.. పార్లమెంట్ సెంట్రల్ హాలులో జరిగిన ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మాజీ ప్రధాన మంత్రులు మన్మోహన్ సింగ్, హెచ్‌డి దేవెగౌడ, కేబినెట్ మంత్రులు అరుణ్ జైట్లీ, రాజ్‌నాథ్ సింగ్, అనంత్ కుమార్, రాజ్యసభ, లోక్‌సభ ప్రతిపక్ష నేతలు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పి.జే కురియన్, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబి దొరై, యుపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, బిజెపి, కాంగ్రెస్ మిగతా 8లో

విభజన హామీల అమలుకు సహకరించండి

సిపిఐ, టిడిపి నేతలను కోరిన కొణతాల బృందం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విభజన హామీల అమలకు సహకరించాలని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ కోరారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర చర్చ వేదిక సభ్యులు విశాఖపట్నం నుంచి ఢిల్లీకి రైలు దీక్ష చేపట్టారు. ఏపి విభజన హామీలు అమలుపరచాలని, 2018-19 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, రాష్ట్ర అభివద్ధికి కేంద్రం సహకరించాలని కేంద్ర మంత్రులను, వివిధ పార్టీల మిగతా 9లో


ఢిల్లీలో కొణతాల రామకృష్ణ దీక్ష

'తలాక్' ఆమోదానికి కలిసిరండి : ప్రధాని

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి అన్ని పార్టీలు కలిసి రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కోరారు. ఇది ముస్లిం మహిళలకు ఇచ్చే బహుమతి అని వ్యాఖ్యానించారు. అన్ని పార్టీలు బిల్లుకు ఆమోదముద్రవేసి ముస్లిం మహిళల రక్షణ కోసం పాటు పడాలని పిలుపు నిచ్చారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా ఆయన సోమవారం పార్లమెంట్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్-2018 సామాన్యుడి ఆశలను, అంచనాలను అందుకుంటుందని వ్యాఖ్యానించారు. భారత వద్ధిని ప్రపంచం గుర్తించిందన్నారు. అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ సంస్థలు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ భారత్ ఆర్థిక వ్యవస్థ తీరుకు సానుకూలంగా స్పందించాయన్నారు. తాజా సమావేశాలు ప్రశాంతంగా మిగతా 9లో



ఖరీఫ్ సాగు నీటికి ప్రణాళిక



- సిఎం చంద్రబాబు సూచన
- 116 రోజులు నిర్వహణ పనులు
- జూన్‌లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే ఖరీఫ్‌కు సాగునీరు ఎంత అవసరమో వ్యవసాయశాఖ సహకారంతో అధ్యయనం చేసి, అందుకు తగినట్లుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జలవనరుల శాఖ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. నీరు ప్రగతి కింద కాలువలు, చెరువులు పటిష్ట పరచడంతోపాటు చెక్ డ్యామ్‌లకు మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. సచివాలయంలో జలవనరులశాఖపై ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిర్వహణ కమిటీలను తక్షణం నియమించి అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతను వారికి అప్పగించాలని చెప్పారు. సమర్థ నీటి నిర్వహణ పనులను వచ్చే నెల నుంచి 116 రోజులపాటు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లక్ష్యం పూర్తయిన వెంటనే జూన్‌లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. జలవనరుల సంరక్షణలో ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ. 400 కోట్ల విలువైన విద్యుత్ ఆదా చేసినట్లు చెప్పారు. వంద మీటర్ల కన్నా దిగువకు భూగర్భ జలాలు ఉన్న ప్రాంతాలపై అధికారులు మొదటిగా దృష్టిపెట్టి అక్కడ నీటి మట్టం పెరిగేందుకు కృషి చేయాలన్నారు. భూగర్భ జలాలను జలాశయాలుగా మలచాలనేది తన ఆశయమన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని తలపెట్టిన 28 ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఇప్పటికే ఏడింటిని ప్రారంభించగా మరో ఆరు ప్రాజెక్టులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. హెచ్‌ఎన్ఎస్ఎస్ రెండో దశలో భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి మార్చి 15కల్లా కుప్పానికి నీరు తరలించాలని సూచించారు. చిత్తూరుకు నీరందించేలా ఏప్రిల్ 15కల్లా అడవిపల్లి రిజర్వాయర్ సిద్ధం చేయాలని చెప్పారు. మార్చి నాటికి కొండవీటి వాగుకు ఐదు పంపులు బిగిస్తామని అధికారులకు తెలిపారు. అమరావతి భవిష్యత్ తాగునీటి అవసరాల దృష్ట్యా కృష్ణానదిపై వైకుంఠాపురం వద్ద బ్యారేజ్ నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక మిగతా 9లో

భూ కుంభకోణం నిజమే

- పోలీస్ ఉన్నతాధికారుల నివేదిక
- చంద్రబాబు సీరియస్
- ఎమ్మెల్యే బోండా పాత్రపైనా విచారణ
- పూర్తి స్థాయి నివేదికకు ఆదేశం


సతీమణితో ఎమ్మెల్యే బొండా ఉమా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలో స్వాతంత్ర్య సమర యోధుల భూమిని కబ్జా చేసిన వ్యవహారంలో సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు భార్య సునీత పాత్ర ఉందని పోలీసులు తేల్చారు. ఉద్దేశపూర్వకంగానే భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారని నివేదిక సిద్ధం చేశారు. దీన్ని సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమర్పించారు. దీనిపై సిఎం సీరియస్ అయ్యారు. ఎమ్మెల్యే పాత్రపైనా విచారణ చేయాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. లేనిపక్షంలో విజయవాడలో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, బాధ్యులను వదలొద్దని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ఎప్పుడు ఏం జరిగిందో, ఎలా జరిగిందో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలనీ ఆదేశించారు. ఈ వ్యవహారంతో ప్రజల్లో పార్టీ పట్ల ఉన్న నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని అన్నట్లు తెలిసింది. సింగ్‌నగర్ ప్రాంతంలో స్వాతంత్ర్య మిగతా 9లో

మూడు రాష్ట్రాలకు కోర్టు ధిక్కార నోటీసులు



- గో గూండాగిరిపై ఆగ్రహం
- దాడులు అరికట్టడంలో వైఫల్యం చెందాయని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : గో గూండాగిరిపై రాజస్తాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు సుప్రీం కోర్టు ధిక్కార నోటీసులు జారీచేసింది. గోవు పేరుతో జరుగుతున్న దాడులను అరికట్టడంలో వైఫల్యం చెందాయని, దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. ఏప్రిల్ మూడోతేదీలోగా వివరణ ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా, చంద్రచూడ్, కన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ దాఖలు చేసిన ఈ పిటీషన్‌పై ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అయినా ఆయా రాష్ట్రాలు స్పందించలేదు. దీంతో తుషార్‌గాంధీ కోర్టు ధిక్కరణపై మరోసారి కోర్టుకు విన్నవించారు. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికీ గోవుల పేరిట దాడులు జరుగుతున్నాయని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ ద్వారా కోర్టుకు విన్నవించారు. దీన్ని కూడా కోర్టు విచారణకు స్వీకరించింది. వీటిపై కోర్టు తీవ్రంగా స్పందించింది. వెంటనే వివరణ ఇవ్వాలని ఆయా రాష్ట్రాలను ఆదేశించింది. 2017లో తుషార్‌గాంధీ పిటీషన్‌ను స్వీకరించిన కోర్టు గోవుల పేరిట జరిగే దాడులను ఆపాలని సెప్టెంబర్ 6వ తేదీన సూచించింది. దీనికోసం అన్ని రాష్ట్రాల్లోనూ సీనియర్ పోలీసు అధికారులను, టాస్కుఫోర్సు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించింది. గోవుల పేరిట జరిగే దాడులను మిగతా 9లో

జగన్ @ 1000 కిలోమీటర్లు

మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు

ప్రజాశక్తి - సైదాపురం/గూడూరు రూరల్

వైసిపి అధినేత జగన్ పాదయాత్ర మంగళవారం వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని దాటింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా సైదాపురం ఇందుకు వేదిక అయింది. జగన్ పాదయాత్ర మంగళవారం గూడూరు శివార్లలోని క్రాస్‌రోడ్డు నుంచి ప్రారంభమైంది. గోగినేనిపురం, చెన్నూరు, తిప్పవరప్పాడు మీదుగా సైదాపురం వరకు కొనసాగింది. చెన్నూరులో జగన్‌కు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మిగతా 9లో

జెఎన్టీయు ఎ నోటిఫికేషన్‌పై 'గంటా' ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిహెచ్‌డి ప్రవేశాలకు అనంతపురం జెఎన్‌టియు విడుదల చేసిన నోటిఫికేషన్‌పై మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పిహెచ్‌డి నోటిఫికేషన్ ఉమ్మడిగా విడుదల చేయాలని ఇటీవల యూనివర్సిటీల వైస్ చాన్సిలర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని పాటించకుండా జెఎన్‌టియు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడిగా విడుదల చేయాల్సిన నోటిఫికేషన్‌ను ముందుగా ఏలా విడుదల చేస్తారని అసహనం వ్యక్తం చేశారు. మిగతా వర్సీటీలు కూడా నోటిఫికేషన్లు విడుదల చేయొద్దని, చాన్సలర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పాటించాలని గంటా ఆదేశించారు.

అభినందన



ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన సాంఘిక, గిరిజన గురుకుల విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి నక్కా ఆనంద్‌బాబు

కిలిమంజారో అధిరోహించిన విద్యార్థులకు మంత్రి ఆనంద్‌బాబు అభినందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : సాంఘిక, గిరిజన గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి మరో అరుదైన రికార్డును నెలకొల్పారు. రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు ఈ విద్యార్థులను సోమవారం వెలగపూడి సచివాలయంలో అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన 15 మంది విద్యార్థులు 19,341 అడుగుల ఎత్తుగల కిలిమంజారో పర్వతాన్ని ఈ నెల 26న అధిరోహించారన్నారు. వీరిలో పది మంది బాలికలు కాగా, మరో ఐదుగురు బాలురున్నారు. ఆ పర్వతంపై జాతీయ పతాకం సహా గురుకుల పాఠశాలల జెండాను, భారతరత్న బిఆర్ అంబేద్కర్, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలను ఎగురవేశారన్నారు. గతేడాది ఇవే విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన విషయం తెలిసిందే. సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, వీరిలో ఉన్న ప్రతిభను గుర్తించి, వెలికితీసి ప్రోత్సహించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ విద్యార్థులు చదువులోనే కాకుండా సాహస కార్యక్రమాల్లో కూడా పాల్గొంటూ విజయ శిఖరాలను చేరుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పర్వతం అధిరోహించిన వారిలో ఎస్ శిరీష, కె రమ్యశ్రీ, బి ఇందిరాబాయి, వై కవిత, సి పద్మావతి, కె మహాలక్ష్మి, జి హేమలత, బి సునీత, కె అమ్ములు, ఎంసి మహాలక్ష్మి, డి లక్ష్మణ్, బి రమేష్, వి శ్రీకాంత్, డి కృష్ణ కుమార్, బి సురేష్ ఉన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఈ విద్యార్థులతోపాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి కల్నల్ వి రాములు, అధికారులు, కోచ్‌లు ఉన్నారు.




సాధారణ వాతావరణం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో మూడు రోజుల పాటు సాధారణ వాతావరణం కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంపైకి తూర్పు, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తాయని తెలిపింది. పగటిపూట ఎండలు, రాత్రివేళ చలి ప్రభావం చూపిస్తాయని వివరించింది. నైరుతి బంగాళాఖాతానికి సమీపాన భూమధ్య రేఖా ప్రాంతంపై అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు మలయ్ ద్వీపంలో అండమాన్‌కు ఆనుకుని 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం స్థిరంగా ఉందని తెలిపింది.

సోమవారమూ సెలవేనా..!?

- సచివాలయ విధులకు డుమ్మా
- అప్ అండ్ డౌన్లతో పెరుగుతున్న గైర్హాజర్
- సమయపాలనకూ గండి
- బయోమెట్రిక్ విశ్లేషణ



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

తాత్కాలిక సచివాలయం నుంచి పాలన ప్రారంభమై 15 నెలలు కావస్తోంది. అయినా నేటికీ ఉద్యోగులు కుదురుకోలేకపోతున్నారు. నిర్లక్ష్యమో, నిర్లిప్తతో తెలియని పరిస్థితిలో సోమవారం వారి హాజరు శాతం మాత్రం గణనీయంగా పడిపోతోంది. దాదాపు సోమవారం సెలవు వారంగా మారిపోతోంది. ఒకట్లు, పదుల్లో కాకుండా వందల్లోనే ఉద్యోగుల గైర్హాజరు కనిపిస్తోంది. హాజరైన ఉద్యోగులు కూడా నిర్దిష్ట సమయంలోగా సచివాలయానికి రావడం లేదు. ఇష్టం వచ్చినప్పుడు రావడం, పోవడం సాధారణమైంది. హైదరాబాద్ నుంచి అప్ అండ్ డౌన్ విధానం హాజరుపై ప్రభావం చూపుతున్నట్లు సాధారణ పరిపాలనశాఖ అభిప్రాయపడుతోంది. ఉద్యోగుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానాన్ని అమలయ్యాక, వారి రాకపోకలపై స్పష్టత నెలకొనడంతో ముఖ్యమంత్రి కూడా ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. సాధారణ పరిపాలనశాఖ ఉద్యోగుల హాజరును బయోమెట్రిక్ విధానంపై తాజాగా లెక్కలు తేల్చింది. ప్రతి రోజూ ఎంతమంది ఉద్యోగులు వస్తున్నారు, ఏయే సమయానికి వస్తున్నారన్న దానిపై వివరాలు నమోదు చేసింది. ఇతర రోజుల కన్నా సోమ, శుక్రవారాల్లో ఉద్యోగుల హాజరు, హాజరు సమయం కూడా తగ్గిపోతున్నట్లు గుర్తించింది.

సచివాలయంలో బయోమెట్రిక్ నమోదు చేయించుకున్న ఉద్యోగులు మొత్తం 2046 మంది ఉండగా, ఈ సోమవారం వారిలో 1546 మందే హజరయ్యారు. అంటే 500 మంది గైర్హాజరైనట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. ఇటీవల కలెక్టర్ల సదస్సు కోసం కూడా గత ఆరు నెలల్లో 17వ తేదీ హాజరును వెల్లడించగా, నవంబర్‌లో గరిష్టంగా 80 శాతం నమోదుకాగా, జూన్ 17న 54 శాతమే హాజరు నమోదైంది. హాజరు సమయాన్ని కూడా అధ్యయనం చేయగా, అతి తక్కువ మంది మాత్రమే సమయపాలన పాటించి నట్లు ఖరారైంది. సోమవారం కేవలం 75 శాతం మంది ఉద్యోగులు విధులకు హాజరు కాగా, అందులో 30 శాతం మంది మాత్రమే సమయానికి హాజరయ్యారు. మొత్తం 1546 మంది విధులకు హాజరుకాగా, అందులో ఉదయం పది గంటకన్నా ముందుగా వచ్చిన వారు కేవలం 449 మంది మాత్రమేనని బయోమెట్రిక్ విధానం స్పష్టం చేసింది. ఉదయం 10.30 లోపు వచ్చిన వారు 508 మందికాగా పదకొండు గంటల సమయంలో విధులకు వచ్చిన వారు 259 మంది ఉన్నారు. ఇక 11 గంటల తరువాత వచ్చిన వారు 330 మంది ఉండడం గమనార్హం. విధులకు ఆలస్యంగా వచ్చిన వారిలో ఎక్కువ శాతం మంది ప్రతి శని, ఆదివారాల్లో హైదరాబాద్‌కు వెళ్లి, వస్తున్న వారేనని అధికారులు చెబుతున్నారు. కొంతమంది రాత్రి బయలుదేరి ఉదయం విధులకు సకాలంలో వస్తుండగా, అనేక మంది హైదరాబాద్‌లోనే ఉదయం బయలుదేరు తున్నందున విధులకు ఆలస్యంగా వస్తున్నట్లు గుర్తించారు.

సిఎంతో ఇటలీలోని ఆనస్ కంపెనీ ప్రతినిధుల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటాలియన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆనస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సిఎం చంద్రబాబుని సోమవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో కలిశారు. అమరావతి నగర నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి ఉన్నట్టు సిఎంకు వివరించారు. దోహాలో ఈ కంపెనీ నిర్మించిన ఐకానిక్ బ్రిడ్జి గురించి సిఎంకు వివరించారు. లిబియా, ఖతార్, రష్యా వంటి దేశాల్లో అనేక ప్రాజెక్టులు చేపట్టినట్టు సిఎం దృష్టికి తెచ్చారు. అమరావతిలో నిర్మాణం కానున్న రోడ్డు ప్రాజెక్టుల్లో భాగస్వామ్యంతో పాటు, ఐకానిక్ వారధి నిర్మాణం పై తమకు ఆసక్తి ఉన్నట్టు ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇటాలియన్ కంపెనీ అమరావతి నగర నిర్మాణానికి సంబంధించి ఏయే అంశాలలో అవకాశాలున్నాయో పరిశీలించి సిఆర్‌డిఏ అధికారులతో చర్చించి రావాలని ఇటాలియన్ ప్రతినిధులకు సిఎం సూచించారు. ప్రతిపాదిత కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ సిటీలో భాగస్వామ్యం కావాలని వారిని సిఎం కోరారు.

అన్య మత ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు ఉపసంహరించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో 45 మంది అన్య మతస్థులకు (హిందూయేతర్లకు)కు ఇచ్చిన షోకాజ్ నోటీసులు ఉప సంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. చాలా కాలం నుంచి వీరు టిటిడిలో ఉద్యోగులుగా పని చేస్తున్నారని యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నరసింగరావు, ఎంఎ గఫూర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు లేని ఇబ్బంది ఇప్పుడు ఎందుకు వచ్చిందో యాజమాన్యం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు. నేరుగా పూజలు, వాటికి దగ్గరగా ఉండే పనులు తప్ప మిగతా పనులను ఎవరైనా చేయవచ్చునని తెలిపారు. వీటిలో నిష్ణాతులైన వారు ఆ పనులు నిర్వహించటానికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని వివరించారు. టిటిడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న సంస్థ అని, దానిలో ఉద్యోగ నియామకాలకు మతపరమైన గీటురాళ్లు పెట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. అటువంటి నిబంధలను ఏమైనా ఉంటే పూజాదిక కార్యక్రమాలకు మాత్రమే ఉండాలని, ఇతర పనులలో ఎవరినైనా నియమించ వచ్చునని స్పష్టం చేశారు. నియామకాలలో వివక్ష పాటించటం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని తెలిపారు. అందువల్ల టిటిడి యాజమాన్యం అన్యమతస్థులైన ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతతత్వ శక్తుల ఒత్తిడికి లొంగకుండా ఉండాలని కోరారు. వెంకటేశ్వరస్వామి చుట్టూ ఉన్న లౌకిక భావాలను, ఉనికిని కాపాడాలని కోరారు. షోకాజ్ నోటీసులు ఉపసంహరణ కోసం జరిగే ఆందోళనకు మద్దతు తెలిపారు.

బడ్జెట్ కసరత్తు ప్రారంభం

శాఖల నుంచి భారీగా ప్రతిపాదనలు

గత ఖర్చులపై నీళ్లు నములుతున్న అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రానున్న వార్షిక బడ్జెట్ కూర్పుపై ఆర్థిక శాఖ సోమవారం తన కసరత్తును ప్రారంభించింది. ఐదు రోజులపాటు వివిధ శాఖలతో సమీక్షించనున్న ఆర్థిక శాఖ అధికారులు ముందుగా ఐదు శాఖలతో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటికే ఆయా శాఖలు ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఆయా శాఖలకు వాస్తవంగా కావాల్సిన నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, అందులో చేసిన ఖర్చు వివరాలను కూడా తెలుసుకున్నారు. అయితే ఈ సమయంలో పలు శాఖల అధికారుల నుంచి సరైన సమాచారం రాలేదని తెలిసింది. వాస్తవంగా కూడా ఇచ్చిన నిధులను అనేక శాఖలు సక్రమంగా ఖర్చు చేయలేకపోయాయి.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. ఈ ఏడాది రిపబ్లిక్ డే ఉత్సవాల్లో ఉత్తమ బృంద ప్రదర్శన అవార్డు ఎవరికి లభించింది?
2. భారత విదేశాంగ శాఖ నూతన కార్యదర్శి?
3. జాతీయ రోగనిరోధక దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?
4. హోండూరస్ నూతన అధ్యక్షులు?
5. 2018 ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్ విజేత?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.com
కు పంపవచ్చు.

కోడి పందేలపై హైకోర్టు సీరియస్

కోర్టు ఆదేశాలను ధిక్కరించిన ప్రజాప్రతినిధుల వివరాలివ్వండి..

కోర్టుకు హాజరైన సిఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించడంపై హైకోర్టు మరోసారి అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోడి పందేలు నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేస్తే, ప్రజాప్రతినిధులు కోర్టు ఆదేశాలను ఎలా ధిక్కరిస్తారని, వారి పూర్తి వివరాలను అందజేయాలని సోమవారం హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. భీమవరం మండలం శ్రీరాంపురం/వెంప గ్రామాల్లో కోడి పందేలతో పాటు జూదం, గుండాట, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యక్రమాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, వాటిని అడ్డుకోవా లని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారించి ఇచ్చిన ఆదేశాలు అమలు కాకపోవడంతో, తదుపరి కోర్టు ఆదేశాలతో సోమవారం సిఎస్ స్వయంగా హాజరయ్యారు. ఈనేపథ్యంలో సోమవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమష్ రంగనాథన్, న్యాయమూర్తి జైస్వాల్‌లతో డివిజన్ బెంచ్ మరోసారి విచారణ జరిపింది. కోర్టు ఉత్తర్వులు ఉన్నా...కోడి పందేల్ని నిర్వహించి తీరుతామని ప్రకటించిన ప్రజాప్రతినిధుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 144 సెక్షన్ ఉండగా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తేనే పందేలు సాధ్యమని బెంచ్ తప్పుపట్టింది. కోడి పందేల్ని నిర్వహించిన నాయకుల పేర్ల వివరాలు, వారి అడ్రస్ సహా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను ఆదేశించింది. మీరు వివరాలు ఇస్తేసరి...లేకపోతే టీవీల పుటేజీని తెప్పించుకుని కోడి పందేలు ఆడిన నేతలపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హైకోర్టు హెచ్చరించింది. ఇప్పటి వరకు ఎంతమందిపై కేసులు నమెదు చేశారనే వివరాలు అందజేయాలని సూచించింది. నిర్వాహకుల వివరా లతో పాటు వారి అడ్రస్‌లను కూడా కోర్టు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వుల్ని అమలు చేయలేకపోయిన పశ్చిమ గోదావరి జిల్లాలోని 48 మంది సబ్ ఇన్స్‌పెక్టర్లు, 43 మంది తహసీల్దార్లపై నమోదు చేసిన కేసుల వివరాలు కూడా అందజేయాలని ఆదేశిస్తూ కేసు విచారణ ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది.

అరకు వ్యాలీ కాఫీ విడుదల

రెండేళ్లలో జిసిసి లక్ష్యం 500 కోట్లు : మంత్రి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మరో రెండేళ్లల్లో గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జిసిసి) టర్నోవర్ లక్ష్యం రూ. 500 కోట్లని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం మరో మంత్రి జవహర్‌తో కలిసి ఆయన ఇన్‌స్టెంట్ అరకు వ్యాలీ కాఫీని రెండు గ్రాములు, 10 గ్రాముల ప్యాకెట్ల రూపంలో మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఇన్‌స్టెంట్ కాఫీని రెండు గ్రాముల ప్యాకెట్లు 4 లక్షలు, మరో లక్ష 10 గ్రాముల ప్యాకెట్లు విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. 2014లో రూ. 90 కోట్ల టర్నోవర్ ఉన్న జిసిసి వ్యాపారాన్ని నేడు రూ. 247 కోట్ల టర్నోవర్‌కు చేరుకునేలా కృషి చేసినట్టు చెప్పారు. ఈ ఏడాదిలో జిసిసి వ్యాపారాన్ని రూ. 317 కోట్లు సాధించేలా లక్ష్యం నిర్ణయించినట్టు తెలిపారు. గిరిజన ఉత్పత్తులతో పాటు కాఫీ గింజలను సేకరించి, ప్రాసెసింగ్ చేసి, మార్కెట్ చేసి తద్వారా వచ్చిన లాభాలను గిరిజనులకు అందించడమే జిసిసి ముఖ్య విధి అన్నారు. ప్రస్తుతం రెండు లక్షల ఎకరాల్లో కాఫీ సాగును ప్రోత్సహిస్తూ, గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. గిరిజన ఉత్పత్తులన్నింటినీ ప్రజలందరికీ అందుబాటులో ఉంచడానికి పలు ప్రాంతాల్లో రిటైల్ షాపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో సచివాలయంలో కూడా ఒక షాపును ఏర్పాటు చేస్తామన్నారు. అరకు వ్యాలీ కాఫీని ఆస్వాదించి, గిరిజనులను ఆదుకోవాలని కోరారు. అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేసింది సిఎం చంద్రబాబు అని మరో మంత్రి కె శామ్యూల్ జవహర్ అన్నారు. ఇన్‌స్టెంట్ కాఫీ రుచి చాలా బాగుందని, ఇక నుంచి రోజు దీనినే తాగుతానన్నారు. సుమారు 1993 నుంచి అరకు కాఫీ మార్కెటింగ్ ప్రయత్నాలు జరుగుతుంటే, 25 ఏళ్ల అనంతరం ఆ ప్రయత్నాలు ఫలించాయని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ అన్నారు.

రూ.402.40 కోట్లతో ఎన్టీఆర్ సుజల క్లస్టర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ సుజల పథకంలో భాగంగా రాష్ట్రంలో చేపట్టనున్న 103 క్లస్టర్లకు రూ.402.40 కోట్లను మంజూరుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హబ్ అండ్ స్పోక్ విధానంలో 11 జిల్లాలో చేపట్టే ఎన్టీఆర్ సుజల క్లస్టర్లతో 7,787 ఆవాస ప్రాంతాలను తాగునీటి సమస్య నివారణకు అధికారులు అందించిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రెండేళ్ళలో ప్లాంట్ల ఏర్పాటు పూర్తి చేసి నిధులు వినియోగించుకునేందుకు గడువు ఇచ్చారు.



స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తున్న ఎసిబి అధికారి (ఇన్‌సెట్లో) ఎసిబికి చిక్కిన అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ పసుపతి ప్రదీప్‌కుమార్

ప్రత్యేకం

సంస్థ మారినా షరా మామూలే

- గాడిన పడని 108
- ఉద్యోగులకు తప్పని వెతలు
- ఒక్కొక్కరికి 30 వేల వరకు వేతనాల బకాయి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంట్రాక్ట్ సంస్థ మారినా 108 అంబులెన్స్ సేవలందించే ఉద్యోగులకు మాత్రం తిప్పలు తప్పడంలేదు. గతంలో 108 అంబులెన్సు సేవలను జివికె గ్రూప్ నిర్వహించేది. గతేడాది డిసెంబర్ నుంచి ప్రభుత్వం వీటి నిర్వహణ బాధ్యత ' భారత్ వికాస్ గ్రూప్ '(బివిజి) సంస్థకు అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 467 అంబులెన్సులున్నాయి. వాటిలో పనిచేసే పైలట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇఎమ్‌టి) కలిపి మొత్తం 2,150 మంది సిబ్బంది ఉన్నారు. వారికి దాదాపు మూడు నెలల నుంచి వేతనాలు అందడంలేదు. కొత్త సంస్థ (బివిజి) నిర్వహణ బాధ్యత తీసుకున్నప్పటికి సిబ్బందికి వేతనాలు చెల్లించడంలేదు. గతంలో 108 నిర్వహించిన జివికె సంస్థ నుంచి కూడా సిబ్బంది వేతనాలు, వాహనాల రిపేరుకు దాదాపు రూ 3.5 కోట్లు బకాయిలున్నాయి. అలాగే ఉద్యోగులు గతంలో చేసిన అదనపు పనిగంటలు, దాదాపు 60 రోజుల సంపాద సెలవులు (ఎర్న్‌డ్ లీవ్స్)కు వేతనాలు, ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లించాల్సి ఉంది. అవి పెండింగ్‌లో ఉండగానే బివిజి సంస్థకు ప్రభుత్వం నిర్వహణ బాధ్యత అప్పగించింది. దీంతో ఉద్యోగులు తమకు రావాల్సిన వేతన బకాయిలు ఎవరు చెల్లిస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ఒక్కో సిబ్బందికి దాదాపు రూ 30 వేల వరకు వేతనాలు బకాయిలున్నాయి. మొత్తం సిబ్బందికి సుమారు రూ 6.5 కోట్లు వరకు చెల్లించాలి. బివిజి సంస్థ కొత్తగా నిర్వహణ బాధ్యతలు తీసుకునే ముందు ఉద్యోగులతో సమావేశమైంది. ఉద్యోగుల వేతనాల పెంపుతోపాటు 108 సేవలందించేందుకు అదనంగా సిబ్బందిని నియమించాలని బివిజిను కోరారు. అప్పుడు కొత్త సిబ్బందిని నియమిస్తామని, పని భారాన్ని తగ్గిస్తామని ఆ సంస్థ అధికారుల సమక్షంలో హామీ ఇచ్చింది. కాని రెండు నెలలు దాటినా కొత్తగా సిబ్బందిని నియమించలేదు.

వాహనాల రిపేర్లూ ఎక్కడికక్కడే

ప్రస్తుతం ఉన్న 108 వాహనాల్లో దాదాపు 40 శాతం రిపేర్లు ఉన్నాయి. వాటి నిర్వహణ కొత్త సంస్థకు వెళుతోందని జివికె యాజమాన్యం వాహనాల రిపేర్లు నిలిపివేసింది. గతంలోనే రిపేరు ఉన్నందున వాటిని తామెలా బాగుచేయిస్తామంటూ కొత్త సంస్థ బివిజి యాజమాన్యం చెబుతోంది. దీంతో వాహనాల రిపేర్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

"ప్రభుత్వం 108 సేవలను ప్రయివేటు సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించి చేతులు దులుపు కొని సంబంధం లేనట్లు వ్యవహరి స్తోంది. మూడు నెలల నుంచి వేతనాల్లేక ఉద్యోగులు అప్పుల పాలవుతున్నారు. ప్రాథమికంగా కనీసం ప్రభుత్వమే ఉద్యోగులకు బకాయిలు చెల్లించి, ఆ తర్వాత సదరు కాంట్రాక్ట్ సంస్థకు ఆ మొత్తాన్ని మినహాయించి చెల్లింపులు చేస్తే వెంటనే సమస్య పరిష్కారమవుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే ఆందోళనకు సిద్ధమవుతాం."

- ఎ.వి. నాగేశ్వరరావు, 108 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు

కార్మికశాఖ వద్ద 108 పంచాయతీ

గతంలో పాత సంస్థతో ఉన్న సమస్యలను పరిష్కరించకుండానే కొత్త సంస్థకు కాంట్రాక్ట్ ఇవ్వడంతో తమకు వేతనాలెవరు చెల్లిస్తారో తెలియక ఉద్యోగులు కార్మిక శాఖను ఆశ్రయిం చారు. దీంతో కార్మికశాఖ జాయింట్ కమిషనర్ రవి భూషన్‌రావు ఆధ్వర్యంలో ఉద్యోగులు, ప్రభుత్వం నుంచి నోడల్ అధికారితోపాటు జివికె, బివిజి గ్రూపు సంస్థల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఉద్యోగుల సమస్య పరిష్కారం కాలేదు. వచ్చే నెల 8న మరోసారి మరోసారి చర్చించేందుకు అధికారులు నిర్ణయించారు. చర్చలతో కాలయాపన చేస్తే కొద్ది రోజుల్లో ఆందోళనకు సిద్ధమవుతామని 108 ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

సంక్షిప్తం

అసెంబ్లీ సీట్ల పెంపుపై అమిత్ షాను కలుస్తాం

న్యూఢిల్లీ బ్యూరో : విభజన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎన్డీఏ సమావేశంలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి, ఎంపి తోట నరసింహం కోరారు. జమిలి ఎన్నికలపై ప్రతిపక్షాలతో చర్చిద్దామని ప్రధాని మోడీ అన్నారని, అసెంబ్లీ సీట్ల పెంపుపై ఒకటి రెండ్రోజుల్లో అమిత్‌షాతో భేటీ అవుతామని వారు చెప్పారు. విభజన సమస్యలపై త్వరలో ప్రధాని మోడీని కలుస్తామని, విభజన సమస్యలపై మోడీ కోరిన అదనపు సమాచారాన్ని అందజేస్తామని సుజనా చౌదరి, ఎంపి తోట నరసింహం చెప్పారు.

వచ్చే నెల 2న మంత్రి మండలి భేటీ

అమరావతి బ్యూరో : రాష్ట్ర మంత్రి మండలి సమావేశం వచ్చే నెల 2న సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు కానుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల కార్యదర్శులు తమ అజెండా అంశాలను ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా సాధారణ పరిపాలన శాఖకు పంపాలని కోరారు.

సెల్ఫీ దిగుతూ ఐటి టెక్నీషియన్ మృతి

ఆంధ్రప్రదేశ్ వాసిగా గుర్తింపు

చెన్నై : ఎయిర్‌పోర్టు సమీపంలోని ఫ్లైఓవర్ పై నుండి సెల్ఫీ దిగుతున్న ఐటి టెక్నీషియన్ ఒకరు సోమవారం ఉదయం ప్రమాదవశాత్తూ జారి కిందపడి మృతిచెందాడు. అతన్ని ఆంధ్రప్రదేశ్‌లోని ఉయ్యూరుకు చెందిన చైతన్య(32)గా గుర్తించారు. అతను బెంగుళూరులోని ఓ ఐటి కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే ఫోన్లో మాట్లాడుతుండగా జారిపడి మృతిచెందాడని ప్రత్యక్షసాక్షులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిసిటివి పుటేజీలో మాత్రం సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తూ జారిపడినట్లు ఉందని పోలీసులు నిర్ధారించారు. సంఘటన జరిగిన ఫ్లైఓవర్ దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులు ఎయిర్‌పోర్టు టెర్మినల్ నుండి బయటకు రావడానికి వీలుగా నిర్మించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎసిబికి చిక్కిన వుడా అడిషనల్ సియుపి

రూ. 20 కోట్ల అక్రమాస్తులను గుర్తించిన అధికారులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ నగరాభివృద్ధి సంస్థ(వుడా) అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ (ఎసియుపి) పసుపతి ప్రదీప్‌కుమార్ ఆదాయానికి మించిన అక్రమాస్తులు కలిగి ఉన్నాడని గుర్తించిన ఎసిబి అధికారులు ఆయన ఆస్తులపై సోమవారం ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించారు. విశాఖపట్నం, అనంతపురం, రాజమండ్రి, కడప, విజయవాడ, కృష్ణ ప్రాంతాలతో పాటు 12 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. విశాఖపట్నంలోని వాల్తేరు క్లబ్ సమీపంలోని నటరాజ్ టవర్స్‌లోని ఆయన నివాసముంటున్న ఫ్లాట్ నెంబరు 301లో తనిఖీలు నిర్వహించారు. విజయవాడ రేంజ్ డిఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎసిబి అధికారులు తెల్లవారుజామున 5గంటలకే ప్రదీప్‌కుమార్ ఇంటికి చేరుకుని తనిఖీలు మొదలు పెట్టారు. కర్నూలు జిల్లా, పత్తికొండ మండలం, చిక్కాల గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్ మే 5 1984లో అనంతపురం జిల్లా గుంతకల్‌లో టౌన్ ప్లానింగ్‌లో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా చేరాడు. 1991లో టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా, 1999లో ప్లానింగ్ ఆఫీసర్‌గా, 2010లో సిటీ ప్లానర్‌గా, 2013లో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా, 2018లో టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందాడు. 2015 నుంచి 2016 వరకూ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేశాడు. ప్రస్తుతం వుడాలో అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా (జాయింట్ డైరెక్టర్, కంట్రీ అండ్ టౌన్ ప్లానర్) పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన వుడాలో బాధ్యతలు చేపట్టి విధులు నిర్వర్తిస్తున్నారు. విశాఖపట్నంలోని తన ఇంట్లో రూ. 4లక్షల నగదు, రూ.3లక్షల బ్యాంకు బ్యాలెన్స్, భార్య పేరిట 18లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రూ.పది లక్షల బీమా, రూ.21లక్షల ఇంట్లో వస్తువులు, 2.7 కిలోల బంగారం (వీటి విలువ సుమారు రూ.70 లక్షలు), 12.5 కిలోల వెండి(వీటి విలువ రూ.4లక్షలు), ప్లాటినమ్ ఉంగరాలు రెండు, పెద్దకుమార్ హేమంత్‌సాయి పేరిట రూ. 10లక్షలు కనస్ట్రక్షన్స్, బ్రిజ్జా కారు, రెండు మోటారు సైకిళ్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ఇళ్లు, నాలుగు ఇళ్ల స్థలాలు, 9.20 ఎకరాల భూములు ఉన్నట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.4కోట్లు ఉంటుందని చెబుతున్నా, బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ.20 కోట్లకు దాటి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పెద్ద కమతాలు చేయాలి

వ్యవసాయ కార్పొరేటీకరణకు ఆర్థిక సర్వే సిఫార్సు




న్యూఢిల్లీ: వ్యవసాయరంగంలో కార్పొరేటీకరణను పరుగులు పెట్టించాలని ఆర్థిక సర్వే సిఫార్సు చేసింది. ఆహార లక్ష్యాలను సాధించడం, కూలీల కొరతను అధిగమించడం వంటి కారణాలను చూపుతూ ప్రస్తుతం ఉన్న చిన్న కమతాలను పెద్ద కమతాలుగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొంది. 'భారత రైతులు యాంత్రికీకరణను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. అయితే, ఆహార లక్ష్యాలను సాధించాలంటే ఇది చాలదు. యాంత్రీకరణ మరింత జోరుగా సాగేందుకు పెద్ద కమతాలను ఏర్పాటు చేయడమే మార్గం' అని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రపంచబ్యాంయకు అంచనాలను పేర్కొంది. '2050 నాటికి భారత జనాభాలో సగభాగం పట్టణాలకు చేరే అవకాశం ఉంది. వ్యవసాయ కార్మికుల సంఖ్య ప్రస్తుతం ఉన్న 58.2శాతం నుండి 25.7శాతానికి పడిపోనుంది. దీనర్థం వ్యవసాయంలో పెట్టే ఖర్చు గణనీయంగా పెరగనుంది. దీనికి తగ్గట్టుగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాలి' అని సూచించింది. వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గడం ఇప్పుడే కనపడుతోంది. కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న ట్రాక్టర్ల కొనుగోలే దీనికి నిదర్శనమని తెలిపింది. భవిష్యత్‌లో పెరగనున్న జనాభాను దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఆహార ఉత్పత్తులు కూడా గణనీయంగా పెరగాల్సిఉందని, ప్రస్తుతం ఉన్న చిన్న కమతాలతో ఆ లక్ష్యాలను సాధించడం అసాధ్యమని పేర్కొన్న ప్రణాళికసంఘం భూ కమతాల సైజును పెంచాలని, యాంత్రీకరణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. భారీ మొత్తంలో ఖర్చయ్యే యంత్ర పరికరాల కొనుగోలుకు అవసరమైన సహాయాన్ని ఊడా అందించాలని పేర్కొంది.

పెరుగుతున్న మహిళా రైతులు

పట్టణీకరణ పెరుగుతుండటం, దాంతో పాటే వలసలు కూడా పెరుగుతుండటంతో వ్యవసాయరంగంలో మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఆర్థికసర్వే తెలిపింది. 'మహిళలు రైతులుగా మారుతున్నారు. వ్యవసాయానికి సంబంధించిన అన్ని పనులను వారే చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మహిళా కూలీల సంఖ్య కూడా భారీగా పెరుగుతోంది.' అని పేర్కొంది. వ్యవసాయరంగంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులను పరిగణలోకి తీసుకున్నప్పుడు మహిళలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాల్సిఉందని తెలిపింది. వ్యవసాయ నిధుల కేటాయింపులో 30శాతం మహిళలకు ప్రత్యేకించాలి. మిగిలిన రంగాలకూ దీనిని వర్తింపచేయాలి. స్వయం సహాయక సంఘాలను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి. క్షేత్రస్థాయిలో నిర్ణయాలు తీసుకునే వ్యవస్థల్లో వారి ప్రాతినిధ్యం పెంచాలని సిఫార్సు చేసింది.

వృద్ధి ఇలా...

2018-19 సంవత్సరానికి దేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) వద్ధి రేటు 7 నుంచి 7.5 శాతం పెరుగుతుందని 2018 ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఆర్థిక వద్ధి రేటు పెరగడానికి ప్రధాన కారణంగా జీఎస్టీ, బ్యాంక్ రీక్యాపిటలైజేషన్, సరళీకరణ, విదేశీ పెట్టుబడులు, ఎగుమతులు పెరగడమని వెల్లడించింది. జిఎస్టీ వంటి పలు సంస్కరణలు ప్రవేశపెట్టిన అనంతరం మార్చితో ముగిసే ఈ ఆర్థిక సంవత్సరంలో వాస్తవా జిడిపి వద్ధి రేటు 6.75 శాతంగా ఉండనున్నట్లు తెలిపింది. జిడిపి 6.5 శాతం ఉండొచ్చని గత ఏడాది ఆగస్టు నాటి అర్ధ వార్షిక సర్వే అంచనా వేసింది. అభివద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఇండియా ఒకటిగా నిలుస్తోందని, గత మూడేళ్లుగా సరాసరి వద్ధి రేటు నాలుగు శాతంగా ఉందని సర్వే పేర్కొంది. ఉత్పత్తి రంగం ఈ ఏడాది 8 శాతం వద్ధి చెందుతుందని సర్వే అంచనా వేసింది.



మగ సంతానమే కావాలి!

- కొనసాగుతున్న లింగవివక్ష
- పింక్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ : మహిళా సమానత్వం గురించి చర్చ ఎంతగా జరుగుతున్నప్పటికీ దేశంలోని వివిధ ప్రాంతాల్లో లింగవివక్ష ఇంకా కొనసాగుతోంది. మగ సంతానం కోసం ఎదురుచూసే స్థితి ఇప్పటికీ ఉంది.భ్రూణ హత్యల సంఖ్య తగ్గినప్పటికీ ఒక మగపిల్లవాడైనా పుట్టేవరకు కాన్పులు కొనసాగించేసంస్కృతి ఇంకా ఉన్నట్లు ఆర్థికసర్వే పేర్కొంది. దేశంలో చోటుచేసుకుంటన్న లింగవివక్షపై ఈ సారి ప్రత్యేకంగా పింక్‌సర్వేను విడుదల చేశారు. ఈ సర్వే ప్రకారం స్త్రీ, పురుష నిష్పత్తి మరింత ఆందోళనకరంగా ఉంది. 2005-6లో ప్రతి 100 మంది శిశు జననాల్లో 39.4 శాతం బాలికాశిశువులు ఉండగా, 2015-16కు 39శాతానికే పరిమితమైంది. తమ ఆరోగ్య స్థితిగతులపై నిర్ణయాలు తీసుకుని వైద్యం చేయించుకునే చొరవను ఇప్పటికీ 25.5శాతం మంది మహిళలు చూపలేకపోతున్నారు. గృహసంబంధిత నిర్ణయాల్లో 26.4శాతం మంది మహిలదే ప్రేక్షకపాత్రే! పిల్లలను కనే విషయంలో 22శాతం మంది మహిళలు ఇప్పటికీ స్వయం నిర్ణయాన్ని తీసుకోలేకపోతున్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు దూరంగా 76శాతం మంది మహిళలు ఉన్నారు. 28శాతం మంది మహిళలు ఇప్పటికీ అక్షరాలకు దూరమే! 20 సంవత్సరాల లోపే తల్లులవుతున్న వారి సంఖ్య ఈ సర్వే ప్రకారం 20.6శాతం ఉంది

సవరణ

ప్రజాశక్తి దినపత్రికలో 25-01-2018వ తేదిన మెయిన్ ఎడిషన్ 6వ పేజిలో ప్రచురించబడిన ఆర్.సి.నెం. జి1/20/2016 ఎల్ఎ రూడీ ప్రకటన షెడ్యూల్ క్రమసంఖ్య 12లోని చొప్పవరపు నరసింహస్వామి పేరులో చివరి కాలమ్‌లో టాయిలెట్ - 21గా పొరపాటుగా ప్రచురించబడినది. దానిని టాయిలెట్-1గా గమనించగలరు.

- మేనేజర్, విజయవాడ

ఆర్థిక నిర్వహణ సవాల్

కొన్ని సిఫార్సులు

- న్యాయ వ్యవస్థలో ఫిర్యాదులు పేరుకు పోవడం, దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండటం వంటి సమస్యలను పరిష్కరించాలి.
- ద్రవ్య రంగంలో వికేంద్రీకరణ, జవాబుదారీతనం పెంచాలి.
- కార్మిక చట్టాల అమలు కోసం సాంకేతికను వినియోగించాలి.
- సమ్మిళత అభివృద్ధి కోసం విద్య, వైద్య రంగాలపై దృష్టి సారించాలి.
- తీవ్రమవుతున్న వాయు కాలుష్యాన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)


లేదని పెదవి విరిచింది. అయినా, దేశంలోకి పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, ఫలితంగా వృద్ధి సానుకూలంగా ఉంటుందని పేర్కొంది. అయితే, ఈ విదేశీ పెట్టుబడులు కూడా ఉత్పత్తి రంగాల్లో కాకుండా సేవా రంగంలోకే పెద్ద ఎత్తున రానున్నాయని తెలిపింది. వ్యవసాయ రంగానికి సంబంధించి కార్పొరేటీకరణ దిశలో పరుగులు పెట్టించాలని సూచించింది. 'వ్యవసాయ యాంత్రీకరణకు దేశంలో ఉన్న చిన్న కమతాలు ఆటంకంగా మారుతున్నాయి. వీటిని పెద్ద కమతాలుగా మార్చాలి. అప్పుడే వ్యవసాయ రంగంలో అనుకున్న లక్ష్యాలు సాధించగలం' అని సూచించింది. ఈ సూచన అమలులోకి వస్తే చిన్న, మధ్య తరగతి రైతాంగానికి కష్టాలు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి వీలుగా ఇప్పటికే సవరించిన కార్మిక చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రతిపాదనలో ఉన్న వాటికి చట్ట రూపం ఇవ్వాలని పేర్కొంది. ఇప్పటికే ఆరకొరగా ఉన్న కార్మిక హక్కులను మరింత దిగజార్చే ఈ చర్యను 'కార్మిక చట్టాల అమలు' అనే శీర్షికన ఆర్థిక సర్వేలో పొందుపరిచారు.

ప్రజా ఆకర్షక చర్యలు వద్దు

'రానున్నది ఎన్నికల సంవత్సరం. అసాధారణ లక్ష్యాలను, పథకాలను ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది. అయితే, అటువంటి ప్రకటనలు ఫలితాలు ఇచ్చే అవకాశం లేదు. ఆ తరహా నిర్ణయాలు విశ్వసనీయతను దెబ్బతీసే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే చేసిన వాటిని అమలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తే చాలని ఆర్థిక శాఖ ప్రభుత్వానికి చూసించింది.

వాతావరణ మార్పులపై ఆందోళన

దేశ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులపై ఆర్థికసర్వే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై చొరవ చూపాలని పేర్కొంది. ఆర్థికసర్వే నిర్ధారణల ప్రకారం దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీని ప్రభావం వ్యవసాయరంగంపై పడుతోంది. పంటల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతోంది. వాయుకాలుష్యం కూడా ఇదే స్థాయిలో పెరుగుతోంది. పెరుగుతున్న పట్టణీకరణ దీనికి కారణమని ఆర్థికసర్వే పేర్కొంది. వాయుకాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొంది.



వడ్డీ రేట్లు తగ్గకపోవచ్చు

రిజర్వు బ్యాంకు ఇకపై వడ్డీ రేట్లు తగ్గించడానికి చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయని ఆర్థిక సర్వేలో అర్వింద్ సుబ్రమణ్యన్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్నందున వడ్డీ రేట్లకు అడ్డంకింగా మారనుందన్నారు. ఫిబ్రవరి 7న ఆర్‌బిఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది. కాగా గతేడాది ఆగస్టులో రెపో రేటులో 25 శాతం వడ్డీరేటు తగ్గించిన ఆర్‌బిఐ ఆ తర్వాత యథాతథంగానే కొనసాగిస్తుంది. వృద్ధి రేటు పుంజుకుంటుందని అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతున్నందున వడ్డీ రేట్లు తగ్గించడానికి అవకాశాలు తక్కువేనని అన్నారు. అలాగని వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని అన్నారు.

మౌలికానికి 4.5 లక్షల కోట్ల డాలర్లు

వచ్చే 25 ఏళ్లలో భారత మౌలిక వసతుల అభివృద్ధికి దాదాపుగా 4.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరం అవుతాయని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రజల ఆర్థిక స్థాయిలు పెరుగుతున్న నేపథ్యంలో 2040 నాటికి ఈ మొత్తం అవసరం ఉంటుందని పేర్కొంది. కాగా ఇందులో భారత్ 3.9 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు మాత్రమే సమకూర్చుకోగలదని ఈ సర్వే పేర్కొంది. మరో 526 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరం అవుతాయి.

ఐదు రాష్ట్రాల నుంచే అధిక ఎగుమతులు

తొలిసారి భారతీయ చరిత్రలో మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు దేశీయ ఎగుమతుల్లో 70 శాతాన్ని నమోదు చేసినట్టు ఆర్థిక సర్వే పేర్కొంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2016-17లో 8 శాతం పెరిగి 60.08 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇవి 55.56 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ప్రతికూలంగా ఉంటూ వస్తున్న ఎగుమతులు 2016-17లో సానుకూలంగా మారాయని, 2017-18లో మరింత పెరుగునున్నట్టు పేర్కొంది. మొత్తంగా 2017-18లో ఎగుమతులు వద్ధి రేటు 12.1 శాతంగా ఉండనున్నట్టు తెలిపింది. విదేశీ మారక నిల్వలు వార్షిక ప్రాతిపదికన 14.1 శాతం పెరిగి, 409.4 బిలియన్ డాలర్లుగా నమోదైనట్టు ఆర్థిక సర్వే తెలిపింది.

ప్రయివేటు పెట్టుబడులపైనే దృష్టి



దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయివేటు పెట్టుబడులే ఇక దిక్కు అన్నట్లుగా ఆర్థిక సర్వే పరోక్షంగా పేర్కొంది. అంటే అన్ని రంగాల్లో పెట్టుబడుదారులకు అవకాశం ఉంటుందని చెప్పకనే చెప్పింది. యువత, మహిళలతో పాటు శ్రామిక శక్తికి మెరుగైన ఉద్యోగాలను అందుబాటులోకి తేవడం, ఉపాధి, పెట్టుబడుల ప్రవాహం పెంచే సంస్కరణలకే పెద్దపీట వేస్తుందని ఆర్థిక సర్వే సంకేతాలు పంపింది. ఉపాధి రంగాలైన టెక్స్‌టైల్స్, లెదర్, అపెరల్స్, జెమ్స్, జ్యూవెలరీ వంటి శ్రామిక శక్తి అధికంగా ఉన్న రంగాలకు బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు ఉంటాయని భావిస్తున్నారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచి.. ప్రైవేట్ పెట్టుబడులు, ఎగుమతులు వద్ధి చెందే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. వీటికి తోడు ప్రయివేటు పెట్టుబడులు, ఎగుమతులపై ఆర్థిక వద్ధి వేగాన్ని నిలకడగా కొనసాగించడం కీలకమని సర్వే పేర్కొంది.

లక్ష కోట్ల వాటాల విక్రయం..!

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాలను ప్రయివేటుకు కట్టబెట్టడానికి ఉద్దేశించిన డిజిన్వెస్ట్‌మెంట్ మరింత వేగం పుంజుకోనుందని అంచనా. 2018-19లో రూ.90,000 కోట్ల విలువ చేసే పిఎస్‌యుల వాటాలను ఉపసంహరించుకునే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది 2017-18 డిజిన్వెస్ట్‌మెంట్‌తో పోల్చితే 15-20 శాతం అదనం. గతేడాది ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ రూ.72,500 కోట్ల విలువ చేసే పిఎస్‌యులను వాటాలను ఉపసంహరించుకోనున్నామన్నారు. కాగా ఇప్పటి వరకు రూ.54,338 కోట్ల విలువ చేసే పిఎస్‌యుల వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయించారు.

పెదగొట్టిపాడు ప్రధాన నిందితుల అరెస్టులో తాత్సారం

జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు రాములు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి


గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామంలో దళితులపై దాడిచేసిన ప్రధాన నిందితులను తక్షణం అరెస్టు చేయాలని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు కేషపాగుల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్‌పి, కలెక్టర్ నిందితుల సామాజిక తరగతికి చెందిన వారు కావడం వల్ల దళితులు గ్రామ బహిష్కరణకు గురైనా, ప్రధాన నిందితుల అరెస్టులో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో రాములు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం పెదగొట్టిపాడు సందర్శిస్తామని, ఆ జిల్లా కలెక్టర్, ఎస్‌పితోపాటు బాధితులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

కళలతో మానసికోల్లాసం

కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చీఫ్ కమిషనర్ వై.ఎస్.సహారవత్

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

కళలను, కళాకారులను గౌరవించటం భారతీయ సంప్రదాయమని కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చీఫ్ కమిషనర్ వై.ఎస్.సహారవత్ అన్నారు. కళలు మనిషికి మానసికోల్లాసాన్ని కలిగించి ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. గుంటూరులో ది ఇండియన్ టుబాకో అసోసియేషన్ హాల్‌లో 31వ సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ బోర్డు ఆధ్వర్యంలో సబ్ జోనల్ కల్చరల్ మీట్ 2017-18 సోమవారం నిర్వహించారు. ఇన్‌కంటాక్స్, సిజిఎస్‌టి, సర్వీస్ టాక్స్ డిపార్టుమెంట్లకు చెందిన కళాకారుల ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సహారవత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇన్‌కంటాక్స్, సిజిఎస్‌టి, సర్వీస్ టాక్స్ డిపార్టుమెంట్లకు చెందిన ఉద్యోగులకు కల్చరల్ మీట్‌ను నిర్వహిస్తోందన్నారు. కొన్నేళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న పోటీలను తొలిసారిగా నవ్యాంధ్ర రాజధాని ప్రాంతమైన గుంటూరులో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా 12 విభాగాల్లో నిర్వహించే పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కళాకారులు తరలివచ్చారన్నారు. విజేతలు ఫిబ్రవరి 5,6 తేదీల్లో కొచ్చిలో నిర్వహించే సౌత్‌జోనల్ పోటీల్లో పాల్గొననున్నారు. అక్కడ విజయం సాధించినవారు జాతీయ స్థాయిలో ఫిబ్రవరి 20,21,22 తేదీల్లో పూణేలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు.



కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చీఫ్ కమిషనర్ వై.ఎస్.సహారవత్‌ను సత్కరిస్తున్న కస్టమ్స్ సిబ్బంది

సంపాదకీయం

ప్రైవేటు దిక్సూచి

విత్త మంత్రి అరుణ్‌జైట్లీ సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2017-18 ఆర్థిక సర్వే యావత్తూ ప్రైవేటు పెట్టుబడులు, ప్రజా వ్యతిరేక సంస్కరణలు, జనంపై భారాల చుట్టూనే తిరిగింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌కు దశా దిశ ఇదేనని స్పష్టం చేసింది. తమ హయాంలో పూర్తి స్థాయిలో వెలువడే చివరి బడ్జెట్ ఊహల పందిరిగా ఉండబోతోందని సూచనలిచ్చింది. స్థూలోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటుపై మూడేళ్లలో వేసిన అతి అంచనాలు తలకిందులైనా ఈ తడవ సైతం ఆ ధోరణినే పట్టుకొని వేలాడింది. తాము చేపట్టిన 'సంస్కరణ'ల వలన వృద్ధి రేటు పెరుగుతుందని ఊదరగొడుతుండగా వాస్తవంలో గ్రాఫ్ నేలచూపులు చూస్తోంది. నిరుటి సర్వేలో 2017-18లో జిడిపి వృద్ధి రేటు 6.75-7.25 శాతమని అంచనా వేయగా ప్రస్తుతం 6.75 శాతానికి ఖాయం చేశారు. చివరికది ఎంత నమోదవుతుందో తెలీదు. ఈ అనుభవం నుంచి గుణపాఠం తీసుకోకుండా వచ్చే ఏడాది వృద్ధి రేటును 7-7.5 శాతం సాధించి తీరతామంటున్నారు. పైపెచ్చు వృద్ధిరేటు సాధనకు ప్రధాన ఇరుసు ప్రైవేటు పెట్టుబడులేనని ఢంకా భజాయిస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పన, వ్యవసాయాభివృద్ధి, విద్య ఈ నాలుగంశాలూ రానున్న బడ్జెట్‌లో కీలకంగా ఉంటాయంటూనే ఆయా రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెంచకుండా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లను ఆకర్షించి లక్ష్యాలు సాధిస్తామంటున్నారు. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం నెలకొనడంతో అమెరికా సహా పలు దేశాలు అల్లాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో విదేశాల నుంచి ప్రైవేటు పెట్టుబడులు మన దేశానికి ఇబ్బడిముబ్బడిగా వస్తాయని ఆశించడం ఊహల పల్లకిలో విహరించడమే అవుతుంది. ఏడాదికి కోట్లల్లో కొత్త ఉద్యోగాలు సృష్టిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బిజెపి ఈ మూడున్నరేళ్లలో ఇచ్చిన కొత్త ఉద్యోగాలెన్నని అడిగితే చెప్పలేని పరిస్థితి. మేక్ ఇన్ ఇండియాలు, స్టార్టప్‌లు, స్టాండప్‌లు అని ఎంతగా గొంతు చించుకున్నారో దేశం చూసింది. ఇన్నేళ్లల్లో రాని పెట్టుబడులు వచ్చే సంవత్సరం వస్తాయనడం మసిపూసి మారేడుకాయ చేసి పొద్దు పుచ్చడానికే.

మోడీ సర్కారు వచ్చాక అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ ప్రజలకు భారంగా మారిన పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గలేదు సరికదా ఇంకా పెరిగాయి. రోజువారీగా ధరలు నిర్ణయించే విధానం వలన అవి రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. ఆ విధంగా సమకూరిన వేల కోట్ల రూపాయలు బడ్జెట్ అవసరాలకు ఆసరా అయ్యాయి. కొద్ది మాసాల క్రితం బ్యారెల్ చమురు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు 40 డాలర్లు ఉండగా ఇప్పుడది 71 డాలర్లకు పెరిగింది. చమురు ధరల పెరుగుదలపై ఆర్థిక సర్వే ఆందోళన వెలిబుచ్చింది. కారణం ఇవి మరింత పెరిగితే మన విదేశీ మారక నిల్వలు తరిగిపోయి ఆర్థిక సర్వే అంచనాలు తల్లకిందులవుతాయి. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వలన అభివృద్ధి కుంటు పడిందని చెబుతూనే మరోవైపు దానివల్ల 50 శాతం పరోక్ష, 18 శాతం ప్రత్యక్ష పన్ను చెల్లింపుదార్లు పెరిగినట్లు సర్వే అంచనా వేసింది. పెద్ద నోట్ల రద్దు వలన ప్రజల పొదుపు పెరిగిందని, అయినా ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధించట్లేదని సర్వేలోనే పేర్కొనడం గమనార్హం.

వాతావరణ మార్పుల వలన కరవు, అధిక ఉష్ణోగ్రతల వలన పంటల ఉత్పాదకత తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేసిన ఆర్థిక సర్వే వ్యవసాయాభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులే కీలకమని వక్కాణించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేయడంపై అధ్యయనం చేసిన కమిటీ కార్పొరేట్ సాగును దూకుడుగా ప్రవేశపెట్టాలని మొన్ననే సిఫారసు చేసింది. ఆర్థిక సర్వే కూడా అదే దిశగా సూచనలు చేసింది. అప్పుడు రైతులు మార్కెట్ శక్తుల కబంధ హస్తాల్లో చిక్కుతారు మినహా సంక్షోభం పరిష్కారం కాదు. టెలికం రంగంలో జియో రాకతో ఇబ్బందులొచ్చాయన్న ఆర్థిక సర్వే అందుకు స్పెక్ట్రం ఛార్జీలు తగ్గించాలని పరోక్షంగా సూచించడం కార్పొరేట్లకు లాభాల పంట పండిస్తుంది. ఎగుమతుల్లో దిగ్గజ కంపెనీల వాటా అమెరికా, జర్మనీ, మెక్సికోలతో పోల్చుకుంటే చాలా తక్కువని ఆర్థిక సర్వే పేర్కొంది. రాష్ట్రాలు, స్థానిక సంస్థల పన్ను వసూళ్లలో ప్రత్యక్ష పన్నుల వాటా గణనీయంగా తగ్గిపోతున్నదని సర్వే పేర్కొంది. మగ పిల్లలనే కనాలన్న ఆకాంక్ష వలన స్త్రీ, పురుష నిష్పత్తిలో అంతరం ఏర్పడుతోందన్న సర్వే ఉటంకింపు ఆందోళనకరం. ప్రస్తుత స్టాక్ మార్కెట్ల రికార్డులు బుడగల వంటివని, పేలిపోయిన అనుభవం ప్రపంచానికి ఉందని ఆర్థిక శాఖ ప్రధాన సలహాదారు, ఆర్థిక సర్వే రూపకర్త అరవింద్ సుబ్రమణియన్ అభిప్రాయపడుతున్న తరుణంలో మోడీ సర్కారు ప్రతిపాదించి దూకుడుగా అమలు చేస్తున్న నయా-ఉదారవాద విధానాలు దేశాన్ని సూపర్ పవర్ చేస్తాయనడం భ్రమే అవుతుంది. ప్రపంచంలో విఫలమైన సదరు నమూనాతో ప్రజల అభివృద్ధి అసాధ్యం.

ఇదీ విషయం



ఏడు కొండలవాడా
ఏమిటి నీకీ దుస్థితి...
ఒణికించుట లేదా నిను
ఉన్మత్తపు స్థితి!

కాషాయ ఉన్మాదులు
కావలి కాస్తారేమో
నామాలు విస్మరిస్తే
నిన్ను కూడ వదలరేమో!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు... వాస్తవాలు..

'విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) విషయంలో భారత దేశం మొత్తం ప్రపంచంలోనే అగ్ర స్థానంలో ఉంది. రికార్డు స్థాయిలో భారత దేశానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి' లాంటి అతిశయోక్తులన్నీ వార్తలుగా ప్రచారం చెయ్యబడుతున్న ఈ రోజుల్లో ఆయా ప్రకటనల్లోని నిజానిజాలు పరిశీలించడం ఎంతైనా అవసరం. అంతేకాక గత 44 నెలల పరిపాలనలో ఎఫ్‌డిఐలకి ఎర్ర తివాచీ స్వాగతం పలుకుతూ దేశీయ వ్యాపార రంగాన్ని అతలాకుతలం చెయ్యడంలో పూర్తిగా నిమగ్నమైన మోడీ సర్కారు... కాస్తా కూస్తో మిగిలి వున్న నియంత్రణ వ్యవస్థలను సైతం ధ్వంసం చేసుకుంటూ పోవడం... కొత్త సంవత్సరపు తొలినాళ్లలోనే ఎఫ్‌డిఐపై కొత్త విధాన ప్రకటన చెయ్యడంతో పరాకాష్టకు చేరింది. 2017 సంవత్సరానికి సంబంధించి ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యుఎన్‌సిటిఎడి ప్రకటించిన వివరాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎఫ్‌డిఐలో భారతదేశపు వాటా 3 శాతం కూడా లేదు. అనేక దేశాలలోకి ప్రవహించిన ఎఫ్‌డిఐ మొత్తాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే భారతదేశం పదవ స్థానంలో ఉందే తప్ప మొదటి స్థానంలో కాదు. సహచర ఆసియా దేశమైన చైనాలోకి వచ్చిన ఎఫ్‌డిఐ మన దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐ కన్నా 5 రెట్లు ఎక్కువ. వాస్తవాలు ఇలా వుండగా అదేదో ఘనకార్యం అయినట్లు ఎఫ్‌డిఐల్లో మన దేశం అగ్ర స్థానంలో ఉన్నట్లు పాలకవర్గ తైనాతీ సంస్థల్లో జరుగుతున్నది కేవలం గోబెల్స్ మాదిరి ప్రచారమే సుమా!



ఆర్ శశి కుమార్

ఎఫ్‌డిఐని ఆహ్వానించే ఏ దేశమైనా ముఖ్యంగా ఆశించేది పెట్టుబడులతో పాటుగా సాంకేతిక పురోగతి సాధ్యమవుతుందని. దాంతోపాటే ఆర్థిక కార్యకలాపాలు పెరిగి తద్వారా ఉద్యోగ కల్పన జరుగుతుందనీ! కానీ మన దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐ ఈ లక్ష్యానికి విరుద్ధంగా ప్రవర్తిస్తోందని గత కొన్ని దశాబ్దాల అనుభవం నిరూపిస్తోంది. ఎందుకంటే సాంకేతికత బదలాయింపు నిజంగానే జరిగి ఉంటే ఇప్పటికీ మనం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దుస్థితి ఉండేది కాదు. ఇన్ని సంవత్సరాలుగా పెట్టుబడులు ప్రవహిస్తున్నాయని చెప్పుకుంటున్న టెలికాం రంగం నుంచి నిర్మాణ, మౌలిక వసతుల కల్పనా రంగాల వరకు అనేక రంగాలలో వాడుతున్న యంత్రాలలో సింహ భాగం దిగుమతి చేసుకుంటున్నవే! చివరికి ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలో 65 శాతం దిగుమతులపై ఆధారపడటం ఎంత దౌర్భాగ్యం? అదే మెడికల్ రంగంలో వాడే యంత్రాలలో 80 శాతం పైగా మన దేశంలో తయారు కావడం లేదంటే ఇన్ని సంవత్సరాల ఎఫ్‌డిఐ సాంకేతికత బదలాయింపు లక్ష్యాన్ని నెరవేర్చలేదనేది స్పష్టమవుతోంది! ఇప్పుడేదో మేకిన్ ఇండియా నినాదాలతో, సింహం బొమ్మలతో, గర్జనలతో సాంకేతికత పెంపొందించలేరు. శాస్త్రీయ విద్యా విధానం ద్వారా మాత్రమే అది సాధ్యం. కానీ మన తలకిందుల విద్యావ్యవస్థ చౌక కూలీల తయారీపై పెట్టిన శ్రద్ధ పరిశోధనాత్మక బోధన, అన్వయ శోధనలపై పెట్టకపోవడం ఈ దుస్థితికి ముఖ్య కారణం. సరిగ్గా ఇదే సమయంలో చైనా సైతం ఎఫ్‌డిఐలని పెద్ద ఎత్తున ఆహ్వానించినప్పటికీ దాంతో పాటు వచ్చిన సాంకేతికతను అందిపుచ్చుకుని, నైపుణ్యాలను పెంపొందించుకొని క్రమక్రమంగా దేశీయ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించడం హేతుబద్ధమైన విద్యా విధానపు అమలు వల్లే సాధ్యపడిందనేది జగమెరిగిన సత్యం. మన శాస్త్రవేత్తలు సాధిస్తున్న ఘన విజయాలను గమనిస్తే ఎక్కువ భాగం ప్రభుత్వ రంగ సంస్థలలోనే అన్న విషయం స్పష్టమవుతుంది. ఇక వాటిని కూడా ధ్వంసం చేయడానికి మోడీ ప్రభుత్వం ఉవ్విళ్లూరుతలూగడం మరింత పరాధీనతకే దారితీస్తుంది.

ఇక ఎఫ్‌డిఐ ద్వారా ఉద్యోగ కల్పన నేతి బీరకాయలో నెయ్యి చందమే. ఎందుకంటే కొత్తగా పరిశ్రమలు స్థాపించే ఎఫ్‌డిఐ కంటే ఇప్పటికే ఉన్న భారతీయ కంపెనీల్లో వాటాల కొనుగోలుకై వస్తున్న ఎఫ్‌డిఐ మొత్తమే ఎక్కువగా ఉంటోంది కాబట్టి. అంటే ఈ ఎఫ్‌డిఐ వల్ల యాజమాన్య మార్పు తప్ప కార్యకలాపాలలో పెద్దగా పురోగతి ఏమీ ఉండట్లేదు. అంతేకాక బహుళజాతి సంస్థల గుత్త పెట్టుబడి మన దేశంలోని చిన్న మధ్య తరహా వ్యాపారులను చావు దెబ్బ తీస్తున్న కారణాన ఆయా సంస్థలు నడిపేవారి స్వయం ఉపాధి, వాటిలో పని చేస్తున్న అనేక మంది ఉపాధి సైతం ప్రమాదంలో వుంది. అంటే నికరంగా ఎఫ్‌డిఐ ఉద్యోగ కల్పన కంటే ఉద్యోగ హరణే ఎక్కువగా చేస్తోంది. కానీ సాంకేతికత బదలాయింపు మనకి జరగకపోయినా, ఉద్యోగ కల్పన ఎండమావిగా మారినా రాయల్టీలు, వడ్డీలు, డివిడెండ్ల రూపంలో మన దేశం నుంచి పెద్ద ఎత్తున సంపద విదేశాలకు తరలిపోతూనే వుంది. దీనికితోడు భారత దేశంలో కార్యకలాపాలు సాగించే విదేశీ సంస్థలు తమకు కావాల్సిన అనేక వస్తువులపై, యంత్రాలపై ఎక్కువగా దిగుమతులకే మొగ్గు చూపడం వల్ల ఎంతో విదేశీ మారక ద్రవ్యం మన దేశం నుంచి తరలిపోతూ వాణిజ్య లోటును పెంచుతోంది. ఏతావాతా తేలేదేమిటంటే ఎఫ్‌డిఐ రూపంలో మన దేశంలోకి వస్తున్న సొమ్ములో 30 శాతానికి పైగా సాలీనా మళ్లీ బయటకు (విదేశాలకు) తరలించబడుతోందనే! అంటే మన మార్కెట్‌ని కొల్లగొట్టుకోడానికి విదేశీ సంస్థలకు ఇస్తున్న లైసెన్స్ మాత్రమే తప్ప ఎఫ్‌డిఐ నిజంగా మన ఆర్థికాభివృద్ధికి దోహదపడటం లేదు.

అసలు మన దేశంలోకి వస్తోన్న, వస్తోందని ప్రచారం గావింపబడుతోన్న ఎఫ్‌డిఐ నిజమైనదేనా లేక బూటకపుదా అని పరిశీలిస్తే ఇందులో సైతం ఎక్కువ భాగం ఉత్తుత్తిదే అని స్పష్టమవుతుంది. ఎలాగంటే ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన మన దేశంలోకి వస్తున్న ఎఫ్‌డిఐలో ఎక్కువ భాగం కనీసం మన ఒక జిల్లా అంత పరిమాణం కూడా లేని మారిషస్, సింగపూర్, సైప్రస్ వంటి దేశాల నుంచి రావడమే దానికి నిదర్శనం. నల్లధనంపై అలుపెరుగని పోరాట యోధునిగా స్వీయ భుజకీర్తులు ధరించుకు తిరుగుతున్న మోడీ పాలనా సమయంలో అటువంటి దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డిఐ తగ్గి వుంటుందని అనుకుంటే పొరబాటే! కావాలంటే పట్టికలో గమనించండి.

మొత్తంగా మన దేశానికి వచ్చిన ఎఫ్‌డిఐలో మారిషస్, సింగపూర్, సైప్రస్‌లు చాలా చిన్న దేశాలు. వాటి నుంచి వచ్చిన ఎఫ్‌డిఐ శాతం 2014-15లో 53 శాతంగా వుంటే, 2015-16లో అది 56 శాతానికి పెరిగింది. నల్లధనంపై యుద్ధం పేరుతో అట్టహాసంగా ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు తర్వాత ఇలాంటి దొంగదారుల గుండా వచ్చే ఎఫ్‌డిఐ తగ్గుతుందేమో అని అత్యాశ పడినా నిజానికి అది ఇంకా పెరిగి 57.4 శాతానికి చేరింది. నిజానికి ఇదే సమయంలో మారిషస్ నుంచి వచ్చిన ఎఫ్‌డిఐ దాదాపు రెట్టింపు కావడం అనుమానాలకు తావునిస్తోంది. అంటే ఇందులో ఎక్కువ భాగం ఎఫ్‌డిఐ రూపంలో వెనక్కి వచ్చి తెల్లబడిన నల్ల డబ్బేనన్నమాట. దీన్ని బట్టే అర్థమవడం లేదూ నల్ల ధనంపై మన ప్రధాన మంత్రి జరుపుతున్న డొల్ల యుద్ధపు యథార్థం!

ఇక కొన్ని కీలకమైన రంగాల్లో ఎఫ్‌డిఐపై మోడీ ప్రభుత్వం తీసుకున్న, తీసుకుంటున్న నిర్ణయాలు జాతి వ్యతిరేకంగా ఉంటున్నాయి. రక్షణ రంగం వంటి సున్నితమైన రంగంలోనూ, చిల్లర వర్తకపు రంగంలోనూ, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక సేవా రంగాలలోనూ, విమానయాన రంగంలోనూ విచ్చలవిడిగా ఎఫ్‌డిఐకి అనుమతులివ్వడం సమర్థనీయం కాదు. ఎందుకంటే విమానయాన రంగం, రక్షణ రంగం వంటివి కేవలం వ్యాపార దృష్టితో మాత్రమే చూడదగ్గ రంగాలు కాదు. దేశ భద్రతకూ ప్రతిష్టకూ సైతం సంబంధించిన విషయాలు. ప్రతి దేశానికీ తనదంటూ ఒక విమానయాన సంస్థ అధికారికంగా ఉంటుంది. అలాంటి మన ఎయిర్ ఇండియాలోకి 49 శాతం ఎఫ్‌డిఐకి తలుపులు బార్లా తెరవడం దేశ ప్రతిష్టకే భంగకరం. ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల్లోకి నెట్టి అప్పుల ఊబిలో కూర్చేసి చివరికి ఆ సాకుతో వాటిని విదేశీ సంస్థల పరం చెయ్యడం ముక్త కంఠంతో ఖండించాల్సిన విధానం. అలాగే సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఎవరి అనుమతులూ లేకుండానే వంద శాతం ఎఫ్‌డిఐని అనుమతించడ మంటే కనీస స్థాయి నియంత్రణను సైతం వదులుకోవడమే! ఇప్పటికే ఎఫ్ఐపిబి వంటి నియంత్రణా వ్యవస్థను రద్దు చేసిన మోడీ సర్కారు దారంపై వేళ్లాడుతున్న కొద్దిపాటి హక్కులను సైతం విదేశీ దొరల పాదాక్రాంతం చెయ్యడం చూస్తుంటే... సంపూర్ణ పరాధీనత సాధించే వరకూ విశ్రమించేట్టులేదని అనిపించడం లేదూ!

(రచయిత చార్టర్డ్ ఎకౌంటెన్సీ ఉపాధ్యాయుడు, sasichamps@gmail.com)

> **రక్షణ రంగం వంటి సున్నితమైన రంగంలోనూ, చిల్లర వర్తకపు రంగంలోనూ, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక సేవా రంగాలలోనూ, విమానయాన రంగంలోనూ విచ్చలవిడిగా ఎఫ్‌డిఐకి అనుమతులివ్వడం సమర్థనీయం కాదు... ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల్లోకి నెట్టి అప్పుల ఊబిలో కూర్చేసి చివరికి ఆ సాకుతో వాటిని విదేశీ సంస్థల పరం చెయ్యడం ముక్త కంఠంతో ఖండించాల్సిన విధానం. అలాగే సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఎవరి అనుమతులూ లేకుండానే వంద శాతం ఎఫ్‌డిఐని అనుమతించడ మంటే కనీస స్థాయి నియంత్రణను సైతం వదులుకోవడమే!**




వివిధ దేశాల నుంచి భారత్ వచ్చిన ఎఫ్‌డిఐ

	2014-15	2015-16	2016-17
మారిషస్	55,172	54,706	1,05,587
సింగపూర్	41,350	89,510	58,376
సైప్రస్	3,634	2,643	3,367
ఇతర దేశాలన్నీ కలిపి	88,951	1,15,463	1,24,366
మొత్తం	1,89,107	2,62,322	2,91,696

చర్చ

సూర్యుడు దేవుడా? గ్రహమా?



ఎ కోటిరెడ్డి

'రాను రానూ రాజు గుర్రం గాడిద అవుతుంది' అన్న చందంగా పోనుపోనూ తెలుగుదేశం పార్టీ ఆర్‌ఎస్ఎస్‌కు అనుబంధ సంస్థలాగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించింది. మానవ జాతికి సుఖ సంతోషాలను ప్రసాదిస్తున్న సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం సూర్యారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు 27వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అదే రోజు దినపత్రికలలో ప్రచురించిన అడ్వర్టైజ్‌మెంట్‌లోనూ ఇదే విషయాన్ని పేర్కొన్నారు. తర్వాత భూమిని ఆరాధించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయాలని, జిల్లా కలెక్టర్లు ఆయా జిల్లాల్లో కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించటంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యాసంస్థలకు సర్కులర్ కూడా పంపింది. రాష్ట్ర పరిపాలనను నిర్వహించటం కోసం ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ప్రజలలో దైవ భక్తిని, మూఢ విశ్వాసాలను పెంపొందించటానికి చంద్రబాబు, ఆయన ప్రభుత్వం శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రజలందరూ సూర్య భగవానుని ఆరాధనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేసిన చంద్రబాబును అభివృద్ధి చెందుతున్న శాస్త్ర విజ్ఞానాన్ని అర్థం చేసుకోలేని అతి సామాన్య వ్యక్తిగా పరిగణించాలా లేక ప్రజలను మోసం చేయటానికి పూనుకున్న మోసగాడిగా పరిగణించాలా? సూర్యుడు ఒక గ్రహం అన్న విషయం ఐదవ తరగతి విద్యార్థికి కూడా తెలుసు. ఆ పాటి శాస్త్ర విషయాలను కూడా అర్థం చేసుకోలేని స్థితిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారా? లేక హిందూమత భావజాలాన్ని ప్రజలలో పెంచటంలో వీళ్ళకేమైనా ప్రయోజనం ఉందా? సూర్యుడు దేవుడని నమస్కారాలు చేయటం ప్రారంభిస్తే సూర్యునితోనే ఆగుతుందా? హిందూమతం చెబుతున్న ముక్కోటి దేవతలలో మన చుట్టూ ఉన్నవన్నీ దేవతలే. వాటన్నిటికీ ప్రభుత్వం పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తే ప్రజలు తమ గురించి ఆలోచించుకోవటానికి సమయం మిగలదు. ప్రభుత్వానికి కావలసింది అదే. ప్రభుత్వపాలన తీరు, తమ సమస్యల పరిష్కారం గురించి ప్రజలు ఆలోచించటం ప్రారంభిస్తే ప్రభుత్వ బండారం బట్టబయలవుతుంది. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించటం లేదని, పోరాడుతున్న ప్రజలపై తీవ్ర నిర్బంధకాండను ప్రయోగిస్తున్నదని, రాష్ట్రంలోని భూములు, గనులు, సముద్ర తీరం, అడవులు తదితర సమస్త వనరులను దోపిడీదారులకు అప్పగిస్తున్నదని ప్రజలు అర్థం చేసుకుంటారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వ పెద్దలు పెట్టుబడిదారులతో కుమ్మక్కై వనరులను దోచుకుంటున్నారని, అధికారమే పెట్టుబడిగా స్వంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారని, వాళ్ళ లాభాలు మినహా ప్రజల ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి ఈ ప్రభుత్వానికి పట్టలేదని వెల్లడౌతుంది. ప్రభుత్వం ఏం చేస్తోందో ప్రజలకు అర్థం కావటం పాలకులకు శాపంగా పరిణమిస్తుంది. కాబట్టే ప్రజలను మభ్యపెట్టటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తోంది.

ఒకవైపున విదేశాల నుండి పెద్ద మొత్తంలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, రాష్ట్రాన్ని పారిశ్రామిక, సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. మన వ్యవసాయ రంగం వెనుకబడిపోయిందని, వ్యవసాయాన్ని ఆధునీకరించాలని, అందుకు కార్పొరేట్ సంస్థలను వ్యవసాయ రంగంలోకి తీసుకురావాలని ప్రచారం చేస్తున్నారు. మరో వైపున వందల సంవత్సరాల నాడే గ్రహం అని నిరూపించబడిన సూర్యుణ్ణి దేవునిగా చెబుతూ పూజలు చేయమని ప్రజలకు ఉద్బోధిస్తున్నారు. పరిశ్రమలను, వ్యవసాయాన్ని ఆధునీకరిస్తామని చెప్పటం, సూర్యుణ్ణి దేవునిగా ఆరాధించమని చెప్పటం, రెండూ ఎలా పొసగుతాయి? ఈ రెండింటిలోనూ పాలకుల ప్రయోజనాలు ఇమిడి వున్నాయి. కాబట్టి ప్రచారం చేస్తున్నారు. విదేశీ పెట్టుబడులు రాష్ట్రంలోకి వస్తే వారి నుండి కమీషన్లు, పరిశ్రమలలో వాటాదారులుగా చేరటం ద్వారా లాభాలు సంపాదించుకోవచ్చు. ప్రజలలో మతమౌఢ్యాన్ని, మూఢ విశ్వాసాలను పెంపొందించటం ద్వారా తమ వర్గపాలనకు ప్రమాదం రాకుండా, తమ పార్టీ ప్రభుతాన్ని సుస్థిరం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో నెంబరు వన్ స్థానానికి తీసుకువస్తానని చెబుతున్న చంద్రబాబు తన స్వప్రయోజనాల కోసం ప్రజలను మధ్య యుగాలకు తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు.

జన వాక్యం

విద్యావ్యవస్థలే కీలకం


దేశంలో న్యాయ వ్యవస్థ, కోర్టులు, పోలీసులు రాజకీయ పార్టీల చేతుల్లో కీలుబొమ్మలైనప్పుడు, ఆ దేశ ప్రజాస్వామ్యం కుంటుపడుతుంది. భావ ప్రకటనా స్వేచ్ఛ హరించుకు పోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఒక దేశ వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలన్నా, ఆ దేశాన్ని తప్పు దోవలో నడిపించాలన్నా ఆ దేశ విద్యావ్యవస్థను నాశనం చేస్తే చాలునని బిజెపి, ఆర్‌ఎస్ఎస్ మనువాదులకు బాగా తెలుసు. అందుకే విద్యావ్యవస్థలో తలమానికంగా వుండే యూనివర్శిటీల్లో ముందుగా తమ మతోన్మాదాన్ని నింపాలని నిర్ణయించుకున్నాయి. విశ్వవిద్యాలయ విద్యార్థుల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టి వారి మధ్య చీలికలు సృష్టించడంలో కేంద్ర పాలకులు ముందంజలో ఉన్నారు. ఇప్పుడు పాఠశాల స్థాయిలోనే విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారు. పురాణాలు, ఇతిహాసాలు, జ్యోతిష్యాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే యుపి, గుజరాత్ లాంటి బిజెపి పాలిత ప్రాంతాల్లో ఈ వ్యూహం అమలుకు సిద్ధమయ్యారు. అయితే యూనివర్శిటీల్లో ఈ కాషాయీకరణకు వ్యతిరేకత స్పష్టంగానే వ్యక్తమౌతోంది. కాషాయ అనుబంధ గ్రూపులు పదే పదే ఓటమి పాలవ్వడమే ఇందుకు నిదర్శనం. అందుకే ఈ విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు, ప్రొఫెసర్లు, అభ్యుదయ వాదులు, బహుజన వాదులు కలసి ఐక్యంగా పోరాడాలి.

కె ప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు.

దర్పణం

పరిణామ సిద్ధాంతం శాస్త్ర విజ్ఞానానికి సోపానం

మానవ వనరుల మంత్రిత్వ శాఖను కేంద్రంలో నిర్వహిస్తున్న సత్యపాల్‌సింగ్ మన పాఠశాలల్లో, కళాశాలల్లో బోధిస్తున్న డార్విన్ పరిణామవాద పాఠ్యాంశాలను తొలగించాలని ఇటీవల ప్రకటించారు. ఈయన ఆర్.యస్.యస్ కార్యకర్తగా ఎదిగినవాడు. భారత దేశంలో విస్తరిస్తున్న శాస్త్ర జ్ఞానానికి అవరోధంగా మతోన్మాద కార్యక్రమాలు నిర్వహించడం ఆర్.యస్.యస్ దిన చర్య. అయితే ప్రపంచం మొత్తంగా సైన్స్ అంతకంతకు అభివృద్ధి చెందుతూనే వుంటుంది. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్కరు నూతన సిద్ధాంతాన్ని ప్రపంచానికి వెలుగు దివ్వెగా అందిస్తారు. చార్లెస్ డార్విన్ ఎంతో శ్రమించి పరిణామవాదం అనే సిద్ధాంతాన్ని ప్రపంచం ముందుకు తెచ్చారు. ఆయన దీన్ని శాస్త్రబద్ధంగా నిరూపించారు. ఎడిన్‌బర్గ్‌లో మెడిసన్ చేయక ముందు... కేంబ్రిడ్జిలో స్టడీ ఆఫ్ డివినిటీని అధ్యయనం చేయడానికి వెళ్ళినపుడు కూడా... ఆయన అందులో కుదురుకోలేదు. ఆయన వివిధ రకాల తుమ్మెదలను సేకరించి వాటిలోని మార్పులను, వైవిధ్యాన్ని గూర్చి పరిశోధించాడు. బైబిల్‌లో వున్న దైవత్వాన్ని ఆయన నమ్మలేదు. మానవులు జీవుల పరిణామం నుండి ఆవిర్భవించారని ఆయన కనుగొనగలిగాడు. రాబర్ట్ ఇంగర్‌సాల్ 'మానవుడు గొప్ప శిల్పి. గొప్ప నిర్మాణ కర్త. దేవుణ్ని మానవుడే సృష్టించాడు. తన రూపంలో తన స్వభావాలతో, తన కంటే కూడా శక్తివంతుడిగా దేవుణ్ణి తయారు చేసుకొన్నాడు' అని రాబర్ట్ ఇంగర్‌సాల్ విశ్లేషించాడు. చార్లెస్ డార్విన్ అభిప్రాయం కూడా అదే. అందుకు ఆయన 'బీగల్' నావలో 5 సంవత్సరాల్లో 5 ఖండాల్లో ప్రయాణం చేశాడు. హెచ్.యం.యస్.బీగల్ నావే ఆయనకు 5 సంవత్సరాలు ఒక ఇల్లు. ఆయన ప్రయాణంలో సీ సిక్‌నెస్‌కు గురయ్యాడు. అంతే కాదు ఆ అనారోగ్యం ఆయన్ని జీవితాంతం వేధించింది కూడా. ఆయన ఆయా జాతులను పరిశోధించడమే కాదు. ఒక శాస్త్రీయ సత్యాన్ని కనుగొనడం కోసం ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన వ్యక్తిని, అందునా 5 ఖండాలు 5 సంవత్సరాల్లో తిరిగిన వ్యక్తిని ప్రపంచంలో మరొకరిని చూడలేం. అసలు ప్రపంచం డార్విన్ అనే శాస్త్రవేత్తను గుర్తించడమే నిజమైన వెలుగు. ఎందరో తత్వవేత్తలు అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చి ఎన్నో తాత్వికమైన, శాస్త్రీయమైన, చారిత్రాత్మకమైన కొత్త అంశాలను కనుగొంటారు. అవి వెలుగులోకి రావడం చాలా కష్టం. అయితే అనేక వైరుధ్యాల మధ్య డార్విన్ వాటిని బయటకు తెచ్చాడు. డార్విన్ ముందు కూడా జీవశాస్త్ర పరిణామం గురించి కొంత పరిశోధన జరిగింది. ఆ పునాదులను కూడా డార్విన్ పరిశోధించాడు. 1707-1778 మధ్య జీవించిన జీవ శాస్త్రజ్ఞుడు లినేనియన్ స్వీడన్ దేశస్థుడు. ఆయన సిద్ధాంతాలు శాస్త్ర జ్ఞానంతో ప్రపంచానికి వెలుగునిచ్చాయి. డార్విన్‌ను అధ్యయనం చేయడం వల్ల...ఒక శాస్త్ర సత్యాన్ని కనుగొనాలంటే ఎంత సుదీర్ఘమైన ప్రయాణాలు చేయాలి? ఎన్ని ప్రమాదాలను ఎదుర్కోవాలి? ఎంత త్యాగపూరితమైన జీవితాన్ని జీవించాలి? అనే విషయాన్ని అర్థం చేసుకోవాలని మన పరిశోధకులకు అర్థం అవుతుంది. మోడీ రాజ్యంలో మత ఛాందస మంత్రులు చాలా మంది వున్నారు. వాళ్ళు జ్ఞాన విదూరులు, మానవతా రహితులు, మేథో సంపన్న విధ్వంసకులు. నిజానికి హేతువాద భావజాలానికి, మతానికి చాలా వైరుధ్యం వుంది. శాస్త్రజ్ఞానం అనేది మనుషుల బుర్రలకెక్కాలంటే, విశ్వాసాలకు అతీతంగా ఆలోచించగలిగాలి.





డాక్టర్ కత్తి పద్మారావు

తత్వవేత్తలకు, శాస్త్రవేత్తకు మధ్య సమన్వయం సాధించడంలో బెట్రండ్ రస్సెల్ అద్వితీయమైన పాత్రను పోషించాడు. డార్విన్‌లో కాని, కారల్‌మార్క్స్‌లో కాని మరి ఏ తాత్వికునిలోను శాస్త్రవేత్తలోను వున్న శాస్త్రీయ భావజాల విస్తృతిని రస్సెల్ మన ముందుకు తెచ్చాడు. ప్రతి తత్వవేత్తకు, శాస్త్రవేత్తకు జ్ఞానానికి పరిమితులు ఉంటాయి. రాబోయే కాలం వారు వాటిలో కొన్నింటిని ఖండించవచ్చు. కొన్నింటిని పూరించవచ్చు. ఇదొక సత్యాన్వేషణాక్రమం. ప్రతి పౌరుడు, విద్యార్థి, పరిశోధకుడు శాస్త్రవేత్తల జీవితాలను అధ్యయనం చేయడం వలన, స్ఫూర్తి పొందవచ్చు. అంతే కాదు, వారి నుండి అధ్యయన క్రమాన్ని, పరిశోధనా క్రమాన్ని మనం అనుసరించవచ్చు. చార్లెస్ డార్విన్ గొప్ప పరిశోధకుడే కాదు, గొప్ప అధ్యయన పరుడు. ఆయనది శాస్త్రపరమైన రచన. ఆయన జీవితం లోని ఆటుపోట్లను ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నాడు. డార్విన్ పరిణామ వాదాన్ని 6వ తరగతి నుండే పిల్లలకు అభ్యసనం చేయించగలిగితే శాస్త్రం ఆవశ్యకత, మానవుని పుట్టుక మూలాలు విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అర్థమౌతాయి. భూమి దేవత, పాల సముద్రం, శేష శాయి తల్పాలు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సృష్టి, పెంపు, లయ కారుకులనే భ్రమలు తొలుగుతాయి. జ్యోతిష్య శాస్త్రం పచ్చి బూటకం, ఖగోళ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలని తెలుస్తుంది. పరిణామ వాదం బుద్ధికి పదును పెడుతుంది. డార్విన్ పరిణామ వాదం ఒక శాస్త్రంగా విద్యా వ్యవస్థను సుసంపన్నం చేసి మానవుని ఆవిర్భావం మీద ఒక స్పష్టతను తీసుకొచ్చి మనుషుల్లో ఆత్మస్థైర్యాన్ని కలుగ జేస్తుంది. ఈ రోజున భారతదేశమే కాదు. ప్రపంచం మొత్తం కూడా డార్విన్ పరిణామవాదం వైపు నడుస్తుంది. ఆర్.యస్.యస్ వాళ్ళు సైతం శాస్త్ర జ్ఞాన ఫలాలను అనుభవిస్తున్నారు. మనిషి పుట్టుక గురించి తెలిస్తేనే వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది.

సైన్స్ బోధించే ఉపాధ్యాయులే రాళ్ళకు మొక్కుతుంటారు. పిల్లలకివ్వాల్సిన పాలను రాళ్ళపై పోస్తారు. భారతదేశంలో లైబ్రరీల కంటే గుడులు ఎక్కువ. ల్యాబ్‌ల కంటే ఆశ్రమాలు ఎక్కువ. దేవుళ్ళు, దేవతల పేర్లను పిల్లలకు బట్టీ పట్టిస్తారు. శాస్త్రవేత్తల పేర్లు రావు. రాముడు, కృష్ణుడు ఎవర్ని చంపారో నేర్పుతారు. ఏ వస్తువును ఎవరు కనుగొన్నారో మాత్రం చెప్పరు. దీని వల్ల విద్య మూఢ విశ్వాసాల మధ్యలో నలిగిపోతుంది. నిజానికి విద్య సమాజం అంటే ఏమిటో తెలుపుతుంది. ప్రకృతికి తనకు వుండే అంతస్సంబంధాలను తెలుపుతుంది. అందువల్ల విద్య, జ్ఞానం, సమన్వయం అవుతాయి. సామాజిక ప్రగతికి అవి మార్గాన్ని నిర్దేశిస్తాయి. ఇప్పుడు సంఘ పరివార శక్తుల్ని దాని పునాది మీద వున్న రాజ్యాన్ని దించడమే లౌకికవాదుల కర్తవ్యం. అందుకు ఐక్యంగా, సమన్వయంగా, సముజ్వలంగా, సముత్తేజంగా, వైజ్ఞానిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్ళాలి. రాజకీయ అధికారాన్ని కూడా లౌకిక వాదులు చేపట్టినప్పుడే ఆర్.యస్.యస్ వైజ్ఞానిక వ్యతిరేక వాదాలకు చరమగీతం పాడగలం. ఇది వైజ్ఞానిక విప్లవ యుగం. ఈ యుగ పరిణామాన్ని ఎవరూ ఆపలేరు. ఇది చారిత్రక సత్యం.

(రచయిత నవ్యాంధ్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెల్ : 9849741695)



అందరూ తమ పిల్లల గురించి చాలా కలలు కంటారు. కొన్ని సందర్భాల్లో, కొన్ని కారణాల వల్ల పిల్లలకు మానసిక వైకల్యం కలిగితే కృంగిపోతారు. ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఉన్నా.. నగరాల్లో నివాసముంటున్నా.. ఎంతో కొంత వైద్యం అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో నివసించే సామాన్యుల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంటుంది. అలాంటివారికి అందుబాటులో ఒక ఆసరా కావాలి. ఆపన్నహస్తం ఒకటి ఆదుకోవాలి. అలా ఆలోచించే ఆ దంపతులు ఒక సంస్థను స్థాపించారు. తమ కుమార్తె మానసిక వైకల్యంతో ఉందని తెలిశాక - ఇంకా ఇలాంటి పిల్లలు ఎంతమంది ఉన్నారోనని ఆలోచించారు. అలాంటివారికి తాము కొంత ఆసరాగా నిలవాలని నిర్ణయించుకున్నారు. శిరీష మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం నెలకొల్పి, అందరికీ సేవలు అందించటం మొదలుపెట్టారు. ఆ కేంద్రాన్ని మనమూ సందర్శిద్దాం పదండి.

విభిన్నులకు ఆసరా... భవిష్యత్తుకు బాసట..

శిరీష పునరావాస కేంద్రం 2004లో కృష్ణాజిల్లాలోని వీరంకిలాకు గ్రామంలో స్థాపించారు. అప్పుడు ఐదుగురు మానసిక వైకల్యమున్న పిల్లలతో చిన్న రేకుల షెడ్డు కింద మొదలైన ఈ సంస్థ ప్రస్తుతం 80 మంది పిల్లలకు ఆదరువుగా నిలిచింది. ఈ సంస్థ డైరెక్టర్ మన్నే సోమేశ్వరరావు దూరదర్శన్‌లో ఉన్నతోద్యోగి. ఈయన భార్య రత్నబాయమ్మ, టుబాకో బోర్డులో ఉద్యోగి. శిరీష పునరావాస కేంద్రం స్థాపించడం వెనుక ఈ దంపతుల పడిన వేదనే కారణం. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అందులో చిన్నపాప శిరీష అందరిలా కాకుండా కొంత విభిన్నంగా ప్రవర్తించేది. ఈ విషయాన్ని ముందుగా గుర్తించలేకపోయారు. పాప పెరిగే కొలదీ ఏదో సమస్య ఉందని అనుకున్నా... ఐదారేళ్ల వయసు వచ్చేవరకూ మానసిక సమస్య ఉందని అర్థం చేసుకోలేకపోయారు. విషయం తెలుసుకున్న తర్వాత ఆ సమస్యను ఒక వ్యాధిగా భావించిన తల్లిదండ్రులు చాలామంది డాక్టర్లను కలిశారు. చివరికి శిరీషకు ప్రత్యేక విద్య అవసరమని తెలుసుకున్నారు. గుంటూరులోని ప్రముఖ మానసిక వైకల్యుల స్కూల్లో చేర్పించారు. అప్పుడే తమ పాపలాంటి వారు చాలామంది ఉన్నారనీ, వారందరి పరిస్థితీ చాలా దారుణంగా ఉందనీ తెలుసుకున్నారు. మెదడు పరిపక్వంగా లేకపోవడం వల్ల వచ్చే మానసిక సమస్యను ఎదుర్కొంటున్న పిల్లల్ని మామూలుగా మార్చడానికి ఏదో ఒక ప్రయత్నం మొదలుపెట్టాలనుకున్నారు. ప్రత్యేక విద్యా విధానంతో ఈ పిల్లలను మామూలు వ్యక్తులుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని గ్రహించి, అలాంటివారి కోసం ఒక ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయాలనుకున్నారు. అదే శిరీషా రిహాబిలిటేషన్ సెంటర్.

అలాంటి పిల్లల కోసం ...

ప్రతి వేసవిలో ఈ కేంద్రంలో పనిచేసే టీచర్లు చుట్టుపక్కల అన్ని గ్రామాలకూ వెళతారు. ఇంటింటికీ తిరిగి మనోవైకల్య సమస్యతో బాధపడుతున్న పిల్లల్ని గుర్తిస్తారు. ఆ పిల్లల్ని తమ ప్రత్యేక పాఠశాలకు పంపమని తల్లిదండ్రులను అడుగుతారు. తొలుత చాలామంది తల్లిదండ్రులు పిల్లల్ని పంపడానికి సిద్ధపడేవారు కాదు. మానసిక సమస్యతో బాధపడుతున్న పిల్లలున్నారని చెప్పుకోవడానికే కొందరు తల్లిదండ్రులు ఇష్టపడేవారు కాదు. పిల్లల్ని పంపితేనే వారిలో మార్పు వస్తుందనీ, పిల్లల్ని ఇంట్లోనే ఉంచినా, గొలుసులతో కట్టేసినా వారి ఆరోగ్యం మరింత క్షీణిస్తుందనీ, మానసిక సమస్య తీవ్రంగా మారుతుందనీ తల్లిదండ్రులకు నచ్చజెప్పేవారు. పిల్లలను ఇంటి దగ్గర నుంచి తీసుకొని వెళ్లి, తిరిగి ఇంటికి పంపుతామనీ, సదుపాయాలన్నీ ఉచితంగానే అందిస్తామనీ చెప్పేవారు. స్కూల్లో పాఠాలు చెప్పడం నుంచీ పిల్లల్ని ఇంటికి పంపేవరకూ పూర్తి బాధ్యత తీసుకుంటామనీ భరోసా ఇచ్చి.. ఒప్పించేవారు.

మెరుగయ్యాక... మామూలు విద్య

ఇలాంటి పిల్లలకు ప్రత్యేక విద్యను అందించడానికి వివిధ పద్ధతులను పాటించాల్సి ఉంటుంది. వారికి గల ఐక్యూ స్థాయిలు, తెలివితేటలు తదితర పరిస్థితులను అంచనా వేసి దాన్నిబట్టి శిక్షణ ఇవ్వాలి. వీళ్ల వివిధ స్థాయిల్లోని విద్యా పద్ధతులను విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత తల్లిదండ్రులతో మాట్లాడి, ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వీళ్లను చేరుస్తారు. ఏ స్కూల్లో ఈ పిల్లల్ని చేరుస్తారో అక్కడి టీచర్లతో మాట్లాడి ఈ పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోమని చెబుతారు. ఈ విధంగా మానసిక సమస్యను ఎదుర్కొంటున్న పిల్లల్ని ప్రధాన స్రవంతిలో భాగస్తులను చేస్తారు. ఇలా ఇప్పటివరకూ శిరీషా పునరావాస కేంద్రం నుంచి ప్రతి ఏడాదీ కొందరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరుతూనే ఉన్నారు. ఇక్కడ శిక్షణ పొందినవారు ప్రధాన స్రవంతి విద్యావ్యవస్థలోకి వెళ్లలేరు అనుకుంటే.. ఇక్కడే వారికి వృత్తి విద్యా కోర్సులు నేర్పిస్తారు. ఆడపిల్లలకు టైలరింగ్ నేర్పించడం, చీరలపై డిజైన్లు చేయడం, ప్రత్యేకమైన గాజుల్ని తయారుచేయడం, పాట్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, గ్రీటింగ్ కార్డులు తయారుచేయడం వంటి పనుల్ని నేర్పిస్తారు. మగపిల్లలకు డిటర్జెంట్ పౌడర్, ఫినాయిల్, విస్తరాకుల తయారీ వంటి వివిధ పనుల్లో శిక్షణ ఇస్తారు. అయితే ఎక్కువగా పిల్లల్ని ప్రధానస్రవంతిలో భాగస్తులను చేయడానికి ప్రయత్నిస్తారు. ఆ పిల్లలు చదువుకుంటే వారికి ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం లభిస్తుందని వీరి నమ్మకం. అప్పుడు వాళ్లు ఇతరులపై ఆధారపడకుండా ఉండటమేకాక, వారే సహకారంగా ఉండగలిగిన సామర్థ్యాన్ని అందుకుంటారు. దాంతో వారిలో మానసికస్థయిర్యం కూడా ఆ మేరకు పెరుగుతుంది.





ఉచిత సౌకర్యాలు

శిరీషా రిహాబిలిటేషన్ సెంటర్ ప్రస్తుతం రెండు శాఖలుగా పనిచేస్తుంది. ఉయ్యూరు శాఖలో 50 మంది పిల్లలున్నారు. వీరంకిలాకులోని ప్రధానశాఖలో 30 మంది పిల్లలు ఉన్నారు. ఈ సంస్థ ఇక్కడ బాలురకు వసతి సౌకర్యమూ కల్పిస్తోంది. దీనిలో పనిచేసే టీచర్లు నిబద్ధతతో పనిచేయడం వల్ల మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు శిక్షణ ఇవ్వడంలో మంచి ఫలితాలను సాధిస్తున్నారు. ఇక్కడున్న పదిమంది టీచర్లు ప్రత్యేక విద్యతో పాటు సెరిబ్రల్‌పాల్సీ వారికీ శిక్షణ ఇస్తారు. మానసిక వైకల్యంతో పాటు ఎముకల సమస్య, ఇతర శారీరక సమస్యలున్న పిల్లలకు ఫిజియోథెరపీ వంటి వైద్య సదుపాయాలూ కల్పిస్తారు. అదేవిధంగా మాటరాని పిల్లలకు స్పీచ్ థెరపీనీ అందిస్తారు. ప్రతి నెల న్యూరోసైకియాట్రికి చెందిన వైద్యులు వచ్చి పిల్లల్ని పరీక్షిస్తారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న పిల్లలందరికీ ఉచితంగా మధ్యాహ్న భోజనం అందిస్తారు.

దాతల సహకారం

ఈ సంస్థ నిర్వహణకు విరాళాల కోసం ఎవర్నీ చేయిచాచి అడగరు. స్వచ్ఛందంగా వచ్చే దాతలు కొందరు పిల్లలకు కావాల్సిన మందుల్ని ఇస్తుంటారు. ఇంకొందరు ఆహారపదార్థాల్ని అందిస్తారు. మరికొందరు నగదు రూపంలో సహాయం చేస్తారు. పిల్లల విద్యకు అవసరమైన వస్తువుల్ని అందించే దాతలూ ఉన్నారు. దీన్ని స్థాపించిన మన్నే సోమేశ్వరరావు నెల జీతం మొత్తం ఇక్కడి అవసరాల కోసమే ఇచ్చేస్తారు. వారి ఇంటి అవసరాలకు ఆయన భార్య రత్నాబాయమ్మ జీతమే ఆధారం. ఇలా దాదాపు దశాబ్ద కాలం నుంచి ఒకరి జీతంతో స్కూలు నిర్వహిస్తూ, మరొకరి జీతంతో ఇంటిని నెట్టుకొస్తున్నారు ఈ దంపతులు. కేంద్ర ప్రభుత్వం అందించే దీనదయాళ్ గ్రాంట్ గురించిన హామీ ఈ మధ్యనే రావడంతో ఆర్థికంగా కొంత ఊరట పొందవచ్చని ఆశిస్తున్నారు. నెలనెలా క్రమం తప్పకుండా సహాయం చేసే వారిలో సోమేశ్వరరావు సహోద్యోగులూ ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె అనూష డాక్టర్ కావడం వల్ల సంస్థలోని పిల్లలకి ప్రతినెలా ఆరోగ్యపరీక్షలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

క్రీడల్లో ప్రతిభ

ఈ సంస్థలో పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఈ కేంద్రానికి ఎన్నో బహుమతులు అందాయి. ఇప్పటివరకూ సాధించిన జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులు చాలానే ఉన్నాయి. రన్నింగ్, డిస్క్‌త్రో, షాట్‌పుట్, లాంగ్ జంప్, క్యారమ్స్ వంటి క్రీడల్లో ఈ సంస్థలోని పిల్లలు ప్రతిభ చూపిస్తున్నారు. ఈ సంస్థ ఉత్తమ సేవలకుగానూ ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో ఉత్తమ మానసిక వికలాంగుల సంస్థగా అవార్డును సాధించింది. అంతకుముందు ఏడాది జిల్లా స్థాయిలో ఈ అవార్డు పొందారు. మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు ఆదరువుగా ఈ సంస్థ, ఈ దంపతులూ చేస్తున్న కృషి అభినందనీయం.

- ప్రవీణ్ వెలువోలు

జీవన సౌరభం

కన్ను చెదిరితే గురిమాత్రమే తప్పుతుంది. మనసు చెదిరితే జీవితమే దారి తప్పుతుంది.

మీ కోసం



పచ్చిమిర్చి, కొత్తిమీర కలిపి చేసిన కారం కూరల్లో వేస్తే రుచి అద్భుతం.

అత్యాచారానికి గురైన స్త్రీలను ఆ సంఘటన తర్వాత బాధపెట్టే ప్రశ్న ఒకటి వేధిస్తూ ఉంటుంది. బంధువుల నుంచి న్యాయస్థానం వరకూ అందరూ 'ఎలా జరిగింది?' అనే ప్రశ్న మళ్లీమళ్లీ అడుగుతారు. ఇదంతా కారణం కనుక్కొనే 'అవసరం' కోసం అనుకోవొచ్చు. మానవత్వం, విజ్ఞత లోపించిన మరికొందరు ఉంటారు. కూడని ప్రశ్నలు వేసి, వ్యాఖ్యలు చేసి... సమాజానికి సభ్యత నేర్పుతున్నామని భావిస్తారు. 'ఫలానా తరహా బట్టలే వేసుకోవాలి. ఫలానా విధంగానే ప్రవర్తించాలి' అంటూ ఉపన్యాసాలూ ఇస్తారు. ఇదిగో.. అలాంటివారు మళ్లీ మళ్లీ అడక్కుండా చెంప ఛెళ్లుమనిపించే సమాధానం. ఇప్పటికైనా కళ్లు తెరిచి, నిజాన్ని చూడండనే హెచ్చరిక. అత్యాచార బాధితులు ఆ దారుణం జరిగినప్పుడు ఎలాంటి బట్టలు వేసుకున్నారో... ఇదిగో కళ్లు తెరచి చూడండనే ... ఎగ్జిబిషన్ !


'సభ్యత' ఉపదేశాలకు సరైన సమాధానం!

రోజురోజుకీ అత్యాచారాలు పెరిగిపోతున్న తరుణంలో 'రెచ్చగొట్టే విధంగా స్త్రీలు ధరించే వస్త్రాలే ఈ పరిస్థితులకు కారణం' అని కొంతమంది చెబుతుంటారు. చాలా సందర్భాల్లో వేసుకున్న బట్టలబట్టే అత్యాచారానికి గురైన స్త్రీపై చూపించే జాలి కూడా ఆధారపడి ఉంటుంది. కానీ బెల్జియంలో జరిగిన ఈ ఎగ్జిబిషన్ ఇలాంటి ఆలోచనలు నిరుపయోగమైనవని తేల్చింది. అంతేకాదు, ఇలా ఆలోచించడం ఒక ఉన్మాదికి ఊతమిచ్చినట్లేనని సూచించింది. 'వాట్ వర్ యూ వేరింగ్? (నువ్వు ఎలాంటి బట్టలు వేసుకున్నావు?)' అనే పేరుతో బ్రజెల్స్ అనే ప్రాంతంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌లో అత్యాచారానికి గురైనప్పుడు బాధిత స్త్రీలు ధరించిన బట్టలను ప్రదర్శించారు. వాటిలో పైజామాలు, ట్రాక్‌సూట్‌లు, ప్యాంట్, షర్ట్, లాంగ్ కుర్తీల వంటివే చాలా దుస్తులు ఉన్నాయి. అంతేకాదు, ముక్కుపచ్చలారని పసిపిల్లల గౌన్లూ ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. చిన్నారుల నుంచీ ముసలివారి వరకూ అత్యాచారాలకి గురైన బాధితులు వస్త్రధారణ నిందితులను రెచ్చగొట్టే విధంగా లేవని ఈ ప్రదర్శన చూసి.. ప్రపంచం తెలుసుకోవాలనే దీన్ని ఏర్పాటు చేసామని అంటారు నిర్వాహకులు. దీన్లో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ కన్సాస్ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్ కూడా ప్రదర్శించారు. ఇందులో అత్యాచారాన్ని ఎదుర్కొన్న అమెరికాకు చెందిన విద్యార్థినులు సంఘటనా స్థలంలో ధరించిన వస్త్రాలను ప్రదర్శించారు.

దీని నిర్వాహకులు ప్రివెన్షన్ సర్వీస్ సెంటర్‌వారు. మొలెన్‌బీక్ మార్టిటైమ్ కమ్యూనిటీ సెంటర్‌లో పనిచేసే డాల్ఫిన్ గూస్సెన్స్ అనే మహిళ కన్సాస్ యూనివర్సిటీ విద్యార్థినులను కలిసి, వారి లైంగిక హింసకు గురైనప్పుడు ధరించిన బట్టలు, అనుభవాల గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఈ ఏర్పాట్లు చేసింది. యూరప్ అంతా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించాలని ఆమె ఆశిస్తుంది.

ఈ ఎగ్జిబిషన్‌లో అందర్నీ మరింత బాధకు గురి చేసింది ఒక చిన్నపిల్ల గౌను. 'మై లిటిల్ పోని' అనే పేరుతో ప్రదర్శించిన ఈ బాలిక డ్రెస్‌ను చూసినవారంతా ఆవేదనకు లోనయ్యారు. నిజంగా అత్యాచారానికి రెచ్చగొట్టే బట్టలే కారణమైతే ఈ పసిపాప అత్యాచారానికి ఎలా గురవుతుందంటూ ప్రశ్నించారు. మన దేశంలోనూ చాలామంది అత్యాచారాలకు బట్టల్ని కారణంగా చూపుతుంటారు. అబూ ఆజ్మి వంటి ఎందరో నేతలు పొట్టిబట్టలు వేసుకుంటే అత్యాచారాలు ఎలా ఆగుతాయంటూ వాదిస్తున్నారు. మతవాదులు చాలామంది మహిళల్లో ఉండాల్సిన సభ్యత గురించి చర్చిస్తుంటారు. అసభ్యకరమైన ఆలోచనల మలినాన్ని కడుక్కోవడం మాని, స్త్రీలను కించపరచే వారికి ఇలాంటి ప్రదర్శనలు కనువిప్పు కలుగజేస్తాయని ప్రజాస్వామ్యవాదులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.









ఇది షీట్ మాస్కుల హవా!

శీతాకాలంలో చర్మం ఎక్కువ పొడిబారటం సహజం. దీనికి చాలామంది కోల్డ్‌క్రీమ్‌లు వాడుతుంటారు. అయితే వేరే పద్ధతుల్లోనూ పొడి చర్మానికి మరింత ఆరోగ్యాన్ని అందించవచ్చు. అవే చర్మాన్ని తేమగా ఉంచే మాస్కులు. వీటిలో ఓవర్‌నైట్ మాస్క్, సూపర్‌ఫుడ్ మాస్క్, షీట్ మాస్కులు అందాన్ని, చర్మ ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. అవేంటో చూద్దాం.

ఓవర్‌నైట్ మాస్క్: ఇది నిద్రపోతున్నంతసేపూ చర్మంపై పనిచేస్తూ శరీరాన్ని తేమగా ఉంచడానికి సహకరిస్తుంది. పొడి చర్మం ఉన్నవారికి మరింత మేలు చేస్తుంది. ముఖ్యంగా గాలి, చల్లని వాతావరణం కారణంగా ఏర్పడే పొడి చర్మానికి ఇది మంచి పరిష్కారం. సరైన పద్ధతిలో ఓవర్‌నైట్ మాస్క్‌ను వాడితే అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. దీన్ని వేసుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవాలి. ఆ తర్వాత ఈ మాస్క్‌ను 5-10 నిమిషాలు మృదువుగా అప్లై చేయాలి. అయితే తప్పనిసరిగా సూచనలు పాటించగల్గితే మంచి ఫలితాలు ఉంటాయి.



సూపర్‌ఫుడ్స్ మాస్క్: క్రాన్‌బెర్రీ, పసుపు, అవకాడో వంటి సూపర్ ఫుడ్స్ శీతాకాలంలో శరీరానికి మంచి పోషణ అందిస్తాయి. ఇవి ఉన్నతమైన గుణాలు కలిగి శరీరానికి అవసరమైన ఆరోగ్యాన్ని ఇస్తాయి. శీతాకాలంలో పొడి వాతావరణానికి పాడైన చర్మానికి కాంతినివ్వడంలో బాగా పనిచేస్తాయి.

షీట్ మాస్క్: సౌందర్య పరిశ్రమలో షీట్ మాస్కులు కొత్తగా వచ్చిన ఉత్పత్తులు. తక్కువ సమయంలోనే ఎక్కువ మందిని ఆకర్షిస్తున్న ఉత్పత్తులు కూడా ఇవే. షీట్‌లా ఉండే వీటిని వాడటం చాలా సులభం. అంతేకాదు, తక్కువ సమయంలోనే శరీరానికి కావాల్సిన తేమను అందించగల సుగుణాలు ఈ మాస్క్‌లో ఉన్నాయి. తక్షణ తేమతో పాటు కాంతివంతమైన చర్మాన్ని అందిస్తాయి. చల్లని వాతావరణంలోకి వెళ్లబోయే ముందు ఈ మాస్క్‌ను వాడితే తక్షణ మెరుపు వస్తుంది.

ఇవి కాకుండా ఇంట్లోనే సొంతగా మాస్కులు తయారుచేసుకోగల్గితే మరింత మంచిది. బొప్పాయి, టమోటా, అరటిపండ్లకు తేనె, శనగపిండిని కలిపి చేసుకునే మాస్కులూ చర్మానికి తేమనిస్తాయి.

టెట్ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

చార్లెస్ ఉడ్ విద్యానివేదిక ఎప్పుడు సమర్పించారు?



ఎవిపి.రాజు
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

ఆధునిక భారతదేశ చరిత్ర

1. భారతదేశంలో ఆంగ్లభాషను (బ్రిటిష్ కాలపు) ఎప్పుడు ప్రవేశపెట్టారు ?

గవర్నర్ జనరల్ విలియం బెంటింక్, లార్డ్ మెకాలే ఉద్దేశాలతో ఏకీభవించి, 1835 మార్చి 7న ఆంగ్లభాషను బోధనా భాషగా గుర్తిస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత వర్గీయులను ఆంగ్లభాష ద్వారా, విద్యావంతులను చేయడం 'మెకాలే పద్ధతి'లోని ప్రధాన ఉద్దేశం. సామాన్య ప్రజానీకానికి విద్యనందించడం మెకాలే ఉద్దేశంగాదు. 'మనకున్న పరిమితి నిధులతో భారతీయులందరికీ విద్యాబోధన చేసేందుకు ప్రయత్నించడం అలవిగాని పని' అని అతడు విశదపరిచాడు. ఆంగ్లభాషను నేర్చుకున్న ఉన్నత వర్గీయులు, ఇతర భారతీయ భాషలను ప్రభావితం చేయగలరని, వారు తక్కినవారికి ఆంగ్లభాషను బోధించేందుకు కొత్త వర్గీయులుగా ఉండరని, అతడు భావించాడు.

2. చార్లెస్ ఉడ్ విద్యానివేదిక ఎప్పుడు సమర్పించాడు?

ఇంగ్లండ్‌లో బోర్డు ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడైన సర్ ఛార్లెస్ ఉడ్, ఆంగ్లజాతి, ఆంగ్లేయ సంస్థలు గొప్పవని భావించాడు. ఇవి తక్కిన వారికి అనుకరణయోగ్యమని అతని నమ్మకం. 1854లో ఉడ్ భారతదేశానికి అవసరమైన విద్యావిధానంపై, ఒక తులనాత్మక పత్రాన్ని రూపొందించాడు. 'ఇది హిందూ దేశంలో ఆంగ్ల విద్యకు మాగ్నాకార్టా'గా పిలిచారు. ఇది, అంతకు మునుపు ఇచ్చిన సహాయాలన్నింటికన్నా, చాలా విశాల పరిధిగలది. ఉత్తరోత్తర విద్యావ్యాప్తికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను స్థూలంగా సూచించింది.

ఐరోపాలో అభివృద్ధి గాంచిన కళలు, శాస్త్రాలు, వాఙ్మయం, వేదాంతం మొదలైనవాటిని భారతీయులలో వ్యాప్తి చేయడం ఆంగ్ల విద్యావిధానపు ప్రధాన ఆశయమని ఉడ్ ప్రకటన తెలియజేసింది. బోధనాభాషకు సంబంధించి ఉడ్, ఉన్నత విద్యకు ఆంగ్లం, ప్రాథమిక విద్యకు ప్రాంతీయ భాషలు బోధనాభాషలుగా ఉంటాయని ప్రకటించాడు. ప్రభుత్వేతర పాఠశాలలకు ప్రభుత్వ ధన సహాయం అందించారు. ఉడ్ ప్రకటనలో కోల్‌కతా, ముంబయి, మద్రాస్ నగరాలలో విశ్వవిద్యాలయాలు స్థాపించాలని సూచించారు. అవి లండన్ విశ్వవిద్యాలయ ప్రాతిపదికపై వృత్తి విద్యలకు, సాంకేతిక పాఠశాలల స్థాపనకూ ప్రాధాన్యత ఇచ్చాయి. స్త్రీ విద్యకు కూడా ఉడ్ ప్రకటనలో ప్రాముఖ్యత కల్పించారు.

3. భారతదేశంలో వెలువడిన మొదటి బ్రిటిష్ పత్రిక ఏది?

1780లో బెంగాల్ గెజిట్ అనే వారపత్రిక, జేమ్స్ ఆగస్టస్ హికె అనుమతిచే ప్రారంభించారు. ఆ పత్రిక 1782లో గవర్నర్ జనరల్ వారన్‌హేస్టింగ్స్‌ను విమర్శించిన కారణంగా మూతబడింది. బెంగాల్ గెజిట్ తర్వాత అనేక వార్తా పత్రికలు వచ్చాయి. కోల్‌కతా గెజిట్ (1784), బెంగాల్ జర్నల్ (1785), కోల్‌కతా క్రానికల్ (1786), మద్రాస్ కొరియర్ (1788), బాంబే హెరాల్డ్ (1789).. మొదలైనవి ప్రధానమైన పత్రికలు. వాటి ప్రచురణలు మిక్కిలి పరిమితమై ఉండేవి. పత్రికా చట్టాలు లేని కారణంగా ఆ రోజుల్లో పత్రికలు వాటి పనితీరు కంపెనీ అధికారులపై ఆధారపడి ఉండేవి.

4. భారతదేశంలో బ్రిటిష్ పత్రికా చట్టం ఎప్పుడు ఏర్పడింది?

పత్రికలపై సెన్సారును మొదట 1799లో వెల్లస్లీ విధించాడు. 1807లో సెన్సార్ షిప్ చట్టం, వార్తాపత్రికలకేగాక కరపత్రాలకు, పుస్తకాలకూ వర్తించింది. లార్డ్ హేస్టింగ్స్ (1813–1823) పత్రికా స్వాతంత్ర్యాన్ని పూర్తిగా నమ్మి, తన ఉదాత్తభావాలను కార్యరూపంలోకి మార్చదలిచాడు. పత్రికలపై ఉన్న ఆంక్షలను రద్దు చేశాడు. ప్రభుత్వం సర్ థామస్ మన్రోను భారతదేశంలోని పత్రికల సమస్యల గురించి పరిశీలించడానికి నియమించింది. మన్రో సూచనల మేరకు ప్రభుత్వం 1823లో పత్రికా చట్టాలను రూపొందించింది. దీని ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులు లేనిదే ఏ పత్రికగాని, గ్రంథంగాని ప్రచురించకూడదు. ఉత్తరువు పొంది, ప్రచురించినవి, ప్రభుత్వ పరిశీలనకు సమర్పించాలి. రాజారామ్‌మోహన్‌రాయ్, ద్వారకానాథ్ ఠాకూర్ మొదలైనవారు అలాంటి పత్రికా చట్టాలకు అసమ్మతి తెలిపినా, అవి 1823 ఏప్రిల్ 15న అమలులోకి వచ్చాయి. లార్డ్ విలియం బెంటింక్ పత్రికల ఎడల కొంత సహకార భావాలను కలిగినవాడు. అతడు పత్రికలపై ఉన్న ఆంక్షలను తొలగించకపోయినా, అవి ఏ అంశాన్నయినా క్షుణ్ణంగా చర్చించవచ్చని సూచించాడు. చార్లెస్ వెరాట్క్యాఫ్ పత్రికల స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, భారత పత్రికలకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించినవాడుగా పేరుపొందాడు. లార్డ్ మెకాలే కూడా పత్రికలకు ఎట్టి అవరోధాలూ కలిగించకూడదని భావించాడు.

5. భారతదేశంలో బ్రిటిష్ హయాంలో ఎప్పుడు కరువులు ఏర్పడ్డాయి ?

కంపెనీ పరిపాలన స్థాపనానంతరం మొట్టమొదటి కరువు 1770లో బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాలలో సంభవించింది. దాదాపు 1/3 వంతు జనాభా కరువు సమయంలో మరణించారు. 1783లో సంభవించిన క్షామం, ఉత్తర హిందూ దేశాన్ని పూర్తిగా బాధించింది. రాజస్థాన్, ముంబయి, మద్రాస్ రాష్ట్రాలు కూడా దీని ప్రభావానికి లోనయ్యాయి. వర్షాలు లేకపోవడం, మిడతల బాధ ప్రధానంగా ఈ కరువుకు కారణంగా పేర్కొనవచ్చు. 1790లో సంభవించిన కరువు ముంబయి, గుజరాత్, ఉత్తర సర్కారులు, ఒరిస్సా తదితర ప్రాంతాలను బాధించింది. 1802–04 ప్రాంతంలో వర్షాభావం వల్ల ఉధృతమైన కరువు సంభవించి, మద్రాస్ రాష్ట్రం అనేక కష్టాలకు లోనైంది. 1800 నుంచి 1854 వరకూ మద్రాస్ రాష్ట్రంలో దాదాపు ఆరు, ముంబయిలో మూడు కరువు సంఘటనలు సంభవించాయి. కరువులు మీద నియమించిన కమిటీలు..

✧ 1857లో కాంప్‌బెల్ అనే అతని ఆధ్వర్యంలో నియమించిన కమిటీ.

✧ 1880లో నియమించిన కరువు కమిషన్

✧ ప్రభుత్వం మరొక 'క్షామ కమిషన్'ను నియమించింది. దీనికి సర్ మాక్‌డోనల్ అధ్యక్షుడు. ఈ కమిషన్ నివేదిక 1901లో సమర్పించింది.

✧ 1876–78లో ధాత కరువు/ పెద్ద కరువు తర్వాత భారత ప్రభుత్వం 1778లో సర్‌జాన్ స్ట్రాచీ అధ్యక్షతన 'కరువు నివేదిక సంఘాన్ని' నియమించింది. ఈ సంఘం తన నివేదికను 1800లో సమర్పించింది.

✧ రెండో కరువు నివేదిక సంఘం (1898), సర్ జేమ్స్‌లూల్ ఆధ్వర్యంలో నియమించింది.

✧ 1899లో కరువు మూలంగా మూడు కరువు సంఘాలు స్థాపించారు. దీనికి ఆంటోని మెక్‌డోనెల్ అధ్యక్షుడు. కరువు సమయాలలో ప్రభుత్వం ప్రజాక్షేమం దృష్ట్యా, ఉపాధి సౌకర్యాలు కొనసాగించాల్సిన అవసం ఉన్నదని అభిప్రాయపడింది.

✧ 1943లో సంభవించిన బెంగాల్ కరువు మిక్కిలి ప్రధానమైంది. ఈ కరువు సందర్భంలో దాదాపు 30 లక్షల మంది మరణించినట్లు అంచనా వేశారు. ఈ కరువు ఫలితంగా వుడ్‌హెడ్ కమిషన్‌ను నియమించారు.

✧ గ్రామాల్లో క్షామ నివారణ కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని, ఉదారంగా క్షామపీడిత ప్రాంతాల్లో భూమిశిస్తు రద్దు చేయాలని, బలహీన వర్గాలకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలని జేమ్స్ లయల్ అధ్యక్షతన ఏర్పడిన రెండో క్షామ నివారణ సంఘం సూచించింది.

6. భారతదేశంలో తోటల పరిశ్రమను బ్రిటిష్‌వారు ఎలా ప్రారంభించారు ?

19వ శతాబ్దం ఆరంభం నుంచి తేయాకు భారతదేశపు ప్రధాన తోటల పరిశ్రమైంది. బెంటింక్ ఆధ్వర్యంలో 1835లో ప్రభుత్వం ఒక ప్రయోగాత్మక క్షేత్రాన్ని స్థాపించి కొన్ని సంవత్సరాల తర్వాత దానిని అస్సాం తేయాకు కంపెనీకి అమ్మేసింది. 1852లో మొట్టమొదటి తేయాకు తోట ప్రభుత్వేతర రంగంలో స్థాపించారు.

కాఫీ మొక్కలు మొదటి సారిగా 16వ శతాబ్దంలో భారతదేశంలో ప్రవేశపెట్టారు. కానీ కాఫీ చెట్ల పెంపకం, 1830 తర్వాత మాత్రమే, క్రమబద్ధమయ్యింది. ఇవాటి పెంపకంలో ప్రధాన కేంద్రాలు మైసూర్, కూర్గ్, తిరువాన్కూర్, వూనాడ్, నీలగిరి మొదలైనవి. 1860 నుంచి 1870 వరకూ ఉన్న దశాబ్ధంలో కాఫీ ఎగుమతులు దాదాపు పదిరెట్లు పెరిగాయి.

రబ్బర్ తోటల పెంపకం, చాలా కాలం తర్వాత అభివృద్ధి చెందింది. 19వ శతాబ్దం అంతిమదశలోనూ, 20వ శతాబ్ధం ప్రారంభంలోనూ ఇది వ్యాప్తి చెందింది. రబ్బర్ ఉపయోగం రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ముఖ్యంగా తెలిసొచ్చింది. అంతరంగికంగా రబ్బర్ వినియోగం పెరిగింది. అందుకే రబ్బర్ తయారీ, అమ్మకాలకు తగిన చట్టాలు రూపొందించారు. కేరళ, మద్రాస్, కూర్గ్ మొదలైన ప్రాంతాలు రబ్బర్ ఉత్పత్తికి ప్రధాన కేంద్రాలు. నీలిమందు భారతదేశంలో గుజరాత్‌లోగాని, పశ్చిమ ప్రాంతంలో అనేక చోట్ల ప్రాచీన కాలం నుంచి పండిస్తున్నారు. నీలి మందు బట్టల తయారీకి, అద్దకానికి ఉపయోగించేవారు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ఈ వాణిజ్యంలో ఎక్కువ శ్రద్ధ చూపింది. అమెరికా ఎగుమతుల పోటీవల్ల 18వ శతాబ్దం చివరిలో నీలిమందు వ్యాపారం తగ్గుముఖం పట్టింది. కంపెనీ ప్రభుత్వం పశ్చిమ ఇండియా దీవులలోని బ్రిటిష్ వ్యాపారులను ప్రోత్సహించి, వారి మూలంగా బెంగాల్‌లో నీలి తోటల పెంపకాన్ని అభివృద్ధి చేసింది. 1850వరకూ నీలిమందు విపరీతంగా ఉత్పత్తయ్యింది.

7. బ్రిటిష్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నెలకొల్పిన పరిశ్రమలు ఏవి?

★ **బొగ్గు గనుల పరిశ్రమ :** పశ్చిమ దేశాలలో సంభవించిన పారిశ్రామిక విప్లవం బొగ్గును అధారంగా చేసుకునే శక్తిపైన ఆధారపడింది. విద్యుథ్చ్ఛక్తి వాడుకలోకి వచ్చిన తర్వాత కూడా, బొగ్గుకు ఉన్న ప్రాధాన్యత తగ్గలేదు. థర్మల్ విద్యుథ్చ్ఛక్తి వాడుకలోకి వచ్చిన తర్వాత కూడా బొగ్గు అవసరమవడం దీనికి కారణం. బొగ్గు పరిశ్రమ 1820లో రాణిగంజ్ బొగ్గు గనుల తవ్వకాలతో ప్రారంభమైందని చెప్పవచ్చు.

★ **నూలు మిల్లుల పరిశ్రమ :** భారతదేశంలో మొదటి నూలుమిల్లు 1838లో కోల్‌కతాలో స్థాపించారు. కానీ 1858లో కౌవాస్జినానా భాయ్ దావర్ అనే పార్శీ వ్యాపారి బొంబాయిలో స్థాపించిన నూలు మిల్లు బాగా విజయవంతమైన మొదటి మిల్లు. 1860–70 ప్రాంతాలలో నూలు పరిశ్రమ అమెరికా అంతర్యుద్ధం కారణంగా అనేక కష్టాలకు లోనైంది. ఆ సమయంలో పత్తి ధరలు విపరీతంగా పెరగడమే దీనికి ప్రధాన కారణం. 1885 తర్వాత అభివృద్ధికరమైన యంత్రాల ఉపయోగంతో ఈ పరిశ్రమ ముందడుగు వేయగలిగింది. మొదటి నుంచి నూలు పరిశ్రమ భారతీయులచేత నడిచింది.

★ **జనపనార పరిశ్రమ :** ప్రాచీనకాలం నుంచి బెంగాల్ జనపనారకు ప్రసిద్ధిగాంచినది. దారాలు, సంచులు ప్రధానంగా జనపనార నుంచి తయారుచేసేవారు. బెంగాల్ ప్రాంతంలో జనపనార పరిశ్రమ మిక్కిలి అభివృద్ధి చెందడానికి, అనేక కారణాలు ఉన్నాయి.

✧ ఈ ప్రాంతంలో ముడి జనుము అధికంగా లభించడం.

✧ జనపనార మిల్లులను నడపడానికి మంచి సామర్థ్యంగల స్కాట్లండ్ పెట్టుబడిదారులు ముందుకు రావడం.

✧ దీనితోపాటు చౌకగా కూలి జనాలు లభించడం.

★ **ఇనుము-ఉక్కు పరిశ్రమ :** ఇనుమును కరిగించి పోతపోయడం వంటి పద్ధతులు భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి అనుసరించిన పద్ధతి. కానీ పాశ్చాత్య పద్ధతులలో ఇనుము కరిగించే విధానం 19వ శతాబ్దం ఆరంభంలో మాత్రమే ప్రవేశపెట్టారు. ప్రసిద్ధి చెందిన ఆంగ్ల నవలాకారుడైన ఛార్లెస్ డికెన్స్ స్నేహితుడైన ఓసయా మార్షెల్‌హేల్ అనే అతడు మన దేశంలో ఇనుము పరిశ్రమలో మొదట ప్రయత్నాలు కొనసాగించాడు. మద్రాస్ రాష్ట్రంలోని దక్షిణ ఆర్కాట్‌జిల్లా పోర్టోనోవాలో 1830లో ఇనుము కార్ఖానాను స్థాపించాడు. కానీ అతని కృషి పెద్దగా ఫలితాలనివ్వలేదు.భారతీయ ఉక్కు పరిశ్రమకు పితామహుడు జమ్‌షెడ్జీ టాటా. మధ్య పరగాణలతో ఇనుము నిల్వగురించి ఒక జర్మన్ నిపుణుడు తయారుచేసిన నివేదికను చదివిన టాటా, ఇండియాలో ఇనుము ఉక్కు పరిశ్రమ స్థాపించడానికి ఉత్సాహం చూపాడు. 1907లో అతడు సక్చి అనేచోట అలాంటి పరిశ్రమను స్థాపించాడు. అతని పేరుతో సక్చి 'జమ్‌షెడ్‌పూర్'గా పేరు మార్చబడింది. హీరాపూర్ వద్ద బర్న్ కంపెనీ అనే సంస్థ, 1922లో ఇనుము పరిశ్రమను స్థాపించి, ముడి ఇనుము తయారీని ప్రారంభించింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం, అనేక ఉక్కు ఇనుము పరిశ్రమలు స్థాపితమయ్యాయి.

స్టాక్ మార్కెట్ బుడగ..!

- అప్రమత్తంగా ఉండాలి
- ఆర్థిక సర్వే రిపోర్టు
- పొంచి ఉన్న చమురు మంట
- వ్యవసాయ వృద్ధిపై ప్రభావం
- ఆర్థిక సలహాదారు సుబ్రమణ్యన్ వెల్లడి

న్యూఢిల్లీ : సరికొత్త రికార్డులతో దూసుకెళుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లపై ఆర్థిక సర్వే మదుపర్లకు తీవ్ర హెచ్చరిక చేసింది. భారత స్టాక్ మార్కెట్‌లో బుడగ వాతా వరణం నెలకొని ఉందని ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అర్విండ్ సుబ్రమణ్యన్ స్వయంగా అన్నారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. దీనికి తోడు వేగం గా జరుగుతున్న ప్రపంచీకరణ, విద్యా ప్రమాణాలు పేలవం గా ఉండటం, వ్యవసాయ రంగ వృద్ధి ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని విశ్లేషించారు. అక్రమ ఆస్తులను నిరోధించే ప్రభుత్వం చర్యల్లో భాగంగా మదుపర్లు తమ పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్లకు తరలిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా నోట్ల రద్దు తర్వాత విధించిన పన్ను దీనికి దారి తీసింద న్నారు. నగదు నిల్వలు, ఆస్తులు, బంగారం నిల్వలపై విధించిన పన్ను కారణంగా స్టాక్‌మార్కెట్‌లపై ఆసక్తి పెరుగు తుందన్నారు. అయితే ఈ బుడగ ఎపుడైనా పేలే అవకాశం ఉందంటూ హెచ్చరించారు.

పెరగడం విరగడం కోసమే..

మార్కెట్లు బాగా పెరిగినపుడు తప్పని సరిగా వెనక్కి వచ్చే అవకాశం ఉందని సుబ్రమణ్యన్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ధోరణి సాధారణమేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రతమత్తంగా వుంటూ మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ సర్వే పేర్కొంది. స్టాక్ ధరల పరంగా వేగంగా వద్ధి చెందుతున్నట్లు మార్కెట్ అంచనా వేస్తోంది. ఏదేమైనా, ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రమాదాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలంటూ సున్నిత హెచ్చరిక చేసింది. భారతదేశంలో స్టాక్ మార్కెట్ పెరుగుదలలో ఉంది. కానీ ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కార్పొరేట్ లాభాలు, జిడిపి వృద్ధి నిష్పత్తి పడిపోతుంది. ప్రతీ బ్యారెల్ ముడి చమురుపై 10 డాలర్లు పెరిగితే భారత జిడిపిపై 0.2–0.3 శాతం ప్రభావం పడుతుందని సుబ్రమణ్యన్ పేర్కొన్నారు. అదే విధంగా కరెంట్ ఎకౌంట్ లోటు 9–10 బిలియన్ డాలర్లు పెరుగుతుందన్నారు. భవిష్యత్తు సంవత్సరాల్లో అధిక చమురు ధరలు మార్కె ట్లపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయన్నారు.

రికార్డు లాభాల్లోనే మార్కెట్లు

ఆర్థిక సర్వే నేపథ్యంలో సోమవారం భారత మార్కెట్లు రికార్డు లాభాల్లోనే ముగిశాయి. 2018–19లో వృద్ధి రేటు 7–7.5 శాతానికి పెరుగొచ్చన్న అంచనాలు మదుపర్లలో విశ్వాసాన్ని నింపాయి. ఈ నేపథ్యంలోనే కొనుగోళ్ల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 232.81 పాయింట్లు లేదా 0.65 శాతం రాణించి 36,283.25కు చేరింది.

హెచ్‌డిఎఫ్‌సి లాభాలు రెట్టింపు

న్యూఢిల్లీ : ప్రముఖ తనఖా రుణదాత హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ నికర లాభాలు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.6,677.06 కోట్ల లాభాలు సాధించింది. 2016–17 ఇదే త్రైమాసికంలో రూ.2,728.66 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో ఈ సంస్థ మొత్తం ఆదాయం రూ.16,846.77 కోట్లకు చేరాయి. ఇంతక్రితం క్యూ3లో ఇది రూ.14,988.87 కోట్ల ఆదాయం నమోదయ్యింది. సోమవారం బిఎస్ఇలో హెచ్‌డిఎఫ్‌సి షేర్ 3.31 శాతం పెరిగి రూ.1,971.50 వద్ద ముగిసింది.

ప్రత్యేక హోదా కోరుతూ సిపిఎం భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో పార్టీ కార్యాలయం నుంచి ఓవర్ బ్రిడ్జి సెంటర్ వరకూ సోమవారం భారీప్రదర్శన నిర్వహించి, మానవహారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ అప్‌ల్యాండ్ జిల్లా కమిటీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి మంగరాజు మాట్లాడుతూ ప్రత్యేకహోదా ఇచ్చేది తామేనని బిజెపి, తీసుకువచ్చేది తామేనని టిడిపి 2014 ఎన్నికల సమయంలో చెప్పాయన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇరుపార్టీలు రాష్ట్రప్రజలను మాయమాటలతో మభ్యపెడుతున్నాయని విమర్శించారు.



గిరిజనుల ఇళ్ల తొలగింపు బాధితుల వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

గిరిజనుల ఇళ్ల తొలగింపునకు యత్నం

అడ్డుకున్న స్థానికులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరు రూరల్ పరిధిలోని మూడో డివిజన్ మంగల దిబ్బ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ అక్కడ నివాసమంటున్న గిరిజనులు, దళితుల ఇళ్లను తొలగించాలని డివిజన్ కార్పొరేటర్, టౌన్ ప్లానింగ్ అధికారులు హుకుం జారీ చేశారు. దాంతో ఆందోళనకు గురైన స్థానికులు ప్రత్యామ్నయం లేకుండా ఉన్నట్టుండి ఖాళీ చేయమంటే ఎలా వెళ్లాలని అధికారులను ప్రశ్నించారు. ఒక్కొక్కరికి రూ.4వేలు ఇస్తాం, ఖాళీ చేసి వెళ్లండి అని అధికారులు చెప్పడంతో స్థానికులకు దిక్కు తోచక సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె అజీజ్, శాఖ కార్యదర్శి సత్తాజ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వారు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని ప్రత్యామ్నాయం చూపకుండా ఎలా ఖాళీ చేయిస్తారని అధికారులను ప్రశ్నించారు. 30 ఏళ్లుగా అక్కడే నివాసముంటున్న నిరుపేదల ఇళ్ల తొలగింపును అడ్డుకున్నారు. దాంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సిఐ దుర్గా ప్రసాద్ అక్కడికి చేరుకుని సిపిఎం నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగర ఎంఎల్ఎ అనిల్‌కుమార్‌యాదవ్ అక్కడికి చేరుకుని స్థానికులకు తన మద్దతు తెలిపారు. ప్రత్యామ్నాయం చూపకుండా వారిని ఎట్టి పరిస్థితుల్లో ఖాళీ చేయించరాదని కమిషనర్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. ఆల్లీపురం వైపు ప్రత్యామ్నాయంగా రోడ్డు నిర్మాణం చేపట్టవచ్చన్నారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న సిపిఎం నాయకులను ఆయన పరామర్శించారు. అనంతరం నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే చలో అసెంబ్లీ

ఫ్యాప్టో నేతల హెచ్చరిక - రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూనే పిఆర్‌సి బకాయిలను ఇంతవరకు చెల్లించలేదని ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి విమర్శించారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు జరిగాయి.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నేత జి.సింహాద్రప్పడు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ, 11వ పిఆర్‌సి గడువు సమీపిస్తున్నా నేటివరకు కమిటీని నియమించకపోవడం సరికాదన్నారు. బకాయి ఉన్న మూడు డిఎలను తక్షణమే చెల్లించాలని, 2008 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పేస్కేల్‌లో వ్యత్యాసాన్ని తొలగించాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కృష్ణా జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన దర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సాబ్జి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించడానికి వెనుకాడేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాకు ఫ్యాప్టో చైర్మన్ కొమ్ము ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఫ్యాప్టో



మచిలీపట్నంలో ఉపాధ్యాయుల ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ఎస్.సాబ్జి

నాయకులు ఎస్.పి.మనోహరకుమార్, కె.ఎ.ఉమామహేశ్వరరావు, సిహెచ్.శరత్‌చంద్ర, పి.కృష్ణయ్య, ఎస్‌సి, ఎస్‌టి యుఎస్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.బి.రాజేంద్రప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఏలూరులో జరిగిన దర్నాలో.. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలో పాల్గొంటానని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి రాము సూర్యారావు అన్నారు.

శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ముందుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, రెడ్డి మోహనరావు మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, రాష్ట్ర పరిశీలకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, ఫ్యాప్టో ప్రతినిధులు కె.భానుమూర్తి, పి.ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఉపాధ్యాయులు ధర్నాకు హాజరయ్యారు. ఫ్యాప్టో నాయకులు ఎం.హనుమంతరావు, శౌరి రాయలు, వివి శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వర్లు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో రాష్ట్ర పరిశీలకునిగా వచ్చిన ఫ్యాప్టో రాష్ట్ర కోచైర్మన్ సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ, ఇంకా బి.గోపీమూర్తి ఆర్.ఎస్.హరనాధ్, సిహెచ్.శ్రీనివాస్ తదతరులు మాట్లాడారు.

తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి జెఎసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వర్లు పరిశీలకునిగా హాజరయ్యారు. యుటిఎఫ్, ఎస్‌టిఎఫ్, పిఆర్‌టియు తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు పాండురంగ వరప్రసాద్, సోమచంద్రారెడ్డి, నిర్మల, సోమశేఖర్‌నాయుడు, జివి రమణ, గంటామోహన్, సహదేవనాయుడు, రమేష్, చెంగల్రాయ మందడితో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ వద్దధర్నా నిర్వహించారు. అంతకుముందు ప్రదర్శన నిర్వహించారు. కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో ఎం.రఘునాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, శివారెడ్డి, లక్ష్మిరాజ, నారాయణరెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై 10న రాష్ట్రవ్యాప్త ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తామని ఎన్‌జిఒ అధ్యక్షులు, జెఎసి రాష్ట్ర చైర్మన్ పి.అశోక్‌బాబు తెలిపారు. సోమవారం గుంటూరు ఎన్‌జివో కల్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం 41వ వార్షికోత్సవానికి విచ్చేసి ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలకు జెఎసి ప్రాధాన్యం ఇస్తుందని, 10 నెలల పిఆర్‌సి బకాయిలు చెల్లించేందుకు, 70 ఏళ్లు నిండిన పెన్షనర్లకు అదనపు పెన్షన్ మంజూరుకు కృషి చేస్తోందని తెలిపారు. ఫిబ్రవరి 10న నిర్వహించే ధర్నాలో పెన్షనర్లంతా పాల్గొనాలని కోరారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం పెన్షనర్లకు 43 శాతం ఫిట్‌మెంట్‌తో 2015 పిఆర్‌సి అమలు చేసిందన్నారు. పెన్షనర్ల విషయంలో తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని, వారి సమస్యలను పరిష్కరిస్తుందని చెప్పారు.

2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి

కందుకూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-కందుకూరు (ప్రకాశం)

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంలో భూములు, ఉపాధి కోల్పోయిన వారందరికీ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో కందుకూరు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా కన్వీనర్ ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, కొండ, పశువుల చెరువు, వాగు పోరంబోకు భూములు సాగు చేసుకుని జీవిస్తున్న కుటుంబాలకు న్యాయం చేయడానికీ అవసరమైన చర్యలు చేపట్టడం లేదన్నారు. నీటి వసతి ఉన్న భూమి, పండ్ల తోటలు, పశుపోషణ, చెట్లు వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని భూముల వాస్తవ మార్కెట్ రేటును నిర్ణయించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవడానికీ రైల్వే లైన్‌లో భూములు, ఉపాధి కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం వాస్తవ మార్కెట్ రేటుకు నాలుగు రెట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జీఓ నెంబర్ 259 ప్రకారం అసైన్‌మెంట్ భూములకు సెటిల్ మెంట్ భూములతో సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కందుకూరు ఆర్‌డిఒ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, కె.మాల్యాద్రి పాల్గొన్నారు.

యండపల్లి జైలుశిక్షపై హైకోర్టు స్టే

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

పట్టభద్రుల ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి ప్రజా ఉద్యమంలో పాల్గొనడాన్ని ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయింది. ఉద్యమానికి అండగా నిలిచారని పోలీసులను ఉసిగొల్పి తప్పుడు కేసు బనాయించింది. నెల్లూరు జిల్లా గూడూరులో విద్యుత్ ప్రాజెక్టు తీసుకొస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతం విషపూరితం అవుతుందని మేధావులు, ప్రజలు కలిసి సభ నిర్వహించారు. ఆ సభకు కలెక్టర్‌తో పాటు యండపల్లిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొంత ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో ఇదే అదనుగా భావించి యండపల్లిపై అధికార తెలుగుదేశం పార్టీ కేసు నమోదు చేయించింది. ఈ మేరకు నెల్లూరు జిల్లా కోర్టు కేసు పూర్వాపరాలను విచారించి యండపల్లితో పాటు, మరో ఆరుగురికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ మూడు వారాల క్రితం తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో హైకోర్టుకు అప్పీలుకు వెళ్లగా 'స్టే' విధించడం గమనార్హం.

సిట్ నివేదిక సిపికి అందజేత

ప్రజాశక్తి- డాబాగార్డెన్స్, విశాఖ

ప్రభుత్వ భూములు, రెవెన్యూ భూదస్త్రాల అవకతవకలు తదితర వాటిపై ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తయారుచేసిన సమగ్ర నివేదికను సోమవారం నగరపోలీసు కమిషనరు టి.యోగానంద్‌కు అందజేసింది. దీనిని కమిషనర్ ప్రభుత్వానికి పంపించనున్నారు. గత ఏడాది జూన్ 28వ తేదీ నుంచి ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చూసిన ప్రత్యేక ఫిర్యాదుల విభాగానికి 2,875 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 333 ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. వివిధ ప్రజాసంఘాల నాయకుల నుంచి 11 ఫిర్యాదులు స్వయంగా స్వీకరించి విచారణ చేశారు. ఈ విచారణ గత ఏడాది డిసెంబరు 28వ తేదీతో ముగిసింది.

ఫీజురీయింబర్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.1600 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె రమేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఇన్‌గేట్ వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ముందుగా నెల్లూరు బస్టాండ్ నుండి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరి అక్కడ ధర్నా నిర్వహించారు. ఆ సంఘ నగర కార్యదర్శి కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్ ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసగిస్తోందని దుయ్యబట్టారు. ఈ-పాస్ విధానం ఎత్తివేసి జ్ఞానభూమి వెబ్‌సైట్ ప్రారంభించి విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చినా ఇప్పటికీ ఒక్కపైసా కూడా ఫీజురీయింబర్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయలేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్ మాట్లాడారు.

రైతన్నలు ఐక్యంగా పోరాడండి : వ్యకాస

ప్రజాశక్తి - దేవరాపల్లి

రాష్ట్ర వ్యాప్తంగా నూటికి 60 శాతం రైతులు ఉన్నా వారిలో ఐక్యత లేకపోవడం వల్లే నష్టాలబారిన పడుతున్నారని ఏపి వ్యవసాయ కార్మిక రాష్ట్ర కార్యదర్శి కర్రి అప్పారావు పేర్కొన్నారు. అన్నదాతలు ఐక్య పోరాటాలు చేసి, సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖజిల్లా దేవరాపల్లి మండల కేంద్రంలో స్థానిక కొల్లి దొంగబాబు కల్లం వద్ద సోమవారం సరుగుడు రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వల్ల ప్రభుత్వాలు, పారిశ్రామిక రంగాలు లాభాల బాట పడుతున్నా అన్నదాతలు మాత్రం ఎప్పుడూ నష్టాలనే చవిచూస్తున్నారని తెలిపారు. దళారీ వ్యవస్థకు ప్రభుత్వం అవకాశవాదిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పేపరు మిల్లుల యాజమాన్యాలు కావాలనే సరుగుడు రైతులకు నష్టం వచ్చేలా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. రైతాంగం ఐక్యంగా పోరాటం చేసి మద్దతు ధర సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. అఖిల భారత రైతు సంఘంలో రైతులంతా చేరి మన హక్కుల కోసం పోరాటం చేయాలని అప్పుడే మనం వాటిని సాధించుకోగలమని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రులు ప్రసంగాలు తప్ప ఆచరణలో కానరావటం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం పోరాటాలు

అభ్యుదయ చిత్రాల నటుడు ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాలని అభ్యుదయ చిత్రాల నటుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా మావుళ్లమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన ఆయన స్థానిక ఆనంద ఇన్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ సాధనకు ఆ ప్రాంత ప్రజలు, రాజకీయ పార్టీలు ఏకమై తీవ్రపోరాటం చేసి ప్రత్యేక తెలంగాణ సాధించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని విభజన సమయంలో నేతలు హామీ ఇచ్చారని, ఇప్పుడు ప్రత్యేక హోదా ఇస్తే మిగిలిన రాష్ట్రాలు అడుగుతాయని కుంటి సాకులు చెప్పడం మంచిది కాదని అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వలేదని, ఇక్కడ వైద్యం, విద్య, కళారంగాలతోపాటు అనేక రంగాల్లో మేధావులు ఉన్నప్పటికీ కేంద్రం గుర్తించలేదన్నారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు 11 అవార్డులు ఇచ్చారన్నారు. రైతు సమస్యలపై అన్నదాత సుఖీభవ సినిమా తీస్తున్నామని, ఇది తన 30వ సినిమా అని తెలిపారు.

కౌలురైతులకు రుణాలివ్వాలని ఆంధ్రాబ్యాంక్ ముట్టడి

ప్రజాశక్తి - గంపలగూడెం

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ ఎపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను ఆంధ్రాబ్యాంక్‌ను సోమవారం ముట్టడించారు. బ్యాంక్ గేటుకు తాళాలు వేసి సిబ్బందిని ఎవరినీ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. సుమారు రెండుగంటలకుపైగా బ్యాంక్ కార్యకలాపాలు స్థంభించిపోయాయి. ఎపి కౌలు రైతుసంఘం పశ్చిమకృష్ణా కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ నేతృత్వం వహించిన కార్యక్రమంలో పెనుగొలను, ఊటుకూరు గ్రామాలకు చెందిన కౌలు రైతులు పాల్గొన్నారు. సీడ్ మొక్కజొన్న పంట కొనుగోలు చేసిన ఆయాన్ సీడ్ కంపెనీ ఆర్గనైజర్లు ఇంకా డబ్బులు చెల్లించలేదని, వాటిని ఇప్పించాలని కోరుతూ విత్తన రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి విత్తన రైతు సంఘం నాయకులు మూఢగాని మధు మాట్లాడారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయపు ఎఒకు వినతిపత్రం అందజేశారు. పి.పంగిడేశ్వరరావు, నారాయణమ్మ, జలసూత్రం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మువ్వాపై మళ్లీవేటు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు బిఇడి కళాశాల ప్రిన్సిపల్‌పై మువ్వా రామలింగంపై మళ్లీ వేటుపడింది. కళాశాల ప్రాంగణంలోని చెట్లు నరికించడం, సిబ్బందిపట్ల అనుచితంగా వ్యవహరించడం, కలెక్టర్ ఉత్తర్వులను భేఖాతరు చేయడంతో ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. మహారాష్ట్ర
2. విజయ్ కేశవ్ గోఖలే
3. జనవరి 28
4. జూన్ ఓర్లాండో హెర్నెండెజ్
5. రోజర్ ఫెదరర్

సాగుభూమి ఇవ్వాలని గరగపర్రు దళితుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గరగపర్రులో సాంఘిక బహిష్కరణకు గురైన ప్రతి దళిత కుటుంబానికీ ఎకరం చొప్పున సాగుభూమి ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యాన గరగపర్రు దళితులు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కారుమంచి క్రాంతిబాబు మాట్లాడారు. నెలలు గడుస్తున్నా గరగపర్రు దళితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలనూ అమలు చేయకపోవడం దారుణమన్నారు. గరగపర్రులో దళితులు కోరినచోట అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, మిగిలిన 38 మందికీ లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, మృతి చెందిన యాకోబు కుటుంబానికి రూ.పది లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏలూరు విచ్చేసిన ఎస్‌సి జాతీయ కమిషన్ సభ్యులు కె.రాములుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు కార్మికుల సత్యాగ్రహం

సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళ వారం చేపట్టే సత్యాగ్రహ కార్యక్రమాన్ని, ఇతర కార్మిక సంఘాలతో కలిసి జయప్రదం చేయాలని సిఐటియు తమ జిల్లా కమిటీలకు సూచించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నరసింగరావు, ఎంఎ గఫూర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక కోర్కెలపై నవంబర్‌లో మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో మూడే లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు మహాధర్నాలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం కార్మిక సంఘాల కోర్కెలపై స్పందించలేదన్నారు. కార్మిక సంఘాలను పిలిచి చర్చించనూ లేదని వివరించారు. కార్మిక సంఘాలన్నీ సమావేశమై దేశవ్యాప్త సత్యాగ్రహ కార్యక్రమానికి పిలుపు నిచ్చాయని వెల్లడించారు. కార్మిక సంఘాల 12 కోర్కెలను పరిష్కరించని మోడీ ప్రభుత్వం కార్మికులను మరిన్ని సమస్యలను తెచ్చిపెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో నిర్ధారిత కాల ఉద్యోగాలను ప్రతిపాదిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, వారికి సమాన వేతనం ఇవ్వాలన్న కోర్కెలను పక్కన బెట్టిందన్నారు. శాశ్వతంగా తాత్కాలిక ఉద్యోగాలు మాత్రమే వచ్చేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కార్మిక చట్టాలలో మార్పు లను చేస్తూ ముందుకు పోతోందని తెలిపారు. సమ్మె, ఉమ్మడి బేరసారాలు, నిరసనలు, జీవనం, సామాజిక భద్రత తదితర హక్కులన్నింటిని ఎత్తివేస్తూ చట్టాలు తయారు చేసిందని వివరించారు. యజమానుల లాభాలు మరింతగా పెరిగేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్మికులను బానిస త్వంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ వేతనంతో ఎక్కువ పనిచేసే విధంగా ఒత్తిళ్లు పెంచుతున్నాయని, బ్రిటిషు కాలం నాటి అణచివేతలు గుర్తుకు వస్తున్నాయని తెలిపారు. సంపద కొద్ది మంది చేతుల్లో మరింతగా కేంద్రీకరింపజేసేందుకే ఈ విధానాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను సమీకరించి సత్యాగ్రహం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కమిటీలకు విజ్ఞప్తి చేశారు.

గొట్టిపాడు నిందితుల్ని అరెస్ట్ చేయాలి

మీ-కోసంలో కలెక్టర్ కోన శశిధర్‌కు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు దళిత బాధితులకు న్యాయం చేయాలని పోరాట సంఘీభావ కమిటీ దశల వారీ ఆందోళనల్లో భాగంగా సోమవారం మీ-కోసంలో బాధిత కుటుంబాలతో కలిసి జిల్లా కలెక్టర్ కోనశశిధర్‌కు వినతిపత్రం అందచేశారు. ప్రధాన నిందితుల్ని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదని చెప్పారు. పైగా దళితులపై తప్పుడు కేసులు నమోదు చేయటం బాధితులకు అన్యాయం చేయటమే అవుతుందన్నారు. ఇప్పటికీ సాంఘిక బహిష్కరణ, నిర్బంధం కొనసాగుతోందని, ఆధార్ కార్డు చూపితే గానీ గ్రామంలోకి రాకపోకలకు అనుమతించడం లేదని వివరించారు. దాడి ఘటనలపై ప్రధాన నిందితుల్ని అరెస్ట్ చేసి, 307, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ సాంఘిక బహిష్కరణను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వమని, నిందితులకు శిక్ష పడేలా, దళితులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


చేయూత

గ్రామీణాభివృద్ధికి సహకారం

- ప్రపంచబ్యాంకు మిషన్ బృందం
- శ్రీకాకుళం జిల్లాలో పర్యటన

ప్రజాశక్తి - సీతంపేట, హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)

ప్రపంచబ్యాంకు నిధుల ద్వారా మంజూరవుతున్న పథకాలతో గ్రామీణాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రపంచబ్యాంకు మిషన్ బృందం పేర్కొంది. సోమవారం శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట, హిరమండలం మండలాల్లో కీర్తిమిశ్రా, రాజ్‌గంగోళి, రాఘవేంద్రసింగ్, అబ్దుల్‌పురస్తి, కుమ్మిదిని, శృతిశర్మల బృందం పర్యటించింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల పనితీరు, మానవ వనరుల అభివృద్ధి పథకాల వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా సీతంపేట ఐటిడిఎలో వీరు రెండు బృందాలుగా విడిపోయారు. చిన్నబగ్గలోని మదర్ పౌల్ట్రిని ఒకరు, మోడల్ న్యూట్రిషన్ గార్డెన్‌ను మరో బృందం సభ్యులు పరిశీలించారు. లాభ, నష్టాలను అడిగి తెలుసుకుంది. అనంతరం వెంకటగూడలో గిరిజనులతో మాట్లాడారు. సీతంపేటలో పలు పంటల గురించి గిరిజనులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెలుగు ఎంఎంఎస్ వెలుగు సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, మహిళా అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రపంచ బ్యాంకు నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని వారు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పథకాల వల్ల గిరిజనులకు కలుగుతున్న ప్రయోజనాలు, వారి జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వెలుగు కిరణాషాపులను పరిశీలించారు. అనంతరం హిరమండలంలో గిరి సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఐటిడిఎలో మొదటి విడతగా 26, రెండో విడతగా 54 కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఐటిడిఎ ఎపిడి డైజి తెలిపారు.



ప్రపంచ బ్యాంక్ మిషన్ బృందానికి గిరి సేవా కేంద్రం వివరాలను తెలియజేస్తున్న డిపిఎం రామ్మోహనరావు

సంక్షిప్తం

4న పక్షుల పండుగ : కలెక్టర్

ప్రజాశక్తి-కైకలూరు

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు అభయారణ్యంలోని ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకుల ఆనందోత్సహాల మధ్య ఫిబ్రవరి 4వ తేదీన పక్షుల పండుగ (ఫెలికాన్ ఫెస్టివల్)ను అత్యంత శోభాయమానంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టరు బి.లక్ష్మీకాంతం అన్నారు. సోమవారం కృష్ణాజిల్లా కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజీరియా, రష్యా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి దేశాల నుండి సుమారు 3,500 కిలో మీటర్లు ప్రయాణం చేసి పెలికాన్ పక్షులు కొల్లేరు సరస్సుకు చేరుకుంటాయని అన్నారు. అక్టోబరు మాసంలో వచ్చి తిరిగి పిల్లలతో ఏప్రిల్ మాసంలో వెళ్తాయన్నారు. భవిష్యత్తులో ఆటపాకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నామని, అందుకు ఇప్పటి నుండే కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామని అన్నారు.

'ఇన్స్యూరెన్స్' కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం)

ఫసల్ బీమా చెల్లించని ఇన్స్యూరెన్స్ కంపెనీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఎ.పి.రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో ధర్నా నిర్వహించారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. మార్కాపురం ప్రాంతంలో వరుసగా కరువుతో రైతాంగం అల్లాడిపోతోందనీ, బీమా కంపెనీలు రైతులకు పరిహారం చెల్లించకపోవడం దారుణమని అన్నారు.

రాష్ట్రంలో 9 లక్షల గృహాలకు డిమాండ్

పురపాలక శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల 81 వేల ఇళ్లు మంజూరు కాగా, మొత్తం 9 లక్షల ఇళ్లకు డిమాండ్ ఉందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం జివిఎంసిలో అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ప్లాన్‌ల ద్వారా మంచి స్పందన లభిస్తుందని, 90 శాతం సత్ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఇదే ముసుగులో అక్రమ నిర్మాణం చేపడితే కూల్చివేస్తామని, ఇందుకోసం ప్రత్యేక స్క్వాడ్ టీమ్‌ను నియమించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల 800 ఆన్‌లైన్ భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయగా, ఇందులో 250 అనుమతులకు ఫిర్యాదులు అందాయని అన్నారు. అనుమతులు తీసుకున్న భవన నిర్మాణదారులంతా సక్రమంగా భవనాలు నిర్మించుకోవాలని అన్నారు. విశాఖలో 58 వేల ఇళ్లు మంజూరు చేశామని, ఇంకా లక్ష ఇళ్లకు డిమాండ్ ఉందని అన్నారు. సీఎస్సార్ ఫండ్ కింద 70 వేల స్కూళ్లకు ఫర్నిచర్, కంప్యూటర్లు ఏర్పాటు చేసేందుకు మార్చి 31 నాటికి వివిధ సంస్థల ద్వారా వచ్చిన నిధుల ద్వారా సమకూర్చుస్తామని అన్నారు.

ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మహిళకు బెదిరింపులు

మలప్పురమ్ : శుక్రవారం ప్రార్థనలు నిర్వహించిన ఒక ముస్లిం మహిళలను బెదిరింపులు వస్తున్న ఘటన కేరళలో చోటుచేసుకుంది. ఖురాన్ సునాత్ సొసైటీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్న జమితా (34) గత శుక్రవారం మలప్పురమ్ జిల్లాలోని వండూర్ గ్రామంలో ప్రార్థనలకు నిర్వహించింది.. సాధారణంగా జుమాహ్ ప్రార్థనలకు పురుషులు మాత్రమే నాయకత్వం వహిస్తారు. దీనికి విరుద్ధంగా మహిళ నాయకత్వం వహించిదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు బెదిరింపులకు దిగారు. తనను చంపుతామని, జీవించడానికి అర్హురాలిని కాదంటూ పలువురు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, అయినా తాను భయపడనని ఆమె పేర్కొన్నారు. లింగ వివక్షతకు వ్యతిరేకంగా తాను ప్రార్థనలకు నాయకత్వం వహించానని చెప్పారు. అటువంటి బెదిరింపులకు తాను భయపడనని, దీనిపై పోలీసులకు ఇంకా ఫిర్యాదు చేయలేదని జమితా పేర్కొన్నారు.

ఉత్తమ బహుమతి

రిపబ్లిక్ డే ఉత్సవాల సందర్భంగా ఈ నెల 26న ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో ఉత్తమ బహుమతిని పొందిన మహారాష్ట్ర శకటం



కాశ్మీర్‌లో సైనిక చర్యపై ముఫ్తి, బిజెపి మధ్య దుమారం

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో శనివారం ఇద్దరు పౌరుల హత్య ఘటనలో ఆర్మీ మేజర్, ఆయన యూనిట్‌పై పెట్టిన హత్య కేసు పాలక పిడిపి, దాని మిత్రపక్షం బిజెపి మధ్య రాజకీయ వివాదంగా రూపుదాల్చింది. సైన్యంపై రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసిన కొద్ది గంటల వ్యవధిలోనే అసెంబ్లీలో నిరసనలు తలెత్తాయి. బిజెపి ఎంఎల్‌ఎల నుండి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి స్పందిస్తూ, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సంప్రదించిన అనంతరమే సైన్యంపై చర్య తీసుకుంటామని చెప్పారు. సైన్యం నిర్లక్ష్యం వున్నా లేదా ఏదైనా తప్పు జరిగినా తాను చర్య తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చిన తర్వాతనే తాము ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశామని ముఫ్తి చెప్పారు. న్యాయమూర్తి విచారణకు ఆదేశించామన్నారు. దోషులపై చర్య తీసుకున్నంత మాత్రాన సైన్యం నైతికత దెబ్బ తినదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో మేజర్ పేరును తొలగించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. పేర్లు లేకుండా కొత్త ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయాలని కోరుతోంది. తమ కాన్వాయ్‌పై అల్లరి మూకలు రాళ్లు రువ్వుతుండడంతో ఆత్మ రక్షణ కోసం కాల్పులు జరిపామని సైన్యం చెబుతోంది.

సిపెక్ ప్రాజెక్టుపై భారత్‌తో చర్చలకు సిద్ధం: చైనా



బీజింగ్: పాక్ ఆక్రమిత కాశ్మీర్ గుండా నిర్మితమవుతున్న చైనా పాకిస్తాన్ ఆర్థిక నడవా (సిపెక్) ప్రాజెక్టుపై భారత్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిష్కరించేందుకు చర్చలకు సిద్ధంగా వున్నామని చైనా ప్రకటించింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ గుండా వెళ్తున్న ఈ ప్రాజెక్టు భారత్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగశాఖ ప్రతినిధి హువా చున్‌ఇంగ్ సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ భారత్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై పరిష్కార సాధనకు తాము ఆ దేశంతోకలిసి పనిచేసేందుకు సిద్ధంగా వున్నామన్నారు. ఉభయ దేశాల ప్రయోజనాలకు ఇది మేలు చేస్తుందని ఆమె వ్యాఖ్యానించారు. సిపెక్ ప్రాజెక్టు విషయంలో చైనా తన వైఖరిని ఇప్పటికే పలుమార్లు పునరుద్ఘాటించిందని, దీనిపై భారత్‌తో వున్న విభేదాలను పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా వున్నామని, ఈ విభేదాలు ఇరుదేశాల సాధారణ సంబంధాలకు, ప్రయోజనాలకు అడ్డు కాకూడదన్నదే తమ భావన అని ఆమె వివరించారు.

ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్లకూ 'క్రీమీలేయర్' పిటిషన్‌ను విచారించనున్న సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : రిజర్వేషన్ల నుంచి ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లకూ క్రీమీలేయర్‌ను వర్తింప చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ జరపనున్నది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరపనున్నది. ఎస్సీ, ఎస్టీలలో ధనవంతులైన వారే, ఉన్నత స్థానాల్లో వున్న వారే ప్రయోజనాలు పొందుతున్నారని, రిజర్వేషన్లు అవసరమైన వారికి అవి అందడం లేదని, పేదలు ఇంకా పేదలుగానే కొనసాగుతున్నారని సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ పేర్కొంది. ఎస్సీ, ఎస్టీలలో వాస్తవంగా వెనుకబడిన వారిని, పేదలను వడపోసి ప్రయోజనాలు అందించడంలో రిజర్వేషన్లు విఫలమయ్యాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల సామాజిక అశాంతి, నక్సలైట్ ఉద్యమం, శాశ్వత పేదరికం పెరిగిపోయాయని పిటిషనర్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకుక్రిమి లేయర్‌ను వర్తింప చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలవ్వడం ఇదే తొలిసారి. అడ్వకేట్ షోభిత్ తివారి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా 2006లో ఎం. నాగరాజు కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. క్రిమిలేయర్‌ను వర్తింపచేసే విషయంలో ఈ తీర్పును పరిశీలించాలని కోర్టును కోరారు.

విడాకులు తీసుకుంటున్న జంటకు సుప్రీం 'ఆంక్షలు'

ఫొటోలు ఏ రూపంలోనూ ప్రదర్శించవద్దని ఆదేశం

న్యూఢిల్లీ: విడాకులు కోరుతూ ఆశ్రయించిన ఒక జంట వివాహాన్ని రద్దు చేసిన సుప్రీంకోర్టు ఆ జంట తమ ఫొటోలను ఇంటర్నెట్ లేదా సోషల్ మీడియాలో ఎక్కడా, ఏ రూపంలోనూ ప్రదర్శించరాదని ఆదేశించింది. మహారాష్ట్రకు చెందిన ఈ జంటకు విడాకులు మంజూరు చేసిన ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రానేతృత్వంలోని ధర్మాసనం విడిపోతున్న భార్యకు శాశ్వత భరణం రూపంలో రు.37 లక్షలను రెండు నెలల్లోగా చెల్లించాలని ఆదేశించింది. తమ మధ్య చెలరేగుతున్న వివాదానికి తెరదించుతామని, తమ వివాహాన్ని రద్దు చేయాలని ఆ జంట చేసిన విజ్ఞప్తి మేరకు న్యాయమూర్తులు ఎఎం ఖన్విల్కర్, డివైచంద్రచూడ్ సభ్యులుగా వున్న ఈ ధర్మాసనం వారికి విడాకులను మంజూరు చేసింది. భర్త కానీ, భార్య కానీ తమ ఫొటోలనూ ఏ రూపంలోనూ సోషల్ మీడియా లేదా ఆన్‌లైన్‌లో ఎక్కడా ప్రదర్శించటానికి వీలు లేదని ధర్మాసనం తన ఆదేశాలలో స్పష్టం చేసింది. తదుపరి జీవితాన్ని నిర్విచారంగా గడిపేందుకు వీలుగా ఆమెకు తగిన మొత్తం (రు.37 లక్షలు) భరణం చెల్లించాలని భర్తను కోర్టు ఆదేశించిందని ఆ మహిళ తరపు న్యాయవాది దుష్యంత్ పరాశర్ చెప్పారు. ఈ కేసులో నమోదయిన రెండు ఎఫ్‌ఐఆర్‌లను, దానికి సంబంధించిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఉభయుల కోరిక మేరకు విడాకుల పిటిషన్‌ను సత్వరమే పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో ఈ జంట ఒకరిపై మరొకరు ఎటువంటి క్లయిమ్‌లు దాఖలు చేసుకునేందుకు వీలు లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

కోర్టును సంతృప్తి పరచగలరా?

సునంద మృతి కేసులో సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌పై సుప్రీం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ భార్య సునంద పుష్కర్ మృతి కేసులో విచారణ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారణ యోగ్యమైనదేనని సంతృప్తి పరచగలరా? అంటూ బిజెపి నేత సుబ్రహ్మణ్య స్వామిని సోమవారం సుప్రీం కోర్టు ప్రశ్నించింది. సునంద పుష్కర్ 2014 జనవరి 17న ఢిల్లీలోని ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో అంతుబట్టని పరిస్థితుల్లో మృతి చెందిన సంగతి తెలిసిందే. సునంద పుష్కర్ మృతి కేసు విషయమై కోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందంతో (సిట్) దర్యాప్తు చేయించాలని కోరుతూ సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను గత ఏడాది అక్టోబరులో ఢిల్లీ హై కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో ఇదే విషయమై ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్‌పై సుప్రీం కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఆయనను ప్రశ్నిస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్ విచారణ యోగ్యమైనదేనని కోర్టును సంతృప్తి పరచగలరా? అంటూ ప్రశ్నించింది.

జమిలి ఎన్నికలపై ఎన్‌డిఎ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జమిలి ఎన్నికలపై బిజెపి దృష్టి పెట్టింది. గతంలోనూ మోడీ ప్రకటన చేసినప్పటికీ, సోమవారం దీనిపై కసరత్తు ప్రారంభించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఆనవాయితీగా నిర్వహించే సమావేశంలో ప్రధాని మోడీ జమిలి ప్రస్తావన తెచ్చారు. దీని ద్వారా అన్ని రాష్ట్రాల్లోనూ ఒకేసారి పార్లమెంటు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వేర్వేరుసార్లు ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఆర్థిక భారమవుతుందని, దీన్ని తగ్గించుకునేందుకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ఉందని ప్రధాని తెలిపారు. దీనిపై టిడిపి నేతలు చంద్రబాబుతో మాట్లాడిన తరువాత తమ అభిప్రాయం చెబుతామంటున్నారు. చంద్రబాబు కూడా తొలి నుండి ఒకేసారి ఎన్నికలు జరపాలనే అభిప్రాయంతో ఉన్నారు. పార్టీ సమావేశాల్లో పలుసార్లు ఇదే విషయం తెలిపారు. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన సమావేశం దీనికి అనకూలంగా ఉండటంతో తెలుగుదేశం నేతలు కూడా ఆనందంతో ఉన్నారు. సోమవారం నాటి సమావేశానికి టిడిపి పక్ష నేత తోట నరసింహం, టిడిపిపి నాయకుడు సుజనాచౌదరి ఇద్దరూ హాజరయ్యారు. ఇదే సమయంలో మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సమస్యలపైనా మోడీ వివరాలు అడిగారని తెలిసింది. ఆంధ్రప్రదేశ్ నుండి విభజన సమస్యలను మోడీ దృష్టికి తీసుకెళ్లామని సమావేశానంతరం తెలుగుదేశం ప్రతినిధులు మీడియాకు తెలిపారు.

ఇండియన్ మెడికల్ కౌన్సిల్ కేసులో

అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ప్రతికూల వ్యాఖ్యలు





జస్టిస్ నారాయణ శుక్లా

న్యూఢిల్లీ : మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) కేసులో అలహాబాద్ హై కోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ నారాయణ శుక్లాపై పలు ప్రతికూల వ్యాఖ్యలతో అంతర్గత విచారణ కమిటీ నివేదికనిచ్చింది. ప్రైవేటు వైద్య కళాశాలల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించడంపై మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) నిషేధం విధించినప్పటికీ అనుమతిచ్చారన్న ఆరోపణలతో పాటు, ఈ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన పలు తీర్పులలో కూడా ఆయన ప్రమేయముందన్న విమర్శలు వచ్చాయి. వీటిపై అంతర్గత విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ సోమవారం తన నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో జస్టిస్ శుక్లాపై పలు వ్యతిరేక వ్యాఖ్యలు ఉన్నట్లు ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక వెల్లడించింది. గత సెప్టెంబరులో సిబిఐ జరిపిన ప్రాథమిక దర్యాప్తు కూడా జస్టిస్ శుక్లా ప్రమేయాన్ని ప్రస్తావించింది. జస్టిస్ శుక్లాపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయూర్తి అనుమతిని సిబిఐ కోరింది. ఉత్తర ప్రదేశ్‌లోని వైద్య కళాశాలలో 2017-2018 సంవత్సరానికి విద్యార్థులకు ప్రవేశాల్ని కల్పించేందుకు తన నేతృత్వంలోని ధర్మాసనం సెప్టెంబరు 1న ఇచ్చిన తీర్పును సెప్టెంబరు 4న తన చేతి రాతతో స్వయంగా సరిచేశారు. దీంతో ఆయనపై సందేహం కలిగి విచారణ జరిగింది. లక్నోలోని జిసిఆర్‌జి ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను విద్యార్థులకు ప్రవేశాలకు అనుమతినిచ్చిన హై కోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు నిషేధం విధించిన ఎనిమిది రోజుల తరువాత ఈ సంఘటన చోటు చేసుకుంది.



బెంగాల్లో బస్సు ప్రమాదం 36 మంది మృతి

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో సోమవారం జరిగిన బస్సు ప్రమాదంలో 36 మంది మృతి చెందారు. డోమ్కక్ నుంచి ముర్షిదాబాద్ వెళ్తున్న బస్సు సోమావారం ఉదయం బాలిఘాట్ వద్ద బ్రిడ్జి దాటుతుండగా అదుపుతప్పి నదిలో పడింది. ఆ సమయంలో బస్సులో 56 మంది ప్రయాణికులున్నారని భావిస్తున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం వుంది. సాయంత్రానికి 36 మృతదేహాలను వెలికితీసినట్లు బెర్హాంపూర్ జిల్లా మేజిస్ట్రేట్ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు రావడానికి ముందే కొంతమంది స్థానికులు చిన్న పడవలలో వెళ్లి, కొందరిని కాపాడినట్లు ప్రత్యక్షసాక్షులు పేర్కొన్నారు. సహాయక చర్యలు ఆలస్యమవడంతో ఆగ్రహించిన స్థానికులు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. వారిపై రాళ్లు రువ్వడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అలాగే టియర్ గ్యాస్ ను వుపయోగించి, ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. మరో బస్సును అధిగమించే ప్రయత్నంలో బస్సు అదుపుతప్పి నదిలో పడినట్లు కొంతమంది ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. పైగా ఆ సమయంలో డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రూ. ఐదు లక్షలు పరిహారాన్ని ప్రకటించారు.

సిబిఐతో గౌరీ లంకేష్ కేసు దర్యాప్తు

కర్ణాటక హై కోర్టును కోరనున్న సోదరుడు ఇంద్రజిత్



బెంగళూరు : జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్య కేసును సిబిఐతో దర్యాప్తు చేయించాలని కోరుతూ కర్ణాటక హై కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆమె సోదరుడు ఇంద్రజిత్ లంకేష్ సోమవారం తెలిపారు. గౌరీ లంకేష్‌ను బెంగళూరులో సెప్టెంబరు 5, 2017న ఆమె నివాసం వెలుపల కొందరు గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఇంద్రజిత్ లంకేష్ సోమవారం ఆమె సమాధి వద్ద కాండిల్ వెలిగించిన తరువాత మీడియాతో మాట్లాడుతూ తన సోదరి హత్యకు గురై ఇప్పటికి ఐదు నెలలు గడిచిపోయిందన్నారు. గౌరీ లంకేష్ హత్య దర్యాప్తుకు తాను పూర్తిగా సహకరించానని చెప్పారు. కాని ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిపై ఒక వైపు నుంచే దర్యాప్తు చేస్తున్నదని తాను భావిస్తున్నట్లు చెప్పారు. తాను తన న్యాయవాదులతో మాట్లాడి హై కోర్టును ఆశ్రయిస్తానన్నారు. కేవలం సిసిటివి ఫుటేజ్‌పై ఆధారపడి నిందితుల స్కెచ్‌లను సిట్ విడుదలచేయడం తనకు ఆశ్చర్యంగా ఉందన్నారు. నిందితులు హెల్మెట్ ధరించినట్లు సిసిటివిలో కనిపించిందని, అటువంటప్పుడు వారి స్కెచ్‌లను వివరంగా ఎలా విడుదల చేయగలిగారని ప్రశ్నించారు. సిట్ ఆ స్కెచ్‌లను విడుదల చేసిన రోజే దర్యాప్తుపై తాను విశ్వాసం కోల్పోయానని చెప్పారు.

రాజ్యసభలో ఆప్ ఆరంగేట్రం

ముగ్గురు సభ్యులు ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పార్టీ రాజ్యసభలోనూ ప్రవేశించింది. ఆప్‌కు చెందిన ముగ్గురు సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి హర్దీప్ సింగ్ పూరి కూడా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవలే ఆయన ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఢిల్లీ నుంచి ఎన్నికైన ఆప్ సభ్యులు నరైన్ దాస్ గుప్తా, సుశీల్ కుమార్ గుప్తా, సంజయ్ సింగ్ ప్రమాణస్వీకారం చేసి రిజిస్టర్‌లో సంతకం చేసి తమకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. ప్రతిపక్షం బెంచీల్లో చివరి వరుసలో ఆప్ సభ్యులకు సీట్లు కేటాయించారు.

రాష్ట్రపతి ప్రసంగం బహిష్కరణ

సోమవారం పార్లమెంట్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగాన్ని ఆప్ సభ్యులు బహిష్కరించారు. తమ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలను అనర్హత వేటు వేసినందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్ ప్రాంగణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తమ నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఆప్ లోక్‌సభ సభ్యులు సాధు సింగ్, భగవత్ మాన్, ఆప్ సభ్యులు నరైన్ దాస్ గుప్తా, సుశీల్ కుమార్ గుప్తా, సంజయ్ సింగ్ పాల్గొన్నారు. 'ప్రజాస్వామ్యంలో నియంతృత్వాన్ని అనుమతించవద్దు' అంటూ నినాదాలు చేశారు.

ఆప్ ఎమ్మెల్యేల కేసు

ఆప్ ఎమ్మెల్యేల అనర్హత వేటు కేసును ఢిల్లీ హైకోర్టు సోమవారం డివిజన్ బెంచ్‌కు బదిలీ చేసింది. జడ్జీ విభు బఖ్రు డివిజన్ బెంచ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసును మంగళవారం డివిజన్ బెంచ్ విచారిస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయం

నాగాలాండ్ పార్టీలు

న్యూఢిల్లీ : శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకొనే వరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోమంటూ నాగాలాండ్‌లోని అన్ని రాజకీయ పార్టీలు ఉమ్మడిగా ప్రకటించాయి. రాజధాని కొహిమాలో జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాయి. నాగా గిరిజన పౌర సంఘాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఎన్నికలకు ముందే శాంతి ప్రక్రియను పునరుద్ధరించాలన్న డిమాండ్‌కు మద్దతిస్తూ ఎన్‌ఎస్‌సిఎన్(ఐఎం)తో సహా పలు తిరుగుబాటు గ్రూపులు కూడా ఆదివారం ఇదే విధమైన ప్రకటనచేశాయి. అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని నాగా గిరిజనులకు చెందిన అత్యున్నత సంఘం నాగా హోహో కూడా హెచ్చరించింది.

117 మందిపై ఎఐడిఎంకె వేటు

చెన్నయ్ : తమిళనాడులో అధికారంలో ఉన్న ఎఐడిఎంకె 117 మంది కార్యకర్తలపై వేటు వేసింది. పార్టీకి అప్రదిష్టపాలు చేస్తున్నారన్న కారణంతో వేటు వేసినట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పన్నీర్‌సెల్వం, పళనిస్వామి వర్గానికి చెందిన వారే పార్టీ నుండి తొలగించబడిన వారిలో ఎక్కువమంది ఉన్నారు. శివగంగ జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులతోపాటు, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కెె. ఉమాదేవన్, చోలన్ సిటి పలనిస్వామిలను పార్టీ నుండి బహిష్కరించారు. వారంతా పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. బహిష్కరించిన కార్యకర్తలకు తమ పార్టీలో ఎటువంటి సంబంధాలూ ఉండవని తెలిపారు. ఆర్‌కె నగర్ ఉప ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత సిఎం పళనిస్వామి, పన్నీరుసెల్వం పార్టీ నాయకులపై చర్యలు తీసుకుంటున్నారు.

ధనిక ఎంపీలు వేతనం వదులుకోవాలి

స్పీకర్‌కు వరుణ్‌గాంధీ లేఖ

న్యూఢిల్లీ : దేశంలో తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక అంతరాలను తగ్గించడానికి ధనిక ఎంపీలు తమ వేతనాలను వదులుకోవాలని బిజెపి ఎంపి వరుణ్‌గాంధీ పిలుపు ఇచ్చారు. ఇలాంటి ఉద్యమాలను ప్రారంభించాలని, ఇలాంటి వాటితో ప్రజాప్రతినిధులపై ప్రజలకు మరింత విశ్వాసం కలుగుతుందని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు రాసిన లేఖలో వరుణ్‌గాంధీ సూచించారు. ఇలాంటి స్వచంద కార్యక్రమాలతో ప్రజాప్రతినిధుల గురించి సానుకూల సందేశం ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. ఇందుకోసం స్వతంత్ర, చట్టబద్ధమైన సంస్థను సృష్టించాలని కూడా వరుణ్ గాంధీ సూచించారు. దేశంలో పెరుగుతున్న అసమానతలు గురించి ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రత్యేకం

త్రిపుర ప్రజల మధ్య చిచ్చుకు బిజెపి కుట్రలు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, అగర్తలా:

ప్రజాస్వామ్య ప్రియులు, రాజకీయంగా చైతన్యవంతులయిన త్రిపుర ప్రజల మనస్సులను, విశ్వాసాన్ని గెల్చుకోవటంలో విఫలమైన బిజెపి కూటమి ఇప్పుడు వారిలో భయాందోళనలు రేకెత్తించి భీతావహులను చేసేందుకు కుట్రలు పన్నుతోంది. రానున్న ఎన్నికల సమయంలో మాత్రమే కాక గత ఆర్నెల్ల నుండి బిజెపి కూటమి తన కుట్రలకు పదును పెడుతోంది. కొంతమంది సంఘ వ్యతిరేకశక్తులను రంగంలోకి దింపి సిపిఎం వ్యతిరేక దాడులు, లూటీలు, అల్లర్లతో ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. దీనితో పాటు ప్రత్యర్థులపై అనేక పుకార్లు, అసభ్య చిత్రాలు, అశ్లీల వ్యాఖ్యలతో బిజెపి తన సోషల్ మీడియా విభాగం సారధ్యంలో త్రిపురలో వామపక్ష నేతలను అప్రదిష్టపాలు చేసేందుకు కుట్రలు పన్నుతూ, తద్వారా రాష్ట్రంలోని శాంతియుత ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది. కానీ ప్రజాస్వామ్య ప్రియులైన రాష్ట్ర ప్రజలు బిజెపి కుట్రలకు ఏ మాత్రం తలొగ్గకుండా వామపక్ష కూటమికి రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు పలుకుతున్నారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రచార సభలకు వెల్లువెత్తుతున్న జన సందోహమే ఇందుకు నిదర్శనం. అయితే బిజెపి కూటమి మాత్రం తన ప్రయత్నాలను ఏ మాత్రం మానుకోవటం లేదు. బయటి వ్యక్తులతో భారీ సంఖ్యలో మోటారు వాహనాలతో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తోంది. మోటారు వాహన చట్టం, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఈ వాహనాలు రాష్ట్ర వ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నప్పటికీ ప్రజల మనస్సులపై ఏ మాత్రం ప్రభావం చూపబోదని పరిశీలకులు చెబుతున్నారు. బయటి ప్రాంతాల నుండి బిజెపి రప్పించిన యువకులు వారి మద్దతుదారుల ఇళ్లలో ఆశ్రయం పొందుతున్నారు. గతంలో ఎప్పుడూ ప్రశాంతమైన పండుగ వాతావరణంలో జరిగే ఎన్నికల ప్రక్రియ వీరి రాకతో పెనుముప్పును ఎదుర్కొంటోంది. త్రిపురలో ఓటు హక్కులేని వారిని, బయటి ప్రాంతాల వ్యక్తులను వెంటనే వెనక్కి పంపివేయాలని సిపిఎం ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేస్తోంది.



జోరందుకున్న లెఫ్ట్ అభ్యర్థుల ప్రచారం

ఇదిలా వుండగా మొత్తం 60 స్థానాలకు లెఫ్ట్ ఫ్రంట్ తన అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించటంతో వారి ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రత్యర్థి కూటమి అభ్యర్థుల వేటలో తలమునకలై వున్న ప్రస్తుత సమయంలో లెఫ్ట్ కూటమి అభ్యర్థులందరూ తొలివిడత ప్రచారాన్ని ముగించి మలివిడత ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఎన్‌ఎల్‌ఎఫ్‌టి తీవ్రవాదులు బలపరుస్తున్న ఐపిఎఫ్‌టి(ఎన్‌సి) కూటమికి తొమ్మిది స్థానాలు కేటాయించి బిజెపి తన ఎన్నికల పొత్తును ఎట్టకేలకు ఖరారు చేసుకుంది. అయితే తన 'ప్రత్యేక త్రిపుర' నినాదాన్ని వదులుకున్నట్లు ఐపిఎఫ్‌టి ఇప్పటి వరకూ ఎక్కడా ప్రకటించనప్పటికీ బిజెపి మాత్రం వారు రాష్ట్ర సమగ్రతకు ఏ మాత్రం భంగం వాటిల్లచేయరంటూ నమ్మపలుకుతోంది. ఈ అపవిత్ర కూటమిలో కొనసాగుతున్న సీట్ల బేరాలు ప్రజల మనస్సుల్లో కూటమి పట్ల తీవ్ర వ్యతిరేకతను పెంచుతుండగా మరోవైపు ఎన్నికల వేళ ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు లెఫ్ట్ ఫ్రంట్ ప్రయత్నిస్తోంది. తమ కూటమిలో కొనసాగుతున్న సీట్ల పోరును పరిష్కరించుకోకుండానే బిజెపి ఈ నెల 27న 44 స్థానాలకు 28న మరో ఏడు స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించింది. అభ్యర్థుల ప్రకటన వెలువడిన వెంటనే రాష్ట్ర బిజెపిలో అసమ్మతి సెగలు తారస్థాయికి చేరుకున్నాయి. వాస్తవానికి సీట్ల కేటాయింపు విషయంలో బిజెపి-ఐపిఎఫ్‌టి(ఎన్‌సి) మధ్య విభేదాలు ఇప్పటికే గుప్పుమన్నాయి. గత రెండేళ్ల నుండి పార్టీ శ్రేణులన్నీ బిజెపిలోకి వలసపోవటంతో నీరసపడిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తన ఇంటిని సరిదిద్దుకునే పనిలోపడింది.

ప్రస్తుత అసెంబ్లీలో పదిమంది సభ్యుల బలం రెండు పడిపోయిన నేపథ్యంలో ఆ పార్టీ ఆదివారంనాడు 56 మంది అభ్యర్థులను ప్రకటించింది. మరో నాలుగు స్థానాలను తృణమూల్ కాంగ్రెస్‌కు కేటాయించింది.

అగ్రనేతల పర్యటన

లెఫ్ట్ ఫ్రంట్ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రచారర్యాలీలలో సిపిఎం అగ్రనేతలు మాణిక్ సర్కార్, బృందాకరత్, సూర్యకాంత మిశ్రా, సుభాషిణీ ఆలీ, బిజన్‌ధర్, గౌతమ్‌దాస్, అఘోర్‌దేవ్ వర్మ, తపన్‌సేన్ వంటి అతిరథ మహారథులతో పాటు స్థానిక పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. దీనితో పాటు అభ్యర్థులందరూ తమ పరిధిలో కొనసాగిస్తున్న ఇంటింటి ప్రచారం పలువురిని విశేషంగా ఆకర్షిస్తోంది.

ఛార్జీల పెంపుపై డిఎంకె ఆందోళనలు

చెన్నై : పెంచిన బస్సు ఛార్జీలు తగ్గించాలని ప్రతిపక్ష డిఎంకె తమిళనాడు వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. చార్జీలను తగ్గించాలని డిమాండు చేస్తూ పార్టీ కార్యకర్తలు, ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి చెన్నైలో సైదాపేట ప్రధాన రహదారిని ముట్టడించారు. దీంతో ఎండిఎంకె చీఫ్ వైగోను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వైగో మాట్లాడుతూ పేదల జీవితాలకు ఈ చార్జీలు భారం గా మారాయని, . రాష్ట్ర రవాణా సంస్థ అవినీతి, నిధుల దుర్వినియోగం కారణంగా నష్టాలబారిన పడిందని విమర్శించారు. ఆ బారాన్ని ప్రజలపై వేయడం తగదని అన్నారు. కాగా, బస్సు ఛార్జీలు కొంత వరకూ తగ్గించామని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంటుండగా, అది ఏ మాత్రం చాలదని, పెంచిన ఛార్జీలను పూర్తిగా తగ్గించాల్సిందేనని ప్రధాన ప్రతిపక్ష నేత, డిఎంకె కార్యనిర్వాహక స్టాలిన్ స్పష్టం చేశారు.. అన్నా డిఎంకె ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడమే లక్ష్యంగా పెట్టుకుందని వ్యాఖ్యానించారు.

జమిలి ఎన్నికలపై చర్చ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు అమిత్ షా, రాహుల్ గాంధీ సహాయ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ నవ భారత్ నిర్మాణానికి ముందడుగు వేయాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. 2018లో దేశ స్వప్నాలు సాకారం చేసుకునేందుకు కషి చేయాలని రాష్ట్రపతి అన్నారు. ముస్లిం మహిళల రక్షణ కోసం తమ ప్రభుత్వం త్రిపుల్ తలాక్ బిల్లును తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆయన గుర్తు చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఆడపిల్లల సంరక్షణకు "భేటి బచావ్..భేటి పడావ్" పథకానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రధాని ముద్ర యోజన ద్వారా మూడు కోట్ల మంది లబ్ది పొందారన్నారు. బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వెల్లడించారు. 2022 నాటికి దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు చేయటమే లక్ష్యమన్నారు. భారత్ నెట్ పథకం ద్వారా రెండున్నర లక్షల గ్రామాలకు ఇంటర్నెట్ సదుపాయం అందజేశామని తెలిపారు. జనరిక్ మెడిసిన్స్ ద్వారా పేదలకు మందులు అందుబాటు ధరలో లభిస్తున్నాయని, కొత్తగా నాలుగు కోట్ల మందికి విద్యుత్ సదుపాయం కల్పించామని రాష్ట్రపతి చెప్పారు. 2019లో గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దడం ద్వారా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించాలని అన్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక సమానతకు ప్రభుత్వం కషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. "ఇటీవలే మనం పొంగల్ తదితర పండుగలు జరుపుకున్నాం, గణతంత్ర దినోత్సవం కూడా మనకు చాలా ముఖ్యమైన పండుగ. ఆ సందర్భంలగా ఆసియాన్ దేశాల ప్రతినిధులను ఆహ్వానించి, వసుదైక కుటుంబాన్ని నిర్మించే ప్రయత్నం చేశాం. నూతన భారత స్వప్నాన్ని సాకారం చేసుకునే క్రమంలో దేశం నలుమూలల నుంచి వచ్చిన మీరంతా(సభ్యులు) కీలక భూమిక పోషిస్తున్నారు" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

రెండు దేశాల ఏర్పాటే పాలస్తీనా సమస్యకు పరిష్కారం

జెరూసలేంపై చర్చలకు జోర్డాన్ సూచన

అమ్మాన్ : పాలస్తీనా, ఇజ్రాయిల్‌లు ప్రత్యక్షంగా చర్చల జరపడం ద్వారా జెరూసలేం సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని జోర్డాన్ రాజు అబ్దుల్లా ఆదివారం పేర్కొన్నారు. అమ్మాన్‌లో జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్-వాల్టర్‌తో సమావేశమైన సందర్భంగా రాజు అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేశారు. తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడే దిశగా ఈ పరిష్కారం వుండాలని ఆయన సూచించినట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని పెట్రా వార్తా సంస్థ తెలిపింది. రెండు దేశాల ఏర్పాటే ఈ ఘర్షణలను అంతమొందించగల ఏకైక మార్గమని, ఇందుకు జోర్డాన్ మద్దతు వుంటుందని రాజు పునరుద్ఘాటించారు.



నిరసనలు
థాయ్‌లాండ్‌లో సైన్యం అధ్యక్ష ఎన్నికలను 2019వ సంవత్సరానికి వాయిదా వేయటానికి నిరసనగా ప్రదర్శనలు చేస్తున్న ప్రజలు

థాయ్‌లో ఎన్నికల వాయిదాపై వెల్లువెత్తిన నిరసన

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లోని సైనిక ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలను 2019 వరకూ వాయిదా వేయటాన్ని నిరసిస్తూ థాయ్ పౌరులు బ్యాంకాక్ నగరంలో సోమవారం నాడు నిరసన ప్రదర్శన నిర్వహించారు. షెడ్యూలు ప్రకారం నవంబర్‌లోనే ఎన్నికలు నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 10లోగా సైనిక ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే తాము కొత్త సమీకరణాలకు తెరతీస్తామని నిరసనకారులు హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణ చట్టంపై రాజు మహావజ్రలాంగ్‌కర్న్ సంతకం చేయాల్సి వున్నందున ఎన్నికల నిర్వహణలో జాప్యం జరిగే అవకాశం వుందని, అందువల్ల ఎన్నికల నిర్వహణను వాయిదా వేస్తున్నామని ఉప ప్రధాని విస్సాను క్రియాన్‌గమ్ వివరించారు. నవంబర్ షెడ్యూలు దాటి వాయిదా పడితే ఎన్నికలను వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. 2014 మేలో జరిగిన సైనిక కుట్రలో అప్పటి ప్రధాని ఇంగ్లక్ షినవాత్రాను గద్దెదింపి అధికారాన్ని చేజిక్కించుకున్న సైన్యం దేశంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు తాము కట్టుబడి వున్నామని పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే సైనిక ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి దేశంలో రాజకీయ పార్టీల కార్యకలాపాలపై నిషేధం విధించారు.

ఖలీదా జియాకు శిక్ష పడితే దేశంలో తీవ్ర పర్యవసానాలు

బిఎన్‌పి హెచ్చరిక

ఢాకా : అవినీతి కేసులో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) నాయకురాలు ఖలీదా జియాపై ఫిబ్రవరి 8న కోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో ఇప్పటివరకు ప్రశాంతంగా వున్న రాజకీయ వాతావరణం స్థానే అశాంతి, ఘర్షణలు నెలకొనగలవని భావిస్తున్నారు. తమ నాయకురాలికి వ్యతిరేకంగా కోర్టు తీర్పు వస్తే ఆందోళనలు తప్పవని ఇప్పటికే బిఎన్‌పి కార్యకర్తలు హెచ్చరించారు. ఈ కేసులో జియాతో పాటు ఆమె కొడుకు తారిక్ రహమాన్, మరో నలుగురు వున్నారు. జియా అనాథాశ్రమం ట్రస్టుకు ఉద్దేశించిన 2కోట్ల 10లక్షల టాకాల విదేశీ విరాళాల స్వాహా జరిగిందని కేసు నమోదైంది. ఈ కేసులో దోషిగా తేలితే జియాకు యావజ్జీవం పడే అవకాశముంది. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఆమె శనివారం కీలక పార్టీ సమావేశాన్ని నిర్వహించారు.

అధ్యక్ష ఎన్నికల బహిష్కరణకు పిలుపు

రష్యా ప్రతిపక్ష నేత అరెస్టు

మాస్కో : మార్చిలో జరగనున్న రష్యా అధ్యక్ష ఎన్నికలను బహిష్కరించాలని కోరుతూ ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రజలను కోరిన కాసేపటికే ప్రతిపక్ష నేత అలెక్సి నెవల్నీని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కాగా, గత ప్రదర్శనల కన్నా ఈసారి రష్యావ్యాప్తంగా జరిగిన నిరసనలు, ఆందోళనల్లో పాల్గొన్నవారి సంఖ్య తగ్గినప్పటికీ ఆదివారం దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. మాస్కోలో క్రెమ్లిన్‌కు కొద్ది వందల మీటర్ల దూరంలోని ప్రధాన కూడలి వద్ద జరిగిన నిరసన ర్యాలీలో నెవల్నీ ప్రసంగించారు.

చర్చలకు ఒప్పుకున్న వెనిజులా ప్రతిపక్షం



కారకాస్: ఏప్రిల్‌లో జరుగనున్న అధ్యక్ష ఎన్నికల నిర్వహణపై చర్చించేందుకు తాము డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగే చర్చలకు హాజరవుతామని వెనిజులా ప్రతిపక్షం డెమొక్రాటిక్ యూనిటీ రౌండ్ టేబుల్ ప్రకటించింది. తొలుత ఈ చర్చలను బహిష్కరిస్తున్నట్లు ప్రతిపక్ష ఎంయుడి ప్రకటించటంతో చర్చల ప్రక్రియ రద్దవుతుందని భావించినప్పటికీ ప్రతిపక్షం తాజా నిర్ణయంతో ప్రతిష్టంభనకు తెరపడింది. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వంతో పోరాడేందుకు తాము కట్టుబడి వున్నామని ఎంయుడి నేతలు చెప్పారు. సోమవారం నుండి చర్చల ప్రక్రియకు హాజరవుతున్నట్లు ప్రకటించిన ప్రతిపక్షం అధ్యక్ష ఎన్నికల్లో ఓటింగ్ స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

ఎన్నికల పర్యవేక్షణకు విదేశీ నిపుణులను అనుమతించాలని, ఎన్నికలలో పోటీకి సంబంధించి ప్రతిపక్ష నేతలపై విధించిన నిషేధాన్ని తొలగించాలని ప్రతిపక్షం తన డిమాండ్లలో పేర్కొంది. ఏప్రిల్ చివరిలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాజ్యాంగ అసెంబ్లీ గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంకా ఎన్నికల తేదీలు ఖరారు చేయనప్పటికీ అధ్యక్షుడు మదురో మాత్రం మరోసారి అధికార పిఎస్‌యువి తరపున తాను ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. అయితే ప్రతిపక్షం లేకుండా ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ అసెంబ్లీ తీసుకున్న నిర్ణయాన్ని పలు దేశాలు ఖండించాయి. ఎన్నికల్లో ఎంయుడి సంకీర్ణ కూటమి పాల్గొనరాదంటూ గత గురువారం వెనిజులా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించటంతో అధ్యక్షుడు మదురోపై పోటీ చేసేందుకు మరో పార్టీ అభ్యర్థిని అన్వేషిస్తున్నారు. హింసకు ప్రేరేపించటం, ప్రభుత్వ వ్యతిరేక కుట్ర వంటి అభియోగాలెదుర్కొంటున్న ఎంయుడికి చెందిన పలువురు నేతలు ఇప్పటికే ఎన్నికల్లో పోటీపై నిషేధాన్ని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

అమెరికాలో పోలీసు రాజ్యం

- ట్రంప్ ఆదేశాలతో మరింత అధ్వాన్నం
- ఈ నెల్లోనే 78 సంఘటనలు

వాషింగ్టన్ : అమెరికాలో పోలీసు రాజ్యం నడుస్తోంది. స్థానిక పోలీసుల నుండి ఇమ్మిగ్రేషన్ ఏజెంట్ల వరకు ప్రభుత్వ యంత్రాంగమంతా ఇదే తరహాలో వ్యవహరిస్తోంది. గత జులైలో పోలీసు అధికారులనుద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తూ, మరీ అంత మెతకగా వ్యవహరించరాదని కోరారు. నిర్బంధితుల పట్ల కఠినంగా వుండాలని ఆదేశించారు. అదే సమయంలో ఒబామా ప్రభుత్వం పోలీసు విభాగాలపై పెట్టిన ఫెడరల్ పర్యవేక్షణ విభాగానికి అధికారాలు లేవనే నెపంతో న్యాయ విభాగం రద్దు చేసింది. ట్రంప్ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన ఏడాది పోలీసుల చేతుల్లో 1223మంది హత్యకు గురయ్యారు. కొత్త ఏడాది ప్రారంభమైన తర్వాత సగటున రోజుకు 3.5మంది చనిపోతున్నారు. వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించిన డేటా నివేదికల్లో ఈ విషయాలు వెలుగుచూశాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 78 పోలీసు కాల్పుల సంఘటనలు జరిగాయి. గతంలో మాదిరిగానే ఈ పోలీసు కాల్పుల ప్రభావం ప్రతి జాతి, తెగపై వుంది. బాధితుల్లో శ్వేత జాతీయులు ఎక్కువగా వున్నారు. మొత్తంగా జనాభా శాతంలో చూసినట్లైతే ఆఫ్రికన్ అమెరికన్ మృతుల రేటు ఇంకా ఎక్కువగా వుంది. 54శాతం మంది బాధితులు శ్వేత జాతీయులు కాగా, 25శాతం మంది ఆఫ్రికన్ అమెరికన్స్, 15శాతం హిస్పానిక్ అమెరికన్, మూడు శాతం ఆసియన్, 2శాతం ఆదిమవాసులు వున్నారని వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఇటీవలే జరిగిన కాల్పుల్లో 26ఏళ్ళ ఆఫ్రికన్ అమెరికన్ మరణించాడు. విస్కాన్సిన్‌లోని రేసిన్‌లో ఈ నెల 17న ట్రాఫిక్ స్టాప్ సిగ్నల్ దగ్గర ఈ కాల్పులు చోటు చేసుకున్నాయి. తన వాహనానికి ముందు లైసెన్స్ ప్లేట్ పెట్టుకోకపోవడం షానన్ చేసిన తొలి నేరం. అయితే పోలీసులపై షానన్ తుపాకీ గురి పెట్టాడని అందుకే వారు కాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. అయితే సంఘటనా ప్రాంతంలో ఆయుధమేదీ దొరకలేదని దర్యాప్తు అధికారులు తెలిపారు. అదే రోజు ఓహియో లోని కొలంబస్‌లో డిప్యూటీ పోలీసు అధికారి శ్వేత జాతీయుడైన 16ఏళ్ళ జోసెఫ్ హేన్స్‌ను కాల్చి చంపారు. తన తల్లిని గోడపై తోసినందుకు ఆ అధికారితో ఘర్షణ పడినందుకు హేన్స్‌ను నేలపైకి తోసి కడుపులో కాల్పులు జరిపారు. ఎక్కువగా పోలీసుల వేధింపులకు, కర్కశత్వానికి కార్మికులు, యువత బలవుతున్నారు.

ఆఫ్రికన్లంటే గౌరవం

మాటమార్చిన ట్రంప్

అడిస్ అబాబా : ఆఫ్రికన్ల పట్ల అమెరికాకు చాలా గౌరవం వుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అవసరమైతే అక్కడకు ఉన్నత దౌత్యవేత్తను కూడా పంపుతామని ఆఫ్రికన్ నేతలకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇమ్మిగ్రేషన్ విషయమైన కాంగ్రెస్ సభ్యులతో సమావేశమైనపుడు ఆఫ్రికా దేశాల గురించి ట్రంప్ అసభ్యంగా, చెత్తగా వ్యాఖ్యానించిన నేపథ్యంలో గత వారం ఈ లేఖ పంపారు. తానటువంటి వ్యాఖ్యలేమీ చేయలేదంటూ ట్రంప్ బుకాయిస్తున్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై అంతర్జాతీయంగా ఖండనలు వెల్లువెత్తాయి. ఆఫ్రికన్ యూనియన్ (ఎయు)కి చెందిన 55సభ్య దేశాలు ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రకటన చేశాయి. దీంతో మాటమార్చిన ట్రంప్, "ఆఫ్రికా ప్రజల పట్ల అమెరికాకు చాలా గౌరవం వుంది. ఆఫ్రికా దేశాలతో పటిష్టమైన, గౌరవప్రదమైన సంబంధాలు నెలకొల్పుకోవాలనేది నా అభిమతం కూడా." అని తన లేఖలో పేర్కొన్నారు. తీవ్రవాదులను ఓడించేందుకు మన సైనికులు కలిసి పోరు సల్పుతున్నారని, స్వేచ్ఛా, సక్రమ వాణిజ్యాన్ని పెంపొందించేందుకు మనం కలిసి కృషి చేయాల్సి వుందని ట్రంప్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖ బయటకు వెల్లడి కాలేదు. కానీ లేఖ రాసినట్లు ఆఫ్రికన్ యూనియన్‌లో అమెరికా ప్రతినిధి బృందానికి చెందిన దౌత్యవేత్త చిరిస్ మీడె ధృవీకరించారు. లేఖలోని అంశాలను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. అయితే సోషల్ మీడియాలో ఆ లేఖ వైరల్ అవుతోందని ఎయు వర్గాలు ధృవీకరించాయి. ఆఫ్రికా దేశాలను ఉద్దేశిస్తూ తాను కఠినమైన పదజాలాన్ని ఉపయోగించింది నిజమే కానీ బయట ప్రచారమవుతున్న వ్యాఖ్యలను మాత్రం చేయలేదంటూ ట్రంప్ పేర్కొంటున్నారు. మార్చిలో అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ ఆఫ్రికాలో పర్యటించనున్నారు. అనంతరం మరింత మంది ఆఫ్రికన్ నేతలు వైట్‌హౌస్‌ను సందర్శించాలని ట్రంప్ కోరారు.

ఏడెన్ నగరంలో భీకర ఘర్షణలు

10మంది మృతి, 80మందికి పైగా గాయాలు

ఏడెన్/మరీబ్ (యెమెన్) : ఏడెన్ నగరంలో దక్షిణ యెమెన్ వేర్పాటువాదులు, ప్రభుత్వ బలగాల మధ్య ఆదివారం జరిగిన పోరులో 10మంది మరణించగా, 80మందికి పైగా గాయపడ్డారని స్థానిక వైద్యాధికారులు తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) మిత్రపక్షంగా వున్న దక్షిణ యెమెన్ వేర్పాటువాదులు, సౌదీ ప్రభుత్వానికి విశ్వాసపాత్రులుగా వున్న శక్తుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఉత్తర యెమెన్‌లో ఇరాన్ అనుకూల హౌతి మూవ్‌మెంట్‌కు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడిన వీరు ఇప్పుడు తమలో తాము ఘర్షణ పడుతున్నారు. ప్రభుత్వానికి విశ్వాసంగా వున్న బలగాలు తక్షణమే వెనక్కి మరలాలని, కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రధాని అహ్మద్ దగర్ ఆదేశించడంతో ఆదివారం సాయంత్రానికి ఘర్షణలు సద్దు మణిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దగర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని పేర్కొంటూ తక్షణమే ఆ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతున్న వేర్పాటువాదులతో కుదుర్చుకున్న గడువు గత వారం ముగియడంతో ఘర్షణలు మళ్ళీ తలెత్తాయి.

మొదటి పేజీ తరువాయి

భూ కుంభకోణం నిజమే

సమరయోధులకు కేటాయించిన భూమిని డెవలప్‌మెంట్ పేరుతో బోండా ఉమామహేశ్వర రావు భార్య రాయించు కున్నారు. దీని విలువ సుమారు రూ.60 కోట్ల వరకూ ఉంటుంది. దీనిపై బాధితుడు పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో వారు విచారించి కేసు నమోదు చేశారు. భూ కబ్జాగా కేసు నమోదు చేశారు. దీనిలో బోండా ఉమామహేశ్వర రావు భార్య పేరును కూడా చేర్చారు. దీనిపై బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తనకు ఆ భూమి వివరాలు తెలియవని, సమస్యలు లేవని చెప్పడంతోనే డెవలప్‌మెంట్‌కు తీసుకున్నామని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ లింకు డాక్యుమెంట్లు లేకుండా, భూస్థితి తెలుసుకోకుండా, ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ తీసుకోకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అవేమీ తెలియవని చెప్పడం సరికాదని సిఎం కూడా అన్నట్లు సమాచారం. బోండా ఉమామహేశ్వరరావు చర్యతో రాజధానిలో పార్టీకి నష్టం వాటిల్లిందని అన్నట్లు సమాచారం. సమగ్ర నివేదిక తయారు చేసి వెంటనే పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని చెప్పారు. ఇలాంటి విషయాల్లో పోలీసుల కూడా ఉదారంగా ఉండొద్దని, విషయాన్ని సీరియస్‌గానే పరిగణించాలని అన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో బోండా ఉమామహేశ్వరరావు సతీమణి పాత్రే కీలకమని చెప్పినట్లు తెలిసింది. నగరంలో పలువురు కార్పొరేటర్లను బినామీలుగా పెట్టి పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ వ్యవహారం జరిగిందని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

ఖరీఫ్ సాగు నీటికి ప్రణాళిక

(డిపిఆర్) ఫిబ్రవరి ఐదుకల్లా అందించాలని అధికారులను ఆదేశించారు.

పోలవరం పనుల పరిశీలన

అనంతరం పోలవరం ప్రాజెక్టు పనులను ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరిశీలించిన ఆయన పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో సమీక్షించారు. గడచిన వారం రోజుల్లో 1.90 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకం పనులు చేపట్టగా 3,826 క్యూబిక్ మీటర్ల మేర స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని అధికారులు సిఎంకు వివరించారు. డయాఫ్రమ్ వాల్ 19.6 మీటర్ల వరకు నిర్మాణం జరిగిందన్నారు. సమీక్షలో జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ట్రాన్స్‌ట్రాయ్, త్రివేణి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్లకు అధిక డిమాండ్

ఇళ్ల కోసం ప్రజల్లో డిమాండ్ అధికంగా ఉందని, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2016-17 ఎన్టీఆర్ గ్రామీణ ఇళ్ల నిర్మాణం 64 శాతమే పూర్తయ్యాయని, నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. నీరు-ప్రగతి, వ్యవసాయ పురోగతిపై తన నివాసం నుంచి సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఈ ఏడాది ప్రథమార్థంలో 11.5 శాతం వృద్ధి సాధించామని, ఇదే స్ఫూర్తితో 15 శాతం వృద్ధి, 80 శాతం ప్రజల సంతృప్తి సాధించాలన్నారు. ఈ నెలలో రేషన్ పంపిణీపై సంతృప్తి 69 నుంచి 76 శాతానికి పెరిగిందన్నారు. జన్మభూమిలో వచ్చిన వినతుల పరిష్కారంపై శ్రద్ధ చూపిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ నెలాఖరులోగా అన్ని వినతులు పరిష్కరించాలని ఆదేశించారు. దావోస్ జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో వ్యవసాయం-ఆహార భద్రతపై ఫలప్రదమైన చర్చ సాగిందని తెలిపారు. పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ నామూనా ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ ఏడాది వేరుశనగ దిగుబడులు గణనీయంగా పెరిగాయంటూ వేరుశనగ, మినుము, అపరాల రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలన్నారు. పెరుగుతున్న పంట దిగుబడులను దృష్టిలో ఉంచుకుని జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలుష్యం కారణంగా ఆక్వా ఉత్పత్తులకున్న ప్రాధాన్యత తగ్గే ప్రమాదం ఉందన్నారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. నరేగా నిధులతో ఉపాధి, ఆస్తుల కల్పన సమాంతరంగా జరుగుతుందని, ఇతర రాష్ట్రాల్లో ఈ పథకాన్ని ఉపాధికి మాత్రమే వినియోగిస్తున్నారని చెప్పారు. పని దినాల సంఖ్య మరింత పెంచాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, ఉద్యాన, పశగణాభివృద్ధి, జలవనరులు, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శులు రాజశేఖర్, చిరంజీవి చౌదరి, గోపాలకృష్ణ ద్వివేది, శశిభూషణ్, జవహర్‌రెడ్డి, అనంతరాము, మల్లికార్జునరావు, గృహనిర్మాణ శాఖ ఎండి కాంతిలాల్ దండే, సెర్ప్ సిఇఒ కృష్ణమోహన్, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విరాళాల్లోబిజెపికి 89 శాతం

(మొదటి పేజీ తరువాయి)

177.40 కోట్లు, 2015-16లో 49.50 కోట్లు, 2016-17లో 325.27 కోట్లు విరాళాలు పొందినట్లు ఎడిఆర్ నివేదికలో పేర్కొంది. వ్యక్తులుగా చూస్తే 2016-17లో సురేష్ కోటక్, అనల్‌జిత్‌సింగ్ ఎక్కువ నిధులు ఎన్నికల ట్రస్టులకు మళ్లించారు. సురేష్ కోటక్ ఐదో అతిపెద్ద డోనర్‌గా 18.5 కోట్లు జనతా నిర్వచక్ ట్రస్టుకు ఇవ్వగా అనల్‌జిత్ సింగ్ ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్‌కు కోటి రూపాయలు ఇచ్చారు. అయితే సత్య ఎలక్టోరల్ ట్రస్ట్ తన అడ్రస్‌ను మార్చుకున్నప్పటికీ దానికి సంబంధించిన అధికార పత్రమేది ఎన్నికల కమిషన్‌కు సమర్పించలేదు. ఇటీవల కేంద్రం రూపొందించిన నివేదిక ప్రకారం ఆయా సంస్థలు మొత్తం ఆదాయంలో 95 శాతాన్ని ఎన్నికల ట్రస్టులకు మళ్లించొచ్చు. ఎడిఆర్ నివేదిక ప్రకారం 69 శాతం నిధులు గుర్తు తెలియని సంస్థల నుండి వస్తోంది. 2017 అక్టోబర్ 11 నాటికి సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ సంస్థల వద్ద 21 సంస్థలు నమోదు చేసుకున్నప్పటికీ 14 సంస్థలు మాత్రమే వాటి లావాదేవీల నివేదికలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాయి. ఇప్పటికీ ట్రస్టులు ఏర్పాటు చేసే సమయంలో ఆయా కంపెనీలు వారి మాతృక కంపెనీల పేర్లను నమోదు చేయడం లేదు. అలా చేయడం ద్వారా మరింత పారదర్శకత వస్తుందని ఎడిఆర్ పేర్కొంది. నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల వల్ల నిధుల్లో పారదర్శకత మరింత తగ్గుతుదని ఎడిఆర్ నివేదికలో పేర్కొంది.

మూడు రాష్ట్రాలకుకోర్టు ధిక్కార నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

నిలిపేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో లిఖిత పూర్వకంగా కోర్టుకు చెప్పాలని ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. ఆయా రాష్ట్రాల్లో శాంతి భద్రతలపై కేంద్రం కూడా పర్యవేక్షణ చేయాలని సూచించింది. అనాగరికంగా జరుగుతున్న దాడులను నిలువరించాలని కోరింది. గో రక్షణ పేరుతో కొంతమంది చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుంటే సహించమని పేర్కొంది. గోగూండాలు ఉత్తరప్రదేశ్‌లోని దాద్రిలో మొహమ్మద్ అఖ్లాక్‌పై దాడిచేసి హత్యచేసిన ఘటన 2015లో నమోదైంది. అనంతరం గుజరాత్‌లో నలుగురు దళిత యువకులను కారుకు కట్టి కొట్టిన ఘటన, గోవులను ఎత్తుకెళు న్నాడని 55 సంవత్సరాల పెహ్లూఖాన్‌ను అతి దారుణంగా హత్య చేసిన ఘటనల వంటివి నమోదయ్యాయి. ఇతర రాష్ట్రాలలో కూడా ఇలాంటి కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

చిన్నారి సహా ముగ్గురి హత్య

చందానగర్‌లో ఘోర ఘటన



ఫైల్ ఫోటో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒక చిన్నారి, ఆపాప తల్లి, అమ్మమ్మ హత్యకు గురయ్యారు. ఈ ఘటన హైదరాబాద్ శివారు ప్రాంతం చందాన గర్‌లో చోటు చేసుకుంది. ఇంట్లో నుంచి వాసన వస్తుండటంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారమివ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా మృతదేహాలు కనిపించాయి. మూడు రోజుల క్రితం వీరు హత్యకు గురై ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన అపర్ణ(30), అదే జిల్లాకు చెందిన మధు ప్రేమించి ఐదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తె కార్తికేయ(4)ఉంది. అంతకు ముందే మధుకు పెళ్లయినట్లు, కూకట్‌పల్లిలో మొదటి భార్యతో ఉంటున్నట్టు అపర్ణకు తెలిసింది. దీంతో ఇద్దరి మధ్యా తరుచూ గొడవలు రేగుతున్నాయి. భర్తతో విభేదించిన అపర్ణ తన తల్లి, కూతురుతో కలిసి శేరిలింగంపల్లి మండలం చందానగర్ వేముకుంటలో నివాసం ఉంటున్నది. స్థానిక బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. భర్త మాత్రం కూకట్‌పల్లిలో మొదటి భార్యతో ఉంటూ ఒక మొబైల్ షాపులో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అపర్ణ రోజు మాదిరిగానే శుక్రవారం డ్యూటీకి వెళ్లి వచ్చింది. అయితే, ఆ తర్వాత ఏం జరిగిందో గానీ మూడ్రోజులుగా ఆ ఇంట్లో నుంచి ఎవ్వరూ రాలేదు. మరోవైపు బయట తాళం వేసి ఉంది. ఇంట్లో నుంచి వాసన వస్తుండటంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని స్థానికులతో కలిసి ఇంటి కిటికీలు పగులగొట్టి చూశాడు. ఇంట్లో నుంచి ఎలాంటి అలజడి లేకపోవటంతో స్థానికులతో కలిసి చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి తాళం పగులగొట్టిలోనికి ప్రవేశించారు. వంటగదిలో అపర్ణ రక్తపు మడుగులో పడి చనిపోయి ఉంది. అపర్ణను రోకలి బండతో మోది హతమార్చినట్టు కనిపించింది. బెడ్‌రూంలో మంచంపై ఆమె తల్లి జయమ్మ (55), కూతురు కార్తికేయ విగత జీవులై ఉన్నారు. ఈ హత్యలను అపర్ణ భర్త మధు చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్, జాయింట్ సీపీ ఖాసీం, కూకట్‌పల్లి ఏసీపీ భుజంగరావు, ఇన్‌స్పెక్టర్లు తిరుపతిరావు ఘటనాస్థలిని పరిశీలించారు. అనుమానిత ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అపర్ణ భర్త మధు చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు తెలిసింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అంతకముందు క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్లతో ఆ స్థలాన్ని పరిశీలించారు.

జగన్ @ 1000 కిలోమీటర్లు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పొదుపు రుణాలను మాఫీ చేసి సొమ్మును నాలుగువిడతలుగా మహిళల ఖాతాలో జమ చేస్తామన్నారు. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర కొనసాగించారు. మన ప్రభుత్వం వస్తుంది.. ప్రజలందరికి న్యాయం చేస్తామంటూ హామీ ఇస్తూ ముందుకు సాగారు. సాయంత్రం నాలుగుగంటలకు సైదాపురం మండలంలోకి పాదయాత్ర ప్రవేశించింది. సైదాపురం కైవల్యా వంతెన సమీపానికి వెళ్లేసరికి ఆయన పాదయాత్ర వెయ్యికిలోమీటర్ల మైలురాయిని దాటింది. అందుకు గుర్తుగా వైసిపి జిల్లా నాయకులు కైవల్యా వంతెన సమీపాన 25 అడుగుల ఎత్తు ఉండే స్థూపాన్ని ఏర్పాటు చేశారు. స్థూపాన్ని జగన్ ఆవిష్కరించారు. కలిమిలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆరు అంబులెన్స్‌లను జగన్ ప్రారంభించారు. ట్రస్ట్ నిర్వాహకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డిని అభినందించారు. సైదాపురం మండలంలో మంగళవారం పాదయాత్ర కొనసాగుతుంది. సైదాపురం నుంచి ప్రారంభమై దాడిశెట్టి పల్లి, ఊటుకూరు, తురిమెర్ల, కలిచేడు, తలుపూరు క్రాస్‌రోడ్డు వరకు పాదయాత్ర కొనసాగుతుంది. తలుపూరు క్రాస్‌రోడ్డులో రాత్రి బస ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

రాష్ట్రవ్యాప్తంగా 'వాక్ విత్ జగన్'

వైసిపి అధినేత జగన్ చేపట్టిన పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ఆయన సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు సోమవారం 'వాక్ విత్ జగన్' కార్యక్రమం చేపట్టారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో జగన్‌కు మద్దతుగా చేపట్టిన సంఘీబావ యాత్రను సోమవారం బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపార్టీ అధ్యక్షుడు బెల్లాన చంద్రశేఖర్, పార్టీ సమన్వకర్త మజ్జి శ్రీనివాసరావు, భారీగా వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. కురుపాంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాని, అరకు వైసిపి పార్లమెంట్ అధ్యక్షులు పరిసిత్రాజ్ యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. కడప జిల్లాలో వేముల నుంచి నల్లచేరువుపల్లి సమీపంలోని మోపూరి భైరవేశ్వరుడు వరకు 21 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా వైసిపి నాయకులు వాక్ విత్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలోనూ వైసిపి శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వైసిపి సమన్వయకర్త రామారావు ఆధ్వర్యంలో రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటిరాంబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నందిగం క్రాస్‌రోడ్ నుండి నరసరావుపేట చెక్‌పోస్టు వరకు పాదయాత్ర చేశారు. పలు మండలాలతోపాటు ఢిల్లీ, హైదరాబాద్‌లోనూ వైసిపి కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు.

'తలాక్'ఆమోదానికి కలిసిరండి : ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

సాగేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకారం అందించాలని కోరారు. బడ్జెట్‌కు సంబంధించిన అన్ని అంశాలను పార్లమెంటరీ కమిటీలతో చర్చించామన్నారు. గ్రామీణ భారతం అభివద్ధి, రైతులు, దళితులు, గిరిజనులు, కార్మికుల అభ్యున్నతికి చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు.

హడావిడి బిల్లులతో ప్రజాస్వామ్యానికి ముప్పు: మల్లికార్జున ఖర్గే

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో భారత ప్రజాస్వామ్యానికి స్వల్ప కాలంలోనే కాకుండా దీర్ఘ కాలంలోనూ చెడు జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. సోమవారం నాడు పార్లమెంట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార పార్టీ చివరి నిమిషంలో పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టి చర్చకు అవకాశం ఇవ్వకుండా ఆమోదించాలని ఒత్తిడి తెస్తోందన్నారు. ఇందువల్ల ప్రజాస్వామ్యానికి కీడు జరుగుతుందని పేర్కొన్నారు. "కీలక అంశాలను చర్చకు తీసుకురావడం లేదు. హడావిడిగా చివరి నిమిషంలో బిల్లులు ప్రవేశపెట్టి తమకున్న మెజారిటీ బలంతో ఆమోదించేస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఈ చర్య తగ్గించేస్తోంది" అని ఖర్గే అన్నారు. బడ్జెట్ సెషన్‌కు తక్కువ వ్యవధిని నిర్దేశించడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. కేవలం నాలుగు రోజుల్లో అన్ని అంశాలు ఎలా చర్చించగలమని, ఇది కేవలం కంటితుడుపు చర్యేఅని, అనుకున్నది చేసేసి ఎన్నికలకు వెళ్లాలని వారు కోరుకుంటున్నారని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రతి అంశాన్ని చాలా తేలిగ్గా తీసుకోవడం, అదే తరహాలో బిల్లులు ప్రవేశపెట్టి...మెజారిటీ బలంతోనే అన్నీ సాధించాలనుకుంటున్నారని ఖర్గే అన్నారు.

ప్రజల వాస్తవ సమస్యలను విస్మరించిన రాష్ట్రపతి ప్రసంగం: పి.కరుణాకరన్, సిపిఎం

దేశంలో ప్రజలెదుర్కొంటున్న వాస్తవ సమస్యలను రాష్ట్రపతి తన ప్రసంగంలో విస్మరించారని సిపిఎం లోక్‌సభ పక్షనేత పి.కరుణాకరన్ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ప్రజా సమస్యలు చర్చకు రాలేదని, కనుక రాష్ట్రపతి ప్రసంగాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గత బడ్జెట్ ప్రతిపాదనల్లో 50శాతం ఇంకా అమలు కాలేదని, దానికి సంబంధించి ఒక అంశం కూడా రాష్ట్రపతి ప్రసంగంలో లేదని విమర్శించారు. జిఎస్టీ, నోట్ల రద్దు వంటి ప్రభుత్వ ఏకపక్ష చర్యలతో దేశ ప్రజలు నష్టపోయారని, వాటికి సంబంధించి రాష్ట్రపతి ప్రసంగంలో లేకపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతులు రెట్టింపు ఆదాయం గురించి రాష్ట్రపతి పేర్కొన్నారని, కానీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

రైతులకు అవసరమైన మద్దతు ధర, దానికి సాకారమైయ్యే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు గురించి రాష్ట్రపతి ప్రసంగంలో లేకపోవడం బాధాకరమని అన్నారు. దేశంలో ధరలు పెరుగుదల సామాన్యుల్ని చిన్నాభిన్నం చేస్తోందని, గ్యాస్ ధరలు, పెట్రోల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని గుర్తు చేశారు. కానీ రాష్ట్రపతి తన ప్రసంగంలో ధరల పెరుగుదల గురించి పేర్కొనకపోవడం దారుణమన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఒక పత్రాన్ని రాష్ట్రపతి సుదీర్ఘంగా చదివారని, అంతేతప్ప దేశంలో ప్రజల వాస్తవ సమస్యలను పేర్కొనలేదని విమర్శించారు.

విభజన హామీల అమలుకు సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

నేతలను, ఎంపిలను కలిసేందుకు ఢిల్లీకి వచ్చిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నేతృత్వంలోని ఉత్తరాంధ్ర చర్చా వేదిక బృందం సోమవారం సిపిఐ జాతీయ నేత, ఎంపి డి.రాజా, తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసింది. అంతకు ముందు స్థానిక ఏపి భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వేదిక బృంద సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, రైల్వే జోన్ ప్రకటించాలని, పోల వరం నిర్మాణం, ఎయిమ్స్ ఏర్పాటు, విశాఖలో హై కోర్ట్ బెంచ్ ఏర్పాటు, విజయనగరంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిలు జ్ఞానేంద్ర రెడ్డి, కణితి విశ్వనాథం, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బి.బాబ్జి తదితరులు ఉన్నారు.

అదే పెద్ద కాంప్లిమెంట్



రాశీ ఖన్నా

"చాలా వరకు సన్నబడ్డాను. తమిళంలో కాస్త బొద్దుగా ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారని అందరూ అంటున్నారు. తెలుగువాళ్లు కూడా మరీ సన్నబడ్డావు కాస్త లావైతే బావుంటుందని అన్నారు. కానీ నేను స్లిమ్‌గా ఉంటేనే బావుందనిపిస్తుంది. రకుల్, లావణ్య సహా ప్రస్తుతం రాణిస్తున్న హీరోయిన్స్ అందరూ నాకు మంచి స్నేహితులే. కాబట్టి వాళ్లెవరనీ నేనేం కాంపిటీషన్ ఫీల్ కావడం లేదు. ప్రస్తుతం ఉన్న పొజిషన్ పట్ల సంతృప్తిగానే ఉన్నాను" అని రాశీ ఖన్నా పేర్కొంది. రవితేజ, రాశీ ఖన్నా, సీరత్ కపూర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. విక్రమ్ సిరికొండ దర్శకుడు. నల్లమలుపు బుజ్జి, వల్లభనేని వంశీ నిర్మాతలు. ఫిబ్రవరి 2న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రాశీ ఖన్నాతో మీడియాతో మాట్లాడింది.

ఈ చిత్రంలో మీ క్యారెక్టర్ సినిమాలో ఎలా ఉంటుంది?

సినిమాలో నా క్యారెక్టర్ పేరు పుష్ప. సాధారణంగా హీరోయిన్స్‌కు ప్రస్తుతం ఉన్న సినిమాల్లో పెర్ఫార్మెన్స్ రోల్స్, కామెడీ చేసే రోల్స్ రావడం అనేది చాలా కష్టం. కానీ నాకు మంచి కామిక్ టచ్ ఉండే క్యారెక్టర్ దొరికింది. నాకు, రవితేజకి మధ్య మంచి కామెడీ సీన్స్ ఉన్నాయి. 'సుప్రీమ్' సినిమాలో కూడా నా పాత్రకు మంచి కామెడీ టచ్ ఉంటుంది. అయితే ఆ బెల్లం శ్రీదేవికి, పుష్పకు మధ్య చాలా వ్యత్యాసం కనపడుతుంది. కామెడీ చేయడాన్ని ఇష్టపడే నేను... పుష్ప క్యారెక్టర్‌లో నటించడానికి ఆసక్తి చూపాను.

డబ్బింగ్ తర్వాత మీ పాత్ర ఎలా అనిపించింది?

చాలా బాగా వచ్చిందండీ.. ముఖ్యంగా రవితేజ నాకు ఫోన్ చేసి చాలా మంచి రోల్ చేశావని అప్రిసియేట్ చేశారు. అదే బిగ్గెస్ట్ కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను.

రవితేజతో వరుసగా నటిస్తున్నట్లున్నారు కదా?

నేను రవితేజతో సమయం గడపడాన్ని చాలా బాగా ఆస్వాదిస్తాను. ఆయన చాలా ఎనర్జిటిక్. అయితే ఆయన చాలా పాజిటివ్, జోవియల్ పర్సన్. మరోసారి ఆయనతో నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను.

రవితేజ సెట్స్‌లో ఏమైనా సలహాలిచ్చారా?

రవితేజ కామెడీ టైమింగ్ సూపర్బ్‌గా ఉంటుంది. ఆయన సన్నివేశాలను ఎలివేట్ చేసే సమయంలో నాకు కొన్ని సూచనలు కూడా చేశారు.

తొలిప్రేమలో మీ రోల్ ఏంటి?

తొలి ప్రేమ గురించి ఇప్పుడే చెప్పడం సరికాదు కానీ.. అందులో మూడు వేరియేషన్స్ ఉన్న పాత్ర చేశాను

'టచ్ చేసి చూడు'ఎలాంటి సినిమా?

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఆయన పోలీస్ ఆఫీసర్ అయినా.. కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న కుటుంబ కథా చిత్రం. అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి.

ఇందులో డ్యాన్స్ టీచర్‌గా చేసినట్లున్నారు కదా?

అవునండీ.. వెస్ట్రన్ డ్యాన్స్ టీచర్ పాత్రలో కనపడతాను. ఓ సీన్‌లో వెస్ట్రన్ డ్యాన్స్ చేయాల్సి ఉండటంతో ఐదు రోజు పాటు ప్రాక్టీస్ చేసి, ఆ సీన్లో నటించాను. పాత్ర పరంగా బాగానే కష్టపడ్డాను. మరి ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారనేది చూడాలి.

తెలుగు డబ్బింగ్ చెప్పుకోలేదా?

టచ్ చేసి చూడు, తొలిప్రేమ.. ఈ రెండు చిత్రాలకు నేనే డబ్బింగ్ చెప్పుకోవాలనుకున్నాను. అయితే డబ్బింగ్ చెప్పడానికి సమయం పడుతుంది. ప్రస్తుతం సమయం లేదు. అందువల్ల డబ్బింగ్ చెప్పడం లేదు. అయితే తప్పకుండా డబ్బింగ్ చెబుతాను.

నటిగా మీ జర్నీ ఎలా ఉంది?

గ్లామర్. పెర్ఫార్మెన్స్ పాత్రలతో కెరీర్‌ను బ్యాలెన్స్ చేయడానికి ప్రయత్నిస్తున్నాను.

త్రివిక్రమ్ చెప్పిన కొన్ని రోజులకే డైరెక్టరనయ్యా



'ఛలో' దర్శకుడు వెంకీ కుడుమల

నాగశౌర్య, రష్మిక మండన్నా హీరోయిన్లుగా నటించిన 'ఛలో' చిత్రానికి వెంకీ దర్శకుడు. ఈయన సోమవారం మాట్లాడారు.

మాది ఖమ్మం జిల్లా అశ్వారావ్ పేట. ఎంబీఏ చదివాను. నేను తేజగారి డైరెక్షన్ టీంలో 'నీకు నాకు డాష్ డాష్'కు పనిచేశాను. అందులో చిన్న పాత్రలో కూడా నటించాను. నా ప్రయాణం అలా ప్రారంభమైంది. తర్వాత 'జాదూగాడు' సినిమా కోసం యోగితోనూ, తుఫాన్ తెలుగు వెర్షన్‌కు కూడా పనిచేశాను. తర్వాత త్రివిక్రమ్ వద్ద 'అఆ' సినిమాకు పనిచేశాను. బలభద్ర పాత్రుని రమణి అనే రచయిత వల్ల తేజకి పరిచయమయ్యాను.

స్నేహం ఎక్కడ చెడుతుందో అనుకునేవాడిని.

'జాదూగాడు' సినిమాకు నేను అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నప్పటి నుంచీ నాగశౌర్యతో పరిచయం ఉంది. తను నన్ను ఎలాగైనా డైరెక్టర్ చేయాలనుకున్నాడు. అలాగే నేను కూడా నా తొలి సినిమాను నాగశౌర్యతో చేయాలనుకున్నాను. అయితే తనతో సినిమా చేస్తానని చెబితే స్నేహం ఎక్కడ చెడుతుందోనని అనుకుంటుండేవాడిని. అలాంటి సమయంలో 'అఆ' సినిమా పూర్తయిన తర్వాత ఓ రోజు శౌర్య ఫోన్ చేసి వెంకీ కథ తయారు చేసుకో. మనం సినిమా చేద్దామని అన్నాడు. నాకు చాలా సంతోషమేసింది.

క్రైమ్ కామెడీ చేద్దామనుకున్నాం

శౌర్యతో ముందు క్రైమ్ కామెడీ చేద్దామని అనుకున్నాను. అయితే శౌర్య క్రైమ్ కామెడీని కాకుండా మంచి ఫ్యామిలీ సబ్జెక్ట్ చేద్దామని అనడంతో ఎలా చూపించాలని ఆలోచించాను. ఇప్పటి వరకూ శౌర్యను అందరూ కామ్‌గా, లవర్‌బోయ్‌లా చూపించారు. ఫుల్ ఎనర్జిటిక్‌గా చూపిస్తే ఎలా ఉంటుందని ఆలోచించాను. తనకు చెబితే చేసేద్దామని అన్నాడు. అశ్వారావు పేట నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. రెండు బోర్డర్స్ పక్కన ఉండటంతో ఈ కథను చేస్తే బావుంటుందనిపించి కథను తయారు చేశాను.

కష్టమో నష్టమో చేద్దామన్నారు


ముందు ఈ కథను వేరే నిర్మాతకు చెప్పాం. కథ బావుంది. లిమిటెడ్ బడ్జెట్‌లో చేద్దామన్నారు. నాగశౌర్య తల్లిదండ్రులు మంచి కథ అంటున్నారు... వెంకీ మన ఇంటి కుర్రాడే.. శౌర్య నమ్మకం పెట్టుకున్న కథను మనమే ఎందుకు చేయకూడదని ఆలోచించి.. కష్టమో నష్టమో వారే సినిమా నిర్మించడానికి ముందుకొచ్చారు. ఎంతో ఫ్రీడమ్ ఇచ్చి సినిమా అవుట్‌పుట్ బాగా రావడానికి సపోర్ట్ చేసిన వారికి జీవితాంతం రుణపడి ఉంటాను.

'త్రివిక్రమ్‌తో 'అఆ' సినిమా మాత్రమే చేశాను. మంచి అనుబంధం ఏర్పడింది. నిజానికి 'అజ్ఞాతవాసి' సినిమా కూడా చేద్దామని నిర్ణయించుకున్నాను. ఈ సినిమా తర్వాత నువ్వు డైరెక్టర్ అవ్వు వెంకీ, నా సపోర్ట్ నీకు ఉంటుందిలే అని త్రివిక్రమ్ అన్నారు. ఆయన అలా చెప్పిన కొన్ని రోజులకే నాకు డైరెక్టర్‌గా అవకాశం వచ్చింది. ఆయనకు ఈ పాయింట్ చెప్పాను. విని బావుందని అన్నారు. నాకు పూరి, త్రివిక్రమ్ ఇన్‌స్పిరేషన్" అని వెంకీ కుడుమల అన్నారు.

బావుందని రష్మికను తీసుకున్నాం

నేను స్టోరీ డెవలప్‌మెంట్ కోసం చెన్నై వెళ్లాను. అక్కడ కన్నడ సినిమా కిరిక్ పార్టీ చూశాను. సినిమా బావుంది. హీరోయిన్ రష్మిక చాలా బావుందని తీసుకున్నాం.ఇప్పుడు వస్తున్న యువ దర్శకులందరిపై త్రివిక్రమ్ ప్రభావం తప్పకుండా ఉంటుంది. అయితే ఆయన్ని ఇమిటేట్ చేయకూడదు. ప్రస్తుతానికి నెక్స్ట్ చిత్రాలేవీ లేవు.

ఎక్కడ నా ప్రేమ



మనోజ్ నంద, సౌందర్య

మనోజ్ నందం, సౌందర్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎక్కడ నా ప్రేమ'. గాయత్రి సినీ క్రియేషన్స్ సమర్పణలో నంది క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఎస్ రామకృష్ణ, వడ్డే గోపాల్ నిర్మాతలు. ఎండీ హుస్సేన్ దర్శకత్వం వహించారు. ఘన శ్యామ్ సంగీతాన్ని అందించిన ఆడియోను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో విడుదల చేశారు. నిర్మాతలు ఎస్ రామకృష్ణ, వడ్డే గోపాల్ మాట్లాడుతూ 'రెండు తరాల వ్యక్తిత్వాన్ని ఎక్కడ నా ప్రేమ చిత్రంలో చూపిస్తున్నాం. ప్రేమే జీవితంగా బతికే యువత నిర్ణయాలు, పిల్లల బాగు కోసం తపించే తల్లిదండ్రుల ఆరాటాలు కథలో ప్రధాన అంశాలుగా ఉంటాయి. స్వేచ్ఛ కోరుకునే యువతరం, అనుభవాన్ని చూసిన పెద్దలను ప్రతిబింబించేలా పాత్రలుంటాయి. ఆంక్షలు పెట్టిన కుటుంబ సభ్యులను వదిలి వెళ్లిన ఓ అమ్మాయిని కాపాడేందుకు యువకుడు చేసిన ప్రయత్నమే ఈ చిత్రం. ఈ క్రమంలో వీళ్లకు ఎదురయ్యే సంఘటనలు ఆసక్తికరంగా ఉంటాయి. మంచి ప్రేమ కథతో సినిమా సాగుతుంది. ప్రేమికుల్లోని ఆకర్షణ, మనస్పర్ధలను దర్శకులు వినోదాత్మకంగా తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. ఫిబ్రవరి 22న విడుదల చేస్తున్నాం' అని అన్నారు.

హిందీలో 'సిమ్బా'గా టెంపర్



ఎన్టీఆర్ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టెంపర్'ను బాలీవుడ్‌లో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. దర్శకుడు రోహిత్ శెట్టి ఈ సినిమా హక్కులను పొందారు. ఈ విషయమూ తెలిసిందే. ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రను రణవీర్ సింగ్ చేయనున్నాడు. కాజల్‌గా క్యారెక్టర్‌లో శ్రీదేవి తనయ జహ్నవి కపూర్ నటిస్తుందట. సినిమాలో కాస్తా అటు ఇటూ మార్పులు చేసి జహ్నవి కపూర్ పాత్రకు ప్రాముఖ్యం ఇచ్చేలా కథను డిజైన్ చేస్తున్నారట రోహిత్ శెట్టి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

'గ్రామీ'లో బ్రూనో 'మ్యాజిక్'



గ్రామీ అవార్డుల వేడుకలో సంగీత కచేరి



బ్రూనో మార్స్



భార్యతో మోర్గాన్‌తో క్రిష్ స్టెప్లటన్

న్యూయార్క్ నగరం సంగీత కళాకారులతో కళకళలాడింది. తమ గానాలతో గ్రామీ అవార్డ్స్ వేడుక సందడిగా మారింది. 60వ గ్రామీ అవార్డుల పురస్కారోత్సవాన్ని న్యూయార్క్‌లోని మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. బ్రూనో మార్స్ అత్యధికంగా ఆరు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఆయన చేసిన '24 మ్యాజిక్' మూడు పురస్కారాలను గెలుచుకుంది. ఉత్తమ ఆల్బమ్‌గానూ, రికార్డు ఆఫ్ ది ఇయర్‌గానూ, బెస్ట్ ఆర్ అండ్‌బీ ఆల్బమ్‌గానూ '24 మ్యాజిక్' నిలిచింది. మార్స్ ఆలాపించిన 'దట్స్ వాట్ ఐ లైక్' ఆల్బమ్ మరో మూడు పురస్కారాలను సొంతం చేసుకుంది. సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గానూ, బెస్ట్ ఆర్‌అండ్‌బీ పెర్ఫార్మెన్స్‌నూ, బెస్ట్ ఆర్‌అండ్‌బీ సాంగ్‌గానూ ఈ ఆల్బమ్ అవార్డులను దక్కించుకోవడం విశేషం. మరో రెండేసి అవార్డులు ఎడ్ షీరన్‌కు, రాపర్ కెండ్రిక్ లామర్‌కు వరించాయి. 'యు వాంట్ ఇంట్ డార్కర్' అన్న నృత్య ప్రదర్శనకు బెస్ట్ రాక్ పెర్ఫార్మెన్స్ అవార్డును దక్కింది. దీన్ని దాని రూపకర్త లెనార్డ్ కోహెన్‌కు మరణానంతరం ప్రకటించారు. ఈ అవార్డులను ది రికార్డింగ్ అకాడమీ ఏటా అందజేస్తుంది. ముఖ్యంగా ఇంగ్లీష్ మ్యూజిక్ ఇండస్ట్రీలో వారికి గ్రామీ అవార్డులు అందజేస్తున్నారు. సినిమా రంగానికి అకాడమీ అవార్డులు, టెలివిజన్‌కు ఎమ్మీ అవార్డులు, థియేటర్స్‌కు టోనీ పురస్కారాలు ఎలాగో సంగీతం రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న వారిని గుర్తించి ఏటా ఈ పురస్కారాలతో సన్మానిస్తారు. ఉత్తమ దేశీయగా ఆల్బమ్‌గా చెర్రీస్ స్టప్లీటోన్ చేసిన 'ఫ్రమ్ ఏ రూమ్ : వాల్యూమ్ 1', బెస్ట్ ర్యాప్ ఆల్బమ్‌గానూ, కెన్రిక్ ల్యామర్‌ది 'డామ్న్', బెస్ట్ సోలో పెర్ఫార్మెన్స్ గానూ, 'షేప్ ఆఫ్ యు'లో చేసిన అలీసియా కెరా బెస్ట్ న్యూ ఆర్టిస్టుగా, బెస్ట్ పాప్ డుయో/గ్రూప్ పెర్ఫార్మెన్స్ 'ఫీల్ ఇట్ స్టిల్'గా నిలిచాయి. బెస్ట్ ర్యాక్ ఆల్బమ్ 'ఎ డీపర్ అండర్ స్టాండింగ్' ఆల్బమ్స్ అవార్డు వరించింది.



రిహన్నా



గాయకుల గీతాలపన



అలిసియా క్యార

నాకు సినిమా ఒక్కటే తెలుసు

మోహన్ బాబు



శ్రియ, మంచు విష్ణు, సుబ్బరామిరెడ్డి, నిర్మల దేవి, మంచు లక్ష్మి, మోహన్ బాబు, మదన్, అనసూయ తదితరులు

మోహన్ బాబు ప్రధాన పాత్రలో నటించిన 'గాయత్రి' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో నిర్వహించారు. దీనిలో భాగంగానే ఆడియో సీడీలను కూడా ఆవిష్కరించారు. బిగ్ సీడీని మోహన్ బాబు విడుదల చేశారు. అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్‌పై నిర్మిస్తున్న చిత్రమిది. మదన్ దర్శకుడు. తమన్ సంగీతం అందించారు. ఈ చిత్రం ఫిబ్రవరి తొమ్మిదో తేదీన విడుదల కానుంది.

మోహన్‌బాబు మాట్లాడుతూ 'పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయని అంటుంటాం. అలాగే సినిమాను కష్టపడి తీయగలుగుతాం. కానీ జయాపజయాలు ప్రేక్షకుల చేతిలోనే ఉంటుంది. నాకు తెలిసింది సినిమా ఒక్కటే. ఇంకేం తెలియదు. నటుడిగా పుట్టాను, నిర్మాతగా సినిమాలు చేశాను. ఇవి తప్ప మాకు వ్యాపకాలు లేవు. గాయత్రి సినిమాను కష్టపడి చేశాం. ఫలితం మాత్రం దేవుడి చేతిలోనే. ఎంత అణిగిమణిగి, సౌమ్యంగా ఉంటే అంత గొప్ప ఆశీర్వాదాన్ని దేవుడు మనకు ప్రసాదిస్తాడు. విర్రవీగితే ఓ తొక్కుతొక్కుతాడంతే. నిర్మాతగా 60కి పైగా సినిమాలు చేశాను. ఎన్నో జయాలు వచ్చాయి. అలాగే అపజయాలూ వచ్చాయి. జయం వచ్చినప్పుడు పొంగిపోలేదు. అపజయం వచ్చినప్పుడు కుంగిపోలేదు. ఐదు సినిమాలు హిట్టై ఒక సినిమా ఫ్లాపయినా, ఐదు సినిమాల హిట్టు పోతుంది. నిర్మాత పని ఎంత కష్టమో నాకుతెలుసు. నన్ను నటుడిగా పరిచయం చేసింది మా గురువు దాసరి. ఆయన నాకు ఎన్ని పాత్రలు ఇచ్చారో నాకు తెలుసు. ఆయన లేకపోవడం పెద్ద లోటు. ఆయనెంత గొప్ప దర్శకుడో ఈ జనరేషన్‌కు తెలియదు. ఆయన నేర్పించిన డైలాగ్స్‌తోనే ఈ రోజు శభాష్ అని అనిపించుకుంటున్నాను. మహానటుడు ఎన్టీఆర్ తర్వాత డైలాగ్ మోహన్‌బాబు బాగా చెప్పగలడని పేరొచ్చిందంటే, ఆ క్రెడిట్ దాసరిదే దక్కుతుంది' అని అన్నారు.

బి.గోపాల్ మాట్లాడుతూ '560 సినిమాలు చేయడం అంటే మామూలు విషయం కాదు. ఆయన నటనతో బాగా నవ్విస్తారు, ఏడిపిస్తారు. ఎమోషనల్‌గా మెప్పిస్తారు. ఆయన హీరోయే కాదు, 65 సినిమాలు తీసిన నిర్మాత, విద్యావేత్త. పేద విద్యార్థులకు 25 శాతం ఫ్రీ ఎడ్యుకేషన్ ఇస్తున్నారు. గ్రాయత్రి టైటిల్ చాలా పవర్‌ఫుల్ టైటిల్' అని పేర్కొన్నారు.

దర్శకుడు మదన్ మాట్లాడుతూ '2017.. నా జీవితంలో గొప్ప ఏడాది. మోహన్‌బాబు అత్యంత అరుదైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. క్లారిటీ ఉంటే తప్ప ఆయనతో ట్రావెల్ చేయలేం. ఆయనతో అసోసియేట్ కావడం అంటే ప్రొఫెసర్‌తో విద్యార్థులు పనిచేసినట్లే. అలాంటి వ్యక్తి మళ్లీ పుట్టడు. కుండ బద్ధలు కొట్టినట్లు మాట్లాడేస్తారు. ఆయన చూపించే ప్రేమ ముందు మనం కరిగిపోతాం. ఆయనతో కలిసి పనిచేయడం గ్రేట్. మనుషులను చదివిన వాడు వేదాంతైనా, వ్యాపారైనా అవుతాడు లేదా మోహన్‌బాబులా మహానటుడన్నా అవుతాడు. ఎదుటివాడి మనస్తత్వాన్ని చదివేయగలరు. ఆయనతో మరచిపోలేని అనుభూతులున్నాయి' అని అన్నారు.

డా॥ స్పెషలిస్ట్





ప్రపంచంలో ప్రతి క్షీరదానికీ తొలి పోషణ ఇచ్చేవి తల్లి పాలే. మనిషి ఎంత వైజ్ఞానికంగా పురోగమించినా, శిశువు ఆరోగ్యానికి తల్లి పాలే తొలి రక్షాకవచంగా నిలుస్తాయన్నది ఎవరూ విస్మరించలేని వాస్తవం. శిశువుకు తొలి ఆరునెలల్లో తల్లిపాలను మించిన ఆహారం ఎక్కడా లేదు. ఇందులోనే శిశువు పోషణకు అవసరమైన విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. శిశువులో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే గుణాలు కూడా తల్లి పాలలోనే ఉంటాయి. రకరకాల అపోహలతో శిశువుకు పాలివ్వని తల్లులు తమ అనారోగ్యాన్ని తాము ఆహ్వానించుకోవడంతో పాటు తమ పిల్లల్నీ దుర్బలులుగా మార్చేస్తున్నారు. తల్లి పాలు ఎలా ఇవ్వాలి? వాటివల్ల శిశువుకు ఆరోగ్య ప్రయోజనాలు.. తల్లి పాలలో ఏముంటాయి?..తదితర విశేషాలే ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్' ...

తల్లిపాలే తొలి పోషణ

ఏ శిశువుకైనా ప్రథమ ఆహారం, ప్రాథమిక ఆహారమూ తల్లి పాలే. అందువల్ల సహజ ప్రసవం ద్వారా బిడ్డను కన్న తల్లి గంట వ్యవధిలోనే బిడ్డకు పాలివ్వాలి. సిజేరియన్ ద్వారా బిడ్డను కన్న తల్లి నొప్పి తగ్గిన తర్వాత నాలుగైదు గంటల లోపలే శిశువుకి పాలివ్వొచ్చు. తల్లి పాలు సక్రమంగా తాగే శిశువు ఆరోగ్యంగా, సరైన బరువుతో పెరగడానికి అవకాశం ఉంటుంది. తల్లి పాలు శిశువుకు చక్కగా జీర్ణమవుతాయి. దీంతో పిల్లలకు విరోచనాలు సక్రమంగా జరగడమే కాకుండా ఎటువంటి ఆరోగ్య సమస్యలూ ఎదురుకావు. తల్లిపాలల్లో పోషకాలన్నీ అవసరమైన మేరకు ఉంటాయి. శిశువు ఆరోగ్యంగా పెరగడానికి ఇవి దోహదం చేస్తాయి.

తల్లి పాలలో ప్రొటెక్టివ్ యాంటీబాడీస్

తల్లి పాలలో ప్రొటెక్టివ్ యాంటీబాడీస్ ఉంటాయి. అందువల్ల వీటిని తగినంతగా తాగే శిశువుకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్లూ రావు. అలర్జీలూ దరిచేరవు. శిశువులో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. కొందరు తల్లులకు సరిగ్గా పాలు రావు. అటువంటి వారు వచ్చిన మేరకు శిశువుకు పాలిచ్చి, మరీ ఇంకా అవసరం పడితే బాటిల్‌తో పాలు పట్టొచ్చు. అయితే తల్లిపాలు, బాటిల్‌లోని పాలతో ఎప్పటికీ సమానం కావు. బ్రెస్ట్ ఫీడింగ్ చేస్తుంటే స్త్రీలకు కొన్ని అనారోగ్య సమస్యలు రావు. పాలివ్వడం వలన తల్లిలో యుట్రెస్ తిరిగి మామూలు సైజుకు చేరుకుంటుంది. శిశువుకు తనపాలు కాకుండా బయటపాలు సిద్ధం చేసివ్వాలంటే కొంత సమయం పడుతుంది. అవి అంత శక్తిమంతం కాకపోవడం, అపరిశుభ్రంగా ఉండడం వంటి కారణాల వల్ల శిశువుకు ఏవిధంగా చూసినా మేలైనవి కావు. పూర్తిగా తల్లి పాలు ఇవ్వకపోతే ఆ బిడ్డకు ఎదిగే క్రమంలో మోకాళ్ల వంకర్లు తిరగడం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

తల్లికి అవగాహన అవసరం

తొలి కాన్పు జరగక ముందే అంటే ఏడెనిమిది నెలల గర్భంతో ఉన్నప్పటి నుంచే పుట్టబోయే శిశువుకు పాలిచ్చే విషయంపై తల్లిలో అవగాహన అవసరం. అందుకోసం వారిని మానసికంగా సిద్ధం చేయాలి. పుట్టిన వెంటనే బిడ్డకు తప్పనిసరిగా పాలివ్వాలని చెప్పాలి. ఈ విషయంపై వారికి ఏవైనా



అపోహలుంటే వాటిని తొలగించే ప్రయత్నాలు చేయాలి. బిడ్డకు పాలిచ్చే బ్రెస్ట్ నిపుల్‌ను సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. నిపుల్ వెనక్కి ఉంటే అప్పుడే పుట్టినబిడ్డ పాలు తాగడానికి ఇబ్బందిగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించి, దీనిని సరిచేయాలి. శిశువుకి పాలిచ్చేటప్పుడు నిపుల్ చుట్టూ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తల్లికి అవగాహన కలిగించాలి.

కూర్చొనే భంగిమలోనే పాలు ఇవ్వాలి

తల్లులు కూర్చొన్న భంగిమలోనే తమ పిల్లలకు పాలు ఇవ్వాలి. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ప్రసవించినవారు ప్రారంభంలో పడుకొని పాలిచ్చినా.. నొప్పి తగ్గిన తర్వాత కూర్చొనే పాలివ్వాలి. ఇలా తాగించడం వల్లే శిశువు కడుపు నిండా పాలు తాగడానికి వీలవుతుంది. పాలు తాగిన తర్వాత బిడ్డను భుజంపై వేసుకొని కొద్దిగా వీపుపై నిమిరితే పాలతో పాటు వెళ్లే గాలి మూలంగా వాంతులు కాకుండా ఉంటాయి. ఈ విధంగా చేస్తే శిశువుకు పాలు జీర్ణం కావడం ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కొన్నిసార్లు తల్లి పాలిచ్చినా ఇంకా ఏడుస్తుంటే శిశువుకు పాలు సరిపోలేదన్న విషయాన్ని గమనించి, అవసరమైతే బయటి పాలు తాగించాలి.

ప్రశాంతంగా ఉండాలి

పిల్లలకు పాలివ్వడంలో ఎటువంటి ఆందోళన పడకూడదు. తల్లి ప్రశాంతంగా ఉంటేనే తన బిడ్డకు సక్రమంగా పాలివ్వగలుగుతుంది. ప్రసవం జరిగిన తర్వాత కొంతమందికి పాలు తక్కువగా వస్తాయి. ముఖ్యంగా వయస్సు పెరిగిన తర్వాత ఆలస్యంగా గర్భం ధరించి, ప్రసవించే వారిలో పాలు రావడం తగ్గుతుంది. ఎక్కువగా 35 సంవత్సరాల తర్వాత కాన్పు జరిగే వారిలో ఈ సమస్య ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగా గర్భం ధరించడం వల్ల పుట్టే శిశువుకు సరిగా పోషకాలతో గల పాలు అందించడానికి అవకాశం ఉంటుంది. కొంతమంది మహిళల్లో కొన్నిరకాల ఆరోగ్య సమస్యలుంటే పాలు సరిగ్గా రావు. రక్తపోటు, గుండె సమస్యలు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. వీరికి తగిన చికిత్స అందించాలి.

ఎంతకాలం పాలివ్వాలి?

శిశువు జన్మించిన తర్వాత గంట నుంచి రెండేళ్ల వరకూ తల్లిపాలు ఇవ్వొచ్చు. అయితే ఇందులో తొలి ఆరునెలల పాటు మాత్రం తప్పనిసరిగా పాలు ఇవ్వాలి. ఐదో నెల నుంచి పాలతో పాటు పండ్లు, పిల్లలకు ఇచ్చే ఇతర పోషకాహారాన్ని అదనంగా అందజేయడం అవసరం. పాలిచ్చే సమయంలో శిశువుకు ప్రతి రెండు, మూడు గంటలకోసారి తప్పనిసరిగా తల్లి పాలివ్వాలి. ఒకవేళ శిశువు గాఢ నిద్రలో ఉంటే, నాలుగు గంటలకైనా పాలివ్వాలన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. తల్లి బిడ్డకు కనీసం ఐదు నిమిషాలైన పాలివ్వాలి. పెరుగుతూ ఉన్న శిశువుకైతే పది, పదిహేను నిమిషాల పాటు పాలివ్వడం అవసరం. కడుపునిండా పాలు తాగగానే పిల్లలు వెంటనే పడుకుంటారు. ఏడో నెల నుంచి, శిశువుకు పోషకాహార అవసరాలను తీర్చడం కోసం తల్లిపాలు మాత్రమే సరిపోవు. తల్లి పాలతో పాటు వైవిధ్యమైన పోషకాహారం అందివ్వాలి. సకాలంలో, తగిన మొత్తంలో, అనుబంధ ఆహారాలను ఇవ్వడం ప్రారంభించాలి. ఆరు నెలల తరువాత బిడ్డకు రోజుకు మూడు నుంచి నాలుగుసార్లు ఆహారం ఇవ్వాలి. అలానే తల్లిపాలు ఇవ్వడాన్నీ ఏడాది వరకూ కొనసాగించాలి. రెండేళ్లపాటూ ఇవ్వొచ్చు.

పాలు తగినంత లేకపోతే !

పాలు తగినంతగా లేని బాలింతలకు క్యాల్షియం, ఇతర మందులు, సంబంధిత పోషకాహారం అందజేయాలి. ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన ఆహారంతో పాటు పాలు, బ్రెడ్, రొట్టెలు నట్స్ వంటివి తప్పనిసరిగా తీసుకోవాలి. తల్లికి తగినంత నిద్ర ఉండాలి. ఎప్పటికప్పుడు నీళ్లు బాగా తాగాలి. ఇవన్నీ సక్రమంగా ఉన్నప్పుడు తల్లిబిడ్డకు తగినన్ని పాలివ్వగల్గుతుంది. తల్లి పాలు కడుపు నిండా తాగిన పిల్లలు అవసరమైన బరువు పెరుగుతారు.

తల్లిపాలలో ఉండేదేమిటి?

తల్లిపాలలో ఉండే పోషకాలు ఏమిటో చాలామందికి తెలియవు. తల్లిపాలలో ఎక్కువ భాగం నీళ్లే ఉంటాయి. 100 మి.లీ పాలలో ఒక గ్రాము ప్రోటీన్లు, 100 ఎంఎల్ పరిమాణంలో 3.5 గ్రాముల కొవ్వులు, ప్రతి 100 ఎంఎల్‌కూ 7 గ్రాముల ల్యాక్టోజ్ ప్రోటీన్లు ఉంటాయి. అవి చాలా తేలిగ్గా జీర్ణమవుతాయి. తల్లిపాలలో కొవ్వులు కూడా చాలా పొడవైన ఫ్యాటీ యాసిడ్ చైన్ల దూరంలో ఉండి మెదడుకు మేలు చేసే పోషకాలతో ఉంటాయి. ల్యాక్టోజ్‌లో గెలాక్టొసైడ్ అనే పోషకం మెదడు ఎదుగుదలకు బాగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా తల్లి పాలు పట్టించడం వల్ల ఇటు బిడ్డకు మాత్రమే కాకుండా తల్లికి కూడా మేలే. ముఖ్యంగా బిడ్డకు పాలు ఇవ్వడం వలన ఆ తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ఆస్కారం ఉండదు. ప్రసవం జరిగిన వెంటనే తల్లి ముర్రుపాలలో జింక్, క్యాల్షియం, విటమిన్లు ఉంటాయి. తల్లిపాలే ఇవ్వడం వల్ల డయేరియా, న్యూమోనియా వంటి సాధారణ శిశు రుగ్మతల నుంచి రక్షణ లభిస్తుంది. దీంతో శిశుమరణాలు తగ్గుతాయి. అస్వస్థత సమయంలో వేగంగా కోలుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది.

సమస్యలకు తగిన చికిత్సలు

బ్రెస్ట్‌లో ఇన్ఫెక్షన్లు, గడ్డలు ఉన్న తల్లి బిడ్డకు సరిగా పాలివ్వలేదు. ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు వెంటనే వాటికి చికిత్స చేయించుకోవాలి. బిడ్డకు జలుబు ఉంటే ముక్కు పట్టేసి, పాలు తాగడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. జలుబు ఉన్న పిల్లలకు వెంటనే వైద్యం చేయించాలి. తల్లిలో ఏదైనా ఇన్ఫెక్షన్ ఉంటే పాల ద్వారా అది బిడ్డకు సోకవచ్చు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తల్లి చికిత్సలు చేయించుకోవాలి. తీవ్రమైన గుండె వ్యాధులతో బాధపడుతున్న తల్లులూ బిడ్డకు పాలివ్వలేరు. కొన్నిసార్లు ప్రసవ సమయంలో షాక్‌తో తీవ్ర ఆందోళనకు గురైనవారూ తమ పిల్లలకు సక్రమంగా పాలివ్వలేరు. ఇటువంటి వారు వెంటనే వైద్యం చేయించుకోవాలి.



డాక్టర్ ఎ.వి.సుబ్బారావు,
ఎండి (పిడియాట్రిక్స్),
గాయత్రి హాస్పిటల్స్,
సూర్యారావు పేట, విజయవాడ.

అపోహల్ని నమ్మొద్దు

శిశువుకు తల్లిపాలు అందించే విషయంలో చాలా రకాల అపోహలు ప్రచారంలో ఉన్నాయి. కానీ వాస్తవాలు ఇవీ.

- పుట్టగానే శిశువుకు ముర్రుపాలు ఇవ్వాలి. గ్లూకోజు నీళ్లు, తేనె, ప్యాకెట్ పాలు, ఆవుపాలు నాకించటం వంటివి చేయకూడదు.
- ఆరు నెలలు దాటిన పిల్లలకు కొందరు కేవలం ఆవు, గేదె పాలనే ఎక్కువగా ఇస్తున్నారు. ఈ పాలలో ఇనుము మోతాదు తక్కువ. ఈ పాలు సమతులాహారం కాదు. ఇవి తాగే పిల్లలు బొద్దుగా చూడడానికి బాగానే ఉంటారు కానీ వీరిలో రక్తహీనత ఉంటుంది.
- పిల్లలకు జబ్బు చేసినప్పుడు తల్లిపాలనే ఇష్టపడి మిగతా ఆహారాన్ని పెద్దగా తీసుకోరు. అయితే ఎంత జబ్బు చేసినా మిగతా ఆహారం తీసుకోగలిగితే తప్పకుండా ఇవ్వాలి.
- పిల్లలు ఒకట్రెండు సార్లు మల విసర్జనకు వెళ్లగానే చాలమంది తల్లిపాలు ఆపేస్తున్నారు. ఇది మరో అపోహ. అవుతాయి.
- శిశువు ఆరోగ్యానికి పాలసీసా మొదటి శత్రువు. సకల జబ్బులకూ అది మూలం. ఏటా ఐదు లక్షల మంది పిల్లలు సీసాల వల్ల చనిపోతున్నారు.
- ఎదిగే శిశువుకు అదనపు ఆహారం ఇంట్లో ఉన్న పదార్థాలతోనే తయారుచేసుకోవాలి. వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసి, మార్కెట్లో అమ్మే వాటిని పెట్టకూడదు. 'ఇన్‌ఫ్యాంట్ మిల్క్ సబ్‌స్టిట్యూట్' చట్టం ప్రకారం ఎవరైనా వాణిజ్యంగా తయారుచేసిన పాలు, అదనపు ఆహారం గురించి ప్రకటనలు ఇవ్వటం, అది తల్లిపాలతో సమానమని చెప్పటం, దాన్ని ప్రోత్సహించడం శిక్షార్హమైన నేరం.
- శిశువుకు పాలు సరిపోవడం లేదన్నది పెద్ద అపోహ. నెలనెలా ఎదుగుదల బాగుండి, గ్రోత్‌ఛార్ట్‌లో పెరుగుదల చక్కగా ఉండి, శిశువు హాయిగా నిద్రపోతూ రోజుకు ఆరుసార్లు మూత్రం పోస్తుంటే పాలు సరిపోతున్నాయనే అర్థం. శిశువు పెరుగుదలను కచ్చితంగా చెప్పే 'గ్రోత్‌ఛార్ట్'ని ప్రతి తల్లీతండ్రీ అనుసరించాలి.
- కొందరు తల్లులు తమ పిల్లలకు అవసరానికి మించి ఎక్కువగా పాలిస్తారు. ఇది మంచిదికాదు. దీనివల్ల శిశువుకు వాంతులు దీంతో పిల్లల్లో పోషకాలు లోపిస్తాయి. బరువు తగ్గిపోయి, బలహీన పడతాడు. వ్యాధి మరింతగా బాధిస్తుంది. కాబట్టి నీళ్ల విరేచనాలు, న్యుమోనియా వంటివి వచ్చినా సరే తల్లిపాలు పట్టాలి.
- మార్కెట్లో లభించే పాలు, పాలపొడులు ఏవీ తల్లి పాలకు ఎలాంటి ప్రత్యామ్నాయమూ కావు. అందమైన ప్రకటనలతో జరిగే అశాస్త్రీయ ప్రచారాలను ఏమాత్రం నమ్మకూడదు.
- పోషకాహార లోపంతో సన్నగా, నీరసంగా ఉన్న తల్లులు, రొమ్ములు చిన్నగా ఉన్న తల్లులు పిల్లలకు తగినంత పాలివ్వలేరన్నది అపోహ మాత్రమే. పాలకూ, రొమ్ముల సైజుకూ సంబంధం లేదు.
- ఎంత ఒత్తిడిలో ఉన్నా తల్లులు శిశువుకు పాలివ్వగలరు. అందులో సందేహం లేదు. ఒత్తిడిలో ఉన్నా తల్లికి పాలు తయారవుతుంటాయిగానీ అవి బయటకు సరిగా రావు. దీనిని 'లెడ్‌డౌన్ రిఫ్లెక్స్' అంటారు. శిశువు రొమ్మును చీకినప్పుడు అవి బయటకు వచ్చేస్తాయి.



పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ!
మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!


చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



ఏ నీడ దేనిది?



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని పువ్వులు వాటి నీడలు ఉన్నాయి. వాటిలో ఏ నీడ ఏ పువ్వుదో కనిపెట్టండి!

పొడుపు కథ

ఒక కాపే కాసేది,
గెల పండ్లనిస్తుంది,
విస్తర్ల నిస్తుంది,
కట్టెలు లేని చెట్టు అది..?

జోక్ :

టీచర్ : రవి ! భక్త రామదాసు అసలు పేరేంటో చెప్పు?
రవి : అక్కినేని నాగార్జున టీచర్..!

పొదగడం అంటే ఏమిటి?



పిల్లలూ..! తల్లి బిడ్డను తొమ్మిది నెలలు కడుపులో మోసి తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తుంది. అదే పక్షులైతే ఎలా బిడ్డకు జన్మనిస్తాయి అనే సందేహం మీకు ఎప్పుడైనా వచ్చిందా? ఉదాహరణకు కోడి గురించి చెప్పుకుందాం. కోడి తన గుడ్లమీద కూర్చోవడం మీరు చూసే ఉంటారు. అలా గుడ్లమీద కూర్చుని వాటికి వెచ్చదనాన్ని కల్పించడాన్నే పొదగడం అంటారు. పక్షులు పొదగడం అంటే గుడ్డులో ఉండే పిండం సజీవంగా ఉండి, అది పిల్ల రూపంలో బయటకు



రావాలంటే దానికి తేమ, వెచ్చదనం, ఆహారం, గాలి అవసరం. తల్లి నుంచి గుడ్డుకు వెచ్చదనంతో బాటు, రక్షణా లభిస్తుంది. గుడ్డు పెంకుమీద కంటికి కనిపించనంత సూక్ష్మరంధ్రాలు ఉంటాయి. ఈ సూక్ష్మ రంధ్రాల ద్వారా గుడ్డు లోపలి పిండం గాలి పీల్చుకోగలుగుతుంది. ఇక గుడ్డులోని తెల్లసొన తేమను, పచ్చసొన ద్వారా ఆహారాన్ని గ్రహించిన పిండం నిర్ణీత సమయం తర్వాత గుడ్డుపైన ఉండే పెంకును పగులగొట్టుకుని మెల్లగా పిల్ల బయటకి వస్తుందన్న మాట. కోడిగుడ్డు పిల్లగా పరివర్తనం చెందడానికి కనీసం 21 రోజులు పడుతుంది. పక్షులన్నీ ఇదే విధంగా తమ బిడ్డలకు జన్మనిస్తాయి. ★



వాన - ప్రకృతి

చిట్టి కవిత

చిటపట చినుకులు రాలేను....
జరజర నీళ్లు పారేను..
మట్టి బురదలా మారేను..
రైతన్న కళ్ళల్లో కాంతులు నిండేను..
చకచక వాగులు పారేను..
వంకలు తిరుగుతు దాటేను...
చెరువులో తాండవమాడెను...
పశుపక్ష్యాదులు మురిసేను..
చెరువులు గట్లు దూకేను..
తూములు నీటిని వదిలేను...
రైతన్న మడికి చేరేను..
ప్రకృతి మాత పులకరించేను...
నెమళ్ళు నాట్యం ఆడేను..
పసిడి రాసులు పండేను...
నింగి, నేల హర్షించేను...



ఆళ్ళ కావ్య
8వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.

ఐపిఎల్-11లో
అత్యధిక ధర కోహ్లీకే..



(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)
ఈ సీజన్‌లో అత్యధిక ధర చెల్లించిన క్రీడాకారుల జాబితాలో భారత సారథి విరాట్ కోహ్లీ ముందున్నాడు. అతనిని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచేజీ 17 కోట్లు చెల్లించి అంటిపెట్టుకుంది. అతని తర్వాతి స్థానం ధోనీ, రోహిత్ శర్మ, రిషబ్ పంత్‌లది. ధోనీని చెన్నై సూపర్ కింగ్స్, రిషబ్ పంత్‌ను ఢిల్లీ డేర్ డెవిల్స్, రోహిత్ శర్మను ముంబయి ఇండియన్స్ 15 కోట్లు చొప్పున చెల్లించనున్నాయి.

ఢిల్లీ డేర్ డెవిల్స్ కోచ్‌లుగా హోప్, ఘోష్

ఢిల్లీ డేర్ డెవిల్స్ బౌలింగ్ కోచ్‌గా ఆస్ట్రేలియాకు చెందిన మాజీ ఆల్‌రౌండర్‌ను జేమ్స్ హోప్, భారత్‌కు చెందిన ఘోష్‌లను నియమించింది. కుడిచేతి వాటం బౌలర్, బ్యాట్స్‌మన్ అయిన హోప్ ఆస్ట్రేలియా తరఫున 84 వన్డేలలో పాల్గొని 1,326 పరుగులు సాధించడమేగాక 67 వికెట్లు సాధించాడు. 63 పరుగుల అత్యధిక స్కోర్‌తోపాటు మూడు అర్ధసెంచరీలు సాధించి ఉన్నాడు.

బౌలర్లకు ప్రాధాన్యతనిచ్చిన కోల్‌కతా

ఇదిలా ఉంటే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు బ్యాట్స్‌మెన్‌లకంటే బౌలర్లకే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది. ఆ జట్టు సునీల్ నరైన్‌ను (12.5 కోట్లు) అంటిపెట్టుకుంది. స్టార్క్, జాన్సన్, రసేల్, చావ్లా, వినయ్‌కుమార్ వంటి బౌలర్లకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. బ్యాట్స్‌మెన్‌లలో చెప్పుకోదగ్గ బ్యాట్స్‌మన్ ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంస బ్యాట్‌మన్ లిన్ ఒక్కడే. అయితే ఆ జట్టు ఏకంగా రూ.12 కోట్లు వెచ్చించి (దినేష్ కార్తీక్, రాబిన్ ఊతప్ప) ఇద్దరు వికెట్ కీపర్లను కొనుగోలు చేసి సంచలనం సృష్టించింది.

సమతూకంలో ముంబయి ఇండియన్స్

ముంబయి ఇండియన్స్ జట్టు సమతూకంతో కనబడుతోంది. రోహిత్‌శర్మ, సౌరభ్ తివారి, కృనాల్, లూయిస్, బ్యాటింగ్‌లో ఉద్ధండులు... బౌలింగ్‌లో బుమ్రా, తారే, కిషన్, కటింగ్‌లతో పటిష్టంగా ఉంది... ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, పోలార్డ్, డుమినిలను కొనుగోలు చేసి పటిష్టంగా ఉంది.

కీపర్‌ను కొనుగోలు చేయని పంజాబ్

ఇండియన్ ప్రిమియర్ లీగ్ వేలంలో కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ జట్టు ఒక్క వికెట్ కీపర్‌ను కూడా కొనుగోలు చేయలేదు. దీంతో పంజాబ్ అభిమానులు ఆట సమయంలో ఎవరిని వికెట్ కీపర్‌గా ఉంచుతారో అని డైలామాలో పడిపోయారు. ముఖ్యంగా కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు ఫ్రాంచేజీ యజమానురాలు ప్రీతీ జింతా ఈ వేలంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. అయితే పంజాబ్ జట్టులో అన్ని విభాగాలకు చెందిన ఆటగాళ్లను కొనుగోలు చేశారుగానీ వికెట్ కీపర్‌ను కొనుగోలు చేయడం మరిచారు.

టీనేజ్ కోటీశ్వరులు

అండర్-19 ప్రపంచకప్ ఆడుతున్న కొందరు ఆటగాళ్ళు ఈసారి ఐపిఎల్ వేలంలో కొనుగోలు చేయబడ్డారు. దీంతో కొందరు ఒక్కసారిగా కోటీశ్వరులుగా మారిపోయారు వారిలో

1. ముజీబ్ జాద్రాన్ (అఫ్గానిస్థాన్) రూ.4 కోట్లు, 2. కమలేశ్ నాగర‌'కోటి' (భారత్) : రూ.3.2 కోట్లు 3. శివమ్ మావి (భారత్) : రూ.3.2కోట్లు, 4. శుభ్‌మన్ గిల్ (భారత్) : రూ.1.8 కోట్లు 5.పృథ్వీ షా (భారత్) : రూ.1.2కోట్లు



జెప్పియర్ చెన్నై, కర్నాటక రాష్ట్ర జట్ల మధ్య మ్యాచ్

ఉత్కంఠగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)
గుంటూరులోని ఎన్‌టిఆర్ స్టేడియంలో నాలుగు రోజులుగా స్థానిక ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మారెళ్ల కైలాష్‌నాథ్‌రెడ్డి మెమోరియల్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ఉల్లాసంగా, ఉత్కంఠగా సాగుతున్నాయి. సోమవారం మహిళా విభాగంలో జరిగిన మొదటి మ్యాచ్ జెప్పియర్ చెన్నై, కర్నాటకల మధ్య తీవ్ర ఉత్కంఠగా సాగింది. జెప్పియర్ జట్టులోని రాఖి తన పదునైన డ్రాప్ షాట్‌లు, సమర్ధవంతమైన సర్వీస్‌లతో ప్రత్యర్థి జట్టుని హడలెత్తించింది. 27-29, 25-8, 25-23, 25-15 సెట్ల తేడాతో జెప్పియర్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈ మ్యాచ్‌లో కర్నాటక జట్టు వరుసగా 10 పాయింట్లు సాధించడం ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌లలో హైలెట్‌గా నిలిచింది. పోటీల విరామ సమయంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి.



టీ20లకు మన్రో ఎంపిక

క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే ట్రయాంగులర్ టీ20 సిరీస్‌కు మన్రో ఎంపికయ్యాడు. సోమవారం న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించిన జాబితాలో మన్రోను తిరిగి తీసుకున్నారు. ఫిబ్రవరి 3, 16న ఆసీస్‌తో, 13, 18న ఇంగ్లండ్‌తో కివీస్‌జట్టు టీ20ల్లో తలపడనుంది. ఇటీవల స్వదేశంలో పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌లో భుజం నొప్పి కారణంగా మూడో టీ20నుండి వైదొలిగాడు.

ఐసీసీ అండర్-19 ప్రపంచకప్
నేడు పాక్‌తో భారత్ ఢీ

భారత్ ఇప్పటికే మూడు సార్లు ప్రపంచకప్ గెలవగా... పాక్ రెండుసార్లు కైవసం చేసుకుంది. దాయాది దేశాలు కావడంతో పోరుపై అమితాసక్తి ఉండడం ఖాయం. వరుస విజయాలతో సెమీస్ చేరిన టీమిండియా పాక్‌ను ఓడించడం పెద్ద కష్టమేమీ కాదు గానీ అతి విశ్వాసానికి పోతే మాత్రం పరాభవం తప్పదు!



భారత్ కెప్టెన్ పృథ్వీషా

క్రైస్ట్‌చర్చ్ (న్యూజిలాండ్) : అండర్-19 ప్రపంచకప్‌లో భారత యువజట్టు దాయాది పాకిస్తాన్‌తో రెండో సెమీఫైనల్లో మంగళవారం తలపడనుంది. ఈ మ్యాచ్ విజేత ఇప్పటికే ఫైనల్‌కు చేరిన ఆస్ట్రేలియాతో శనివారం తలపడుతుంది. పృథ్వీ షా సారథ్యంలోని బలీయమైన టీమిండియా విజయం నల్లేరుమీద నడకే అనక తప్పదు. భారత్ ఇప్పటికే మూడు సార్లు ప్రపంచకప్ గెలవగా... పాక్ రెండుసార్లు కైవసం చేసుకుంది. దాయాది దేశాలు కావడంతో పోరుపై అమితాసక్తి ఉండడం ఖాయం. వరుస విజయాలతో సెమీస్ చేరిన టీమిండియా పాక్‌ను ఓడించడం పెద్ద కష్టమేమీ కాదు గానీ అతి విశ్వాసానికి పోతే మాత్రం పరాభవం తప్పదు! ప్రారంభ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ చేతిలో ఓడి పాక్ ఆ తర్వాత వరుస విజయాలతో సెమీస్ చేరింది. అయితే అవన్నీ కొద్దిపాటి తేడాతోనే. ఆ జట్టులో బౌలర్ షాహీన్ అఫ్రిది, మిడిలార్డర్‌లో అలీ జర్యబ్ బాగా ఆడుతున్నారు. నాలుగు మ్యాచ్‌ల్లోనే 11 వికెట్లు తీసిన అఫ్రిదితో భారత బ్యాట్స్‌మెన్ జాగ్రత్తగా ఉండాలి. అతడు ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్లు తీశాడు. సెమీస్ జరిగే హెగ్లే ఓవల్ మైదానంలో పరిస్థితులు పాక్‌కు బాగా అనుకూలంగా ఉన్నాయి. క్వార్టర్‌ఫైనల్లో ఆ జట్టు దక్షిణాఫ్రికాతో తలపడి విజయం సాధించింది ఇక్కడే. నేడు విజయం సాధించిన జట్టు శనివారం జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాతో ప్రపంచకప్‌కై తలపడనుంది.



పాకిస్తాన్ కెప్టెన్ హసన్ ఖాన్

ఇటీవల బెంగళూరులో జరిగిన ఐపీఎల్ వేలంలో భారత యువ క్రికెటర్లు మంచి ధరే పలికారు. సరాసరి 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరే ఎడమచేతి వాటం పేసర్ నాగర్‌కోటిని రూ.3.2 కోట్లు, మరో బౌలర్ శివమ్ మావిని రూ.3 కోట్లు పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుగోలు చేసింది. ఇక బ్యాటింగ్ సంచలనం, అండర్-19 సారథి పృథ్వీషాను ఢిల్లీ డేర్‌డెవిల్స్ 1.2 కోట్లు, శుభ్మన్ గిల్‌ను కోల్‌కతా 1.8 కోట్లు పెట్టి కొనుగోలు చేసుకున్నాయి. ఇక ఎడమచేతి వాటం స్పిన్నర్ అంకుల్‌రాయ్‌ను రూ.20 లక్షలకు ఢిల్లీ, అభిషేక్ శర్మను రూ.55 లక్షలకు ముంబయి కొనుగోలు చేశాయి. షాతో ఓపెనింగ్‌కు దిగే మన్‌జ్యోత్‌ను కనీస ధర రూ.20 లక్షలకు ఢిల్లీనే తీసుకుంది. అండర్-19లో యువ క్రీడాకారులను ఇప్పటికే కొన్ని ఫ్రాంచేజీలు కొనుగోలు చేసిన కారణంగా... నేటి మ్యాచ్ ద్వారా వీరి ప్రతిభను ప్రత్యక్షంగా తిలకించనున్నాయి. వీరి ప్రతిభ ఆధారంగా త్వరలో జరిగే ఐపిఎల్‌లో తుదిజట్టులో వారి స్థానం ఆధారపడి ఉండబోతోంది.

భారతజట్టు : పృథ్వీషా (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, ఆర్యన్ జుయల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్, హార్విక్ దేశాయ్, మన్‌జ్యోత్ కార్ల, కమలేశ్ నాగర్‌కోటి, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్ పోరెల్, హిమాన్షు రాణా, అంకుల్ రాయ్, శివమ్ మావి, శివ సింగ్

పాకిస్తాన్ జట్టు : హసన్ ఖాన్ (కెప్టెన్), రొహైల్ నజీర్, మహ్మద్ అలీ ఖాన్, అలీ జర్యబ్, అమ్మద్ ఆలమ్, అర్షద్ ఇక్బాల్, ఇమ్రాన్ షా, మహ్మద్ తహా, మోషిన్ ఖాన్, మహ్మద్ ముసా, మహ్మద్ జైద్, మునీర్ రియాజ్, షాహీన్ అఫ్రిది, సులేమాన్



ఎడ్వార్డ్ 72 పరుగులు

ఫైనల్లో ఆస్ట్రేలియా

సంచలన విజయాలతో సెమీఫైనల్లోకి ప్రవేశించిన ఆఫ్ఘనిస్తాన్‌పై సెమీస్‌లో ఓడింది. ఆస్ట్రేలియా సోమవారం తలపడిన ఆఫ్ఘన్ 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన ఆఫ్ఘన్ జట్టు 48 ఓవర్లలో 181 పరుగులు మాత్రమే చేసింది. ఆసీస్ బౌలర్ మెర్లో 24 పరుగులకే 4 వికెట్లు సాధించాడు. అనంతరం ఆ లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 37.3 ఓవర్లలో సాధించి ప్రపంచకప్ ఫైనల్లోకి ప్రవేశించింది. 65 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 72 పరుగులు చేసిన ఎడ్వార్డ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

చేనేత సమస్య మ్యానిఫెస్టోలో పెడతాం

ప్రధాని దృష్టికి నేతన్న సమస్యలు

ధర్మవరం పర్యటనలో పవన్ కళ్యాణ్



అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగిన చేనేత సభలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి
వ్యవసాయం తర్వాత అత్యధిక మంది ఆధారపడి జీవనం సాగిస్తున్న చేనేత రంగాన్ని ఆదుకునేలా జనసేన మ్యానిఫెస్టోను తయారు చేస్తామని పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనంతపురం జిల్లాలో చేపట్టిన చలోరే..చలోరే కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. ముందుగా పుట్టపర్తిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడంలో సత్యసాయి బాబా స్ఫూర్తితో ముందుకెళ్తానన్నారు. నూతన జిల్లాల ఏర్పాటు జరిగితే పుట్టపర్తిని సాయి జిల్లాగా మార్చాలని కేంద్రాన్ని కోరుతానని చెప్పారు. అనంతరం ధర్మవరంలో ఏర్పాటు చేసిన చేనేత సదస్సులో చేనేత కార్మికులు, వ్యాపారులతో ముఖాముఖి నిర్వహించారు. చేనేత కళకు ప్రపంచఖ్యాతిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. నేతన్నల సమస్యలను ప్రధానికి విన్నవిస్తానని తెలిపారు. దశాబ్దాలుగా చేనేత కుటుంబాలు చితికిపోతున్నాయని, వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణను ఆయన స్వగృహంలో కలిసి చేనేత సమస్యలపై చర్చించారు. అక్కడి నుంచి హిందూపురం వెళ్లి జనసేన కార్యకర్తలు, అభిమానుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం తాను తలపెట్టిన మహాయజ్ఞానికి అభిమానులు, కార్యకర్తలు తోడ్పాటు ఇవ్వాలన్నారు. పవన్ పర్యటనలో భాగంగా పుట్టపర్తి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, హిందూపురం జెవిఎస్ ఫంక్షన్ హాలులో అద్దాలు పగలటంతో అభిమానులకు స్వల్ప గాయాలయ్యాయి. హిందూపురంలో పెద్ద ఎత్తున అభిమానులు తరలి రావడంతో మూడు గంటల పాటు ట్రాఫి క్‌కు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, మహేంద్రరెడ్డి, వరున్, అశోక్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్‌కు మలింగ గుడ్‌బై?



కొలంబో : శ్రీలంక పేస్ బౌలర్ లలిత్ మలింగ(34) క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్నాడు. ఇటీవల ఆ జట్టు బంగ్లాదేశ్ ట్రై సిరీస్‌లో చోటు లభించకపోవడమేగాక.. భారత్‌లో పర్యటించిన శ్రీలంక జట్టులోనూ స్థానం కల్పించలేదు. దీంతో తాను వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచకప్‌కు ముందే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు తెలిపాడు. ఇచ్చే నెలలో జరిగే ఇంగ్లండ్ పర్యటన అనంతరం తాను క్రికెట్‌నుండి వీడ్కోలు తీసుకోనున్నట్లు చెప్పాడు.

కిసాన్ మేళా భూ స్వాముల కోసమా?

మంత్రి సోమిరెడ్డిని నిలదీసిన రైతాంగం



మంత్రిని నిలదీస్తున్న రైతులు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి, విశాఖ
కిసాన్ మేళా భూస్వాముల కోసమా? రైతుల కోసమా? అని సిపిఎం నాయకులు, రైతులు, వివిధ సంఘాల నాయకులు వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని నిలదీశారు. సోమవారం విశాఖలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు మాట్లాడే అవకాశం కల్పించకపోవడంపై ప్రశ్నించారు. తుమ్మపాల సుగర్స్ ఫ్యాక్టరీ తెరిపించాలని విజ్ఞప్తులను సైతం పట్టించుకోకుండా మంత్రి ప్రసంగించారు. రైతాంగం, ఫ్యాక్టరీ గురించి ఏదో చెబుతారని ఆశించినప్పటికీ కేవలం సుగర్స్ ఫ్యాక్టరీపై స్టడీ చేస్తానని, నెల్లూరులో కూడా ఒక సహకార సుగర్స్ ఫ్యాక్టరీ మూత పడింది, క్రిబ్‌కో వంటి కేంద్ర అనుబంధ సంస్థల వారికి అప్పగించి పరిశ్రమలు నడిపిం చేందుకు చూస్తామని తెలిపి ప్రసంగం ముగించారు. దీంతో సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, ప్రజా రాజకీయ వేదిక కనిశెట్టి సురేష్‌బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరనాధబాబులు మంత్రి సభ నుంచి దిగిపోతుండగా రాష్ట్రంలో అరగంటకో ఆత్మహత్య జరుగుతుందని మీరు ఆత్మహత్యలు తగ్గాయని చెప్పడం హాస్యా స్పందంగా ఉందని నిలదీసే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన అవేమీ పట్టించు కోకుండా వేదిక దిగిపోయారు. రైతులకు మాట్లాడే అవకాశం ఇవ్వని కిసాన్ మేళా దేనికంటూ నిలదీశారు. గతంలో ఉన్న సాంప్రదాయాలను తుంగలో తొక్కారన్నారు. మంత్రికి, కిసాన్ మేళాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జోక్యం చేసుకొని మాకు వాయిస్ ఉందని దీనిని ఇష్యూ చేయవద్దని కూర్చోవాలని గద్దించారు. నేను రైతు బిడ్డనేనని తుమ్మపాల సుగర్స్ ఫ్యాక్టరీ ఆధునీకరణకు కట్టుబడి ఉన్నానని ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తు చేశానని, దీనిపై ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. అయినప్పటికీ రైతులు తగ్గలేదు. మంత్రి ఉన్నప్పుడు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఇప్పుడు ఇచ్చి ఏమీ ప్రయోజనమని నిలదీశారు. అధికారులు కూడా రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. దీంతో కొంత మందికి మాట్లాడే అవకాశం కల్పించారు.

జీతాలు ఆపేస్తాం
కార్మికులకు మంత్రి హెచ్చరిక

జీతాలు ఇవ్వకుండా ఆపించేస్తాను.. జాగ్రత్తా! అంటూ మంత్రి సోమిరెడ్డి తుమ్మపాల సుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను హెచ్చరించారు. జీతాలు చెల్లించాలని మంత్రికి విజ్ఞప్తి చేసేందుకు కార్మికులు వినతిపత్రం పట్టుకొని స్టేజీ దిగి వెళిపోతుండగా ఎదురెళ్లారు. వారి వినతిపత్రాన్ని తీసుకోకుండానే జీతాలు ఆపించేస్తాను అంటూ ఆవేశంగా హెచ్చరించారు. దీంతో కార్మిక సంఘం నాయకులు నర్సింగరావు తదితరులను పోలీసులు పక్కకు నెట్టేశారు. దీంతో కార్మికులు అవాక్కయ్యారు.

సర్టిఫికెట్ లెస్ సేవలకు యత్నం

మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో సర్టిఫికెట్ లెస్ గవర్నమెంట్‌ను తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నట్లు ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అమెరికాలోని లాస్‌ఎంజిల్స్‌లో ఆయన సెంట్రా మెడ్, ప్రెస్‌మార్ట్ డిజిటల్ మీడియా కంపెనీ సిఇఒ విక్రమ్ తొర్పునూరితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జనన మరణ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా టెక్నాలజీని అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఈ ప్రగతి ప్లాట్‌ఫాంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విక్రమ్ తొర్పునూరి మాట్లాడుతూ ఏపి ప్రభుత్వంలో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, పాలసీలు, ఇతర అంశాలపై అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ హెల్త్ కేర్ సర్వీసులు భారత్‌లో విస్తరించాలని భావిస్తున్నామని, త్వరలో పూర్తి స్థాయి ప్రతిపాదనలతో వస్తామన్నారు. అనంతరం పిబి సిస్టమ్స్ కంపెనీ సిఇఒ వేణుగోపాల్‌తో భేటీ అయిన మంత్రి ఆన్ డిమాండ్ సాఫ్ట్‌వేర్, బీమా హెల్త్‌కేర్‌లో అ కామర్స్ సర్వీసెస్ అందిస్తున్న పిబి సిస్టమ్స్‌పై చర్చించారు. అనంతరం లాస్‌ఎంజిల్స్ పర్యటన ముగించుకుని సాన్‌ఫ్రాన్సిస్‌కోకు చేరుకున్నారు. అమెరికాలో ఉన్న తెలుగు వారి తలసరి ఆదాయం పెంచడానికి సహకారం అందిస్తామని లాస్‌ఎంజిల్స్‌లోని తెలుగు సిఇఒలు, సాన్‌ఫ్రాన్సిస్కోలో ఎన్‌ఆర్‌ఐ టిడిపి, ఎపి ఎన్‌ఆర్టీ సభ్యుల సమావేశంలో లోకేశ్ వెల్లడించారు. అమెరికాలో తెలుగువారి తలసరి ఆదాయం రూ.86 వేలుగా ఉందని, దీనిని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68